epaper.samayamdaily.net
APTEL/2006/18267
# సమయం
మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక

సమయం
విలేకరులు కావలెను
ఫోన్ నెం : 99483 13985/ 89789 80131

సంపుటి: 19 | సంచిక: 51 | ఎడిటర్ : విక్రం కుమార్ | ఆదివారం 30 నవంబర్ 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 12 | వెల:రూ.5 |



## మేడారం జాతరకు జాతీయ హోదా ఇవ్వలేం

దేశంలో ఏ ఉత్సవాలకు ఆ హోదా లేదు

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

02



1 నుంచి పార్లమెంట్

## శీతాకాల సమావేశాలు

రాజ్‌నాథ్ అధ్యక్షతన నేడు అఖిలపక్ష భేటీ

.. వివరాలు 4లో

## ఆ స్లీపర్ బస్సులను తక్షణం పక్కన పెట్టేయండి

రాష్ట్రాలకు జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆదేశం




# ఎనర్జీ ఉంటేనే పెట్టుబడులు

స్టోరేజీకి అనుగుణంగా గ్రీన్ ఎనర్జీ

- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ ఎకానమీ టార్గెట్
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

**హైదరాబాద్, నవంబరు 29:** తెలంగాణ భవిష్యత్ విద్యుత్ అవసరాలకు ప్రణాళికలు సిద్ధం చేశామని, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ ఎకానమీ టార్గెట్‌తో తెలంగాణ ముందుకు పోతుందని భట్టి వెల్లడించారు. తెలంగాణ ప్రపంచ దేశాలతో పోటీపడే విధంగా తీర్చి దిద్దుతున్నామని, హైదరాబాద్ గ్లోబల్ హబ్ కాబోతోందని భట్టి తెలిపారు. 2047 వరకు మూడు ట్రిలియన్‌ల ఎకానమీకి చేరుకోవాలనేది లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. అందుకు కావలసిన పెట్టుబడులకు అవసరమైనది విద్యుత్ అన్నారు. అనుకున్న లక్ష్యం చేరుకోవడానికి ప్లానింగ్ చేస్తున్నాం.. పవర్ డిమాండ్ రాష్ట్రంలో పదేళ్లుగా పెరుగుతుందని తెలిపారు.

మిగతా 2 లో

గ్రీన్ ఎనర్జీ.. దేశ, ఆయా రాష్ట్రాల అభివృద్ధికి చాలా అవసరమని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా గ్రీన్ ఎనర్జీ అనే చర్చ జరుగుతుందని అన్నారు. పారిస్‌లో జరిగిన అగ్రిమెంట్ ప్రకారం అభివృద్ధి చెందుతున్న దేశాల్లో 50 శాతం తప్పకుండా గ్రీన్ ఎనర్జీ ఉండాలని అగ్రిమెంట్ చేసిన విషయాన్ని ఆయన ఈ సందర్భంలో గుర్తు చేశారు.






## డాక్టర్‌ను ట్రాప్ చేసి 14 కోట్లు కొట్టేశారు!

కొంపముంచిన ఫేస్‌బుక్‌పరిచయం

ఆమె సూచనతో పెట్టుబడి పెట్టి దివాళా

చైనీస్‌సైబర్ ఫ్రాడ్‌గ్యాంగ్‌గా గుర్తింపు

1.80 కోట్లు ఫ్రీజ్.. మిగతాది విదేశాలకు..

ఫేస్‌బుక్‌లో హాయ్ చెప్పి.. ఓ డాక్టర్‌ని మోసం చేసిందో లేడి. పెట్టుబడి పెడితే డబ్బులు డబుల్ అవుతాయని చెప్పి.. కోట్లు కొట్టేసింది. బాధితుడి ఫిర్యాదు మేరకు సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. హైదరాబాద్ ఎర్రగడ్డ ప్రేమ్‌నగర్‌కు చెందిన ఓ వ్యక్తి ప్రైవేటు హాస్పిటల్‌లో డాక్టర్‌గా పనిచేస్తున్నాడు.

02



## సీఎం రేవంత్‌తో శుభలేఖ సుధాకర్‌భేటీ

రవీంద్రభారతిలో ఎస్పీబీ విగ్రహావిష్కరణకు ఆహ్వానం

**హైదరాబాద్, నవంబర్29:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రముఖ సినీనటుడు, శుభలేఖ సుధాకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. డిసెంబర్ 15న రవీంద్ర భారతి ఆవరణలో దివంగత ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రావాలని ముఖ్యమంత్రిని ఆహ్వానించారు. రవీంద్ర భారతి ఆవరణలో విగ్రహ ఏర్పాటుకు అనుమతించినందుకు ఎస్పీ బాలు కుటుంబం తరపున ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## దంపతులను బురిడీ కొట్టించి 3.5 కోట్లు దోపిడీ

- ఎమ్మెల్యేను ఆశ్రయించిన బాధితులు
- క్షుద్రపూజలతో భయపెట్టాడు, మాయమాటలు చెప్పాడు
- అందినకాడికి దోచుక్కుని బెదిరింపులు

02

మిగతా 2 లో



## ప్రభుత్వ భూములు అమ్ముకునే కుట్ర

- గ్లోబల్ సమ్మిట్ పేరుతో రియల్ వ్యాపారం
- సీఎం రేవంత్‌పై ఎమ్మెల్యే హరీష్ ఆరోపణలు

3

## కేసీఆర్ ఎప్పుడు రావాలో అప్పుడే వస్తారు

- కొందరు మూర్ఖులు కనిపించడం లేదంటున్నారు
- కేసీఆర్‌ది దొంగదీక్ష అన్న వారికి ఉద్యమం ఏంతెలుసు
- కాంగ్రెస్ నేతలపై మండిపడ్డ బీఆర్ఎస్ నేత కేటీఆర్



కొందరు మూర్ఖులు కేసీఆర్ కనిపించడం లేదని అంటున్నారని.. గోడకు వేలాడదీస్తే తుపాకీ కూడా మౌనంగానే ఉంటుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ లేకపోతే తెలంగాణ లేదని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని వారు కేసీఆర్‌ను విమర్శిస్తున్నారని మండిపడ్డారు.

3



## కర్నూలు జిల్లాలో రోడ్డు ప్రమాదం

**కర్నూలు :** కర్నూలు జిల్లా పరిధిలో శనివారం ఉదయం రెండు రోడ్డు ప్రమాదాలు సంభవిం చాయి. ఓ ప్రమాదంలో రెండు కార్లు ఢీకొని ఐదుగురు కర్నాకట వాసులు దుర్మరణం చెందారు. ఎమ్మిగనూరు నియోజకవర్గ

మిగతా 2 లో

రెండు కార్లు ఢీకొని ఐదుగురు మృత్యువాత

- ఇద్దరు చిన్నారులు సహా ఐదుగురు మృతి
- మంత్రాలయం దర్శనం కోసం వస్తుండగా ఘటన
- మృతులు కర్నాటక వాసులుగా గుర్తింపు

### కర్నూలు ప్రమాదంపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

తక్షణ సహాయక చర్యలకు ఆదేశం

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సూచన

## సర్పంచ్ ఎన్నిక కోసం ఎస్ఐ రాజీనామా

స్వచ్ఛంద పదవి విరమణ

03





# మేడారం జాతరకు జాతీయ హోదా ఇవ్వలేం..

**దేశంలో ఏ ఉత్సవాలకు ఆ హోదా లేదు ■ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**

**వరంగల్, నవంబర్29:** మేడారం జాతరకు జాతీయ హోదా కల్పించలేమని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్‌నుంచి వందే భారత్‌రైలులో వరంగల్‌కు కిషన్‌రెడ్డి చేరుకున్నారు. వరంగల్ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు పరిశీలించారు. అనంతరం భద్రకాళి అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. సెంట్రల్ ఆర్కాలజీ అధికారులతో కలిసి వెయ్యి స్థంబాల ఆలయాన్ని ఆయన సందర్శించారు. అభివృద్ధి పనులు ఆలస్యంపై అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మేడారం జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించి ఘనంగా నిర్వహిస్తోంది. అయితే జాతీయ పండుగగా ప్రకటించాలని ఏళ్లుగా డిమాండ్ ఉంది. దీనిపై తాజాగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. దేశంలో ఏ జాతరకు జాతీయ హోదా ఇవ్వలేదన్నారు. దేశంలో ఏ ఉత్సవాలకు జాతీయ హోదా లేదని తెలిపారు. మేడారానికి కూడా ఇవ్వడం కుదరదని స్పష్టం చేశారు. వరంగల్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. హెరిటేజ్ సిటీ, స్మార్ట్ సిటీకి నిధులు ఇచ్చామన్నారు. వెయ్యి స్తంభాల ఆలయంలో మండపం పునర్నిర్మాణం చేశామని చెప్పారు. భద్రాచలం రూ. 50 కోట్లు, రామప్పను రూ.150 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రసాద్ స్కీమ్‌లో రామప్ప, భద్రాచలం, జోగులాంబ ఆలయాన్ని డెవలప్ మెంట్ చేస్తున్నామని తెలిపారు. మేడారం జాతర విషయాన్ని కేంద్ర ట్రైబల్, టూరిజం మంత్రి దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

# పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు దారుణం



**వెంటనే క్షమాపణలు చెప్పాలి: ఎమ్మెల్యే అనిరుధ్**

**హైదరాబాద్, నవంబరు 29:** కోనసీమపై తెలంగాణ నాయకుల దిష్టి పడిందని ఏపి డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ అనడం తప్పు మాత్రమే కాదు, దారుణమని మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి వ్యాఖ్యానించారు. పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. ఎప్పుడూ మేము ఆంధ్రప్రదేశ్ సంక్షేమానికే మద్దతు ఇచ్చామని, రెండు రాష్ట్రాలు సౌహార్దంతో అభివృద్ధి చెందాలని కోరుకుంటామన్నారు. కానీ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర విభజన అడ్డుపడిందంటే మాత్రం ఊరుకోమన్నారు. పవన్ కళ్యాణ్ వెంటనే భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజల గురించి, తెలంగాణ ప్రాంతం గురించి తప్పుగా మాట్లాడితే సహించబోమని స్పష్టం చేశారు. తెలంగాణలో ఆంధ్ర కాంట్రాక్టర్లు కోట్లు రూపాయల స్కామ్ చేసిన సందర్భాలు ఉన్నాయని, రాబోయే రోజుల్లో వారి భరతం పడతామని ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి హెచ్చరించారు. పవన్ కళ్యాణ్‌కు తెలంగాణలో అభిమానులు ఉన్నారని, ఆయన సినిమాలను తెలంగాణ ప్రజలు ఎప్పుడూ బహిష్కరించ లేదని గుర్తుచేశారు. ప్రజల మధ్య విభేదాలు రేకెత్తించే వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని సూచించారు.

# ఐ అంటే ఇంటర్నెట్

**ఐబొమ్మ రవి నుంచి కీలక సమాచారం సేకరణ**

**మూడు రోజుల కస్టడీ అనంతరం చంచల్‌గూడకు తరలింపు**

**హైదరాబాద్, నవంబరు 29:** ఐబొమ్మ పూర్తిపేరు 'ఇంటర్నెట్ బొమ్మ' అని ఈ కేసులో అరెస్టయిన ఇమంది రవి వెల్లడించాడు. విశాఖలో సినిమాను బొమ్మగా పిలిచేవాళ్లమని చెప్పాడు. మరో వెబ్‌సైట్‌కు బలపం అని పేరు పెట్టాలని అనుకున్నట్లు తెలిపాడు. డొమైన్‌లో సాంకేతిక సమస్యతో 'ఎల్' అక్షరం తీసి బప్పంగా మార్చినట్లు వెల్లడించాడు. శనివారంతో నిందితుడి రెండో విడత కస్టడీ పూర్తయ్యింది. ఇందులో భాగంగా పోలీసులు అతడిని 3 రోజులపాటు ప్రశ్నించి.. కీలక సమాచారం సేకరించారు. పైరసీ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ గురించి పోలీసులకు రవి వివరించాడు. తాను అప్‌లోడ్ చేసిన సినిమాల్నీ టెలిగ్రామ్ నుంచి తీసుకున్నవేనని చెప్పాడు. అనంతరం నిందితుడిని కోర్టులో హాజరుపర్చారు. ఈ క్రమంలో అతను పోలీసుల ముందు సంచలన విషయాలు వెల్లడించాడు. రవి మెయిల్ అకౌంట్స్ రిట్రైవ్ చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు.. ఐబొమ్మ, బప్పం వెబ్‌సైట్స్‌లో 21వేలకు పైగా సినిమాలను గుర్తించారు. పైరసీ వెబ్‌సైట్స్ నుంచి సినిమాలు రికార్డింగ్ చేసినట్టు గుర్తించారు. ఓటీటీలో వచ్చే సినిమాలను కూడా రికార్డింగ్ చేసినట్టు రవి అంగీకరించినట్లు తెలిసింది. రికార్డింగ్ చేసిన ఆడియోలు, వీడియోల క్వాలిటీ పెంచేందుకు.. కరేబియన్ దీవుల్లో ఔట్‌సోర్సింగ్ వారితో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది. పైరసీ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ గురించి రవి పోలీసులకు వివరించాడు. తాను నిర్వహించిన వెబ్‌సైట్లపై కూడా క్లారిటీ ఇచ్చాడు. ఐబొమ్మ పూర్తిపేరు ఇంటర్నెట్ బొమ్మగా వెల్లడించాడు. విశాఖలో సినిమాను బొమ్మగా పిలిచేవాళ్లమని.. బొమ్మను ఇంటర్నెట్‌లో చూపిస్తున్నందుకే ఐబొమ్మ అని పేరు పెట్టినట్లు చెప్పాడు. మరో వెబ్‌సైట్‌కు బలపం పేరు పెట్టాలని భావించినట్లు తెలిపాడు. అయితే డొమైన్‌లో సాంకేతిక సమస్యతో ఒ అక్షరం తీసి బప్పంగా మార్చినట్లు వివరించాడు. తాను అప్‌లోడ్ చేసిన సినిమాలన్నీ టెలిగ్రామ్ నుంచి తీసుకున్నవే అని రవి అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు.

# సర్పంచ్ ఎన్నిక కోసం ఎస్ఐ రాజీనామా



**కోదాడ, నవంబరు 29:** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల కోలాహలం కొనసాగుతుంది. సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఓ సబ్ ఇన్‌స్పెక్టర్ తన ఉద్యోగానికి రాజీనామా చేశాడు. కోదాడ టౌన్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న పులి వెంకటేశ్వర్లు తన ఉద్యోగానికి రాజీనామా సమర్పించారు. స్వస్థలం కోదాడ మండలం గుడిబండ గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు ఆయన స్వచ్ఛంద పదవి విరమణ చేశారు. పుట్టిన ఊరికి సేవ చేయడమే లక్ష్యంగా ఇంకా 5 నెలల సర్వీస్ ఉండగానే వీఆర్ఎస్ తీసుకున్నట్లు వెల్లడించారు. మేజర్ గ్రామ పంచాయతీ అయిన గుడిబండలో మొత్తం జనాభా 4,486. ఓటర్లు 3,813. వార్డులు 12. ఆదివారం నుండి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగనుంది.




# ఎనర్జీ ఉంటేనే పెట్టుబడులు

మొదటి పేజీ తరువాయి

తాజాగా ప్రజా భవన్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.. 2014 నుంచి విద్యుత్తు 14.2 డిమాండ్ గ్రోత్ ఉందన్నారు. 2020-2021 నుంచి 5.44 గ్రోత్, 2024-25లో 9.8శాతం గ్రోత్ కనిపించిందని వెల్లడించారు. 2025 నుంచి 34, 35 వరకు తెలంగాణలో 6.4 గ్రోత్ ఉండే అవకాశం ఉందని స్పష్టం చేశారు. మూసి ప్రక్షాళన.. ఫ్యూచర్ సిటీ.. పెట్టుబడుల ఒప్పందం.. పరిశ్రమలు.. డేటా సెంటర్లతో హైదరాబాద్ గ్లోబల్ హబ్‌గా మారబోతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. 8.50 గ్రోత్ ఉండబోతుంది.. 2047కి లక్ష 39వేల మెగావాట్ల విద్యుత్ అవసరం.. తెలంగాణలో 2026 ఏప్రిల్ నాటికి 24769 మెగావాట్ల విద్యుత్ అందుబాటులో ఉంది.. వాడే విద్యుత్తులో 50 శాతం గ్రీన్ ఎనర్జీ వాడాలి.. ఎనర్జీ స్టోరేజ్ ప్లాన్ గతంలో లేదు.. పదేళ్ల క్రితం ప్లాన్ చేసుకుని ఉంటే బాగుండేది.. అవసరాలకు అనుగుణంగా ఎనర్జీ స్టోరేజ్ ప్లానింగ్ లేదు.. గ్రీన్ పవర్ ఎనర్జీ స్టోరేజ్‌కి తెలంగాణ అనుకూలం.. పదేళ్లుగా ఇలాంటి ప్రయత్నాలు చేయలేదు.. కానీ ఏపీ మొదలుపెట్టింది.. తెలంగాణలో మాత్రం ఆ ప్రయత్నమే లేదు.. థర్మల్ పవర్ కంటే.. గ్రీన్ ఎనర్జీ వస్తుంది.. కానీ తెలంగాణ అందుకోలేక పోయింది. మేము అధికారంలోకి వచ్చిన తర్వాత.. డిలైట్ లాంటి వాళ్ళను నివేదిక ఇవ్వండి అని అడిగాం.. ఒక్కరోజు బ్లాక్ ఔట్ అయితే 1500 నుండి 2000 కోట్లు నష్టపోతం.. అని వెల్లడించారు.


# రాజకీయ కోలాహలం

**ముగిసిన తొలిదశ నామినేషన్ల గడువు**

**హైదరాబాద్, నవంబరు 29:** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల కోలాహలం కొనసాగుతోంది. రాష్ట్రంలో తొలి విడత పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ గురువారం ప్రారంభమైన విషయం తెలిసిందే. శనివారంతో మొదటి విడత పంచాయతీ ఎన్నికల నామినేషన్ల గడువు ముగిసింది. తొలి రోజే సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు అభ్యర్థుల నుంచి భారీ స్పందన లభించింది. రాష్ట్రవ్యాప్తంగా తొలిరోజు సర్పంచి పదవుల కోసం 3,242 నామినేషన్లు, వార్డు సభ్యుల స్థానాలకు 1,821 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. రెండో రోజు సర్పంచ్ స్థానాలకు 4901 నామినేషన్లు దాఖలు. రెండో రోజు వార్డు మెంబర్ల స్థానాలకు 9643 నామినేషన్లు దాఖలు అయినట్లు తెలిపారు. రెండు రోజుల్లో సర్పంచ్ స్థానాలకు 8198 నామినేషన్లు, 11502 వార్డు మెంబర్ నామినేషన్లు దాఖలు అయినట్లు వెల్లడించారు. మొదటి విడతలో 189 మండలాల్లోని 4,236 సర్పంచ్ స్థానాలకు, 37,440 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికల కమిషన్ ఎన్నికలు నిర్వహించనున్నది. 30వ తేదీన నామినేషన్ పత్రాల పరిశీలన చేపడతారు. డిసెంబర్ 3 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు విధించారు. అదే రోజు పోటీలో ఉన్న తుది అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. డిసెంబర్ 11న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. పోలింగ్ ముగిసిన వెంటనే, అదే రోజు మధ్యాహ్నం ఓట్ల లెక్కింపు చేపట్టి వార్డు సభ్యులు, సర్పంచుల ఫలితాలను వెల్లడిస్తారు.

# ఒకే కుటుంబంలో తీరని విషాదం

- అంతుచిక్కని వ్యాధితో ముగ్గురు బాలల మృతి
- ఘటనతో అప్రమత్తం అయిన అధికార యంత్రాంగం
- గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటుచేసి పర్యవేక్షణ



**లక్నో, నవంబర్ 29:** ఉత్తరప్రదేశ్‌లో విషాదకర ఘటన చోటుచేసుకుంది. తీవ్ర జ్వరంతో బాధ పడుతూ గంటల వ్యవధిలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు చిన్నారులు మృత్యువాత పడ్డారు. ఈ ఘటన ఆ రాష్ట్రంలో తీవ్ర కలకలం రేపింది. విషయం తెలిసిన వెంటనే అధికారులు అప్రమత్తమయ్యారు. నెబువా నౌరంగియా బ్లాక్‌లోని గులార్హియా తోలా గ్రామంలో వరుసగా ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు చిన్నారులు మృతి చెందారు. వారి మృతికి కారణాలు తెలియరాలేదు. పింటు గౌర్ అనే వ్యక్తి కుమార్తె మంజు(7) వారం క్రితం అనారోగ్యానికి గురైంది. స్థానిక వైద్యుడి వద్ద చికిత్స అందించినప్పటికీ బాలిక కోలుకోలేదు. ఈ క్రమంలో మరో ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయింది. ఆ తర్వాత కొన్ని గంటలకే గౌర్‌కు చెందిన చిన్న కుమార్తె ఖుషి (3), కుమారుడు కృష్ణ (5) కూడా జ్వరంతో మృతి చెందారు. ముగ్గురు చిన్నారుల మృతి నేపథ్యంలో వైద్యశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. వీరి మృతికి గల కారణాలు తెలుసుకునేందుకు దర్యాప్తు చేపట్టారు. గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి.. గ్రామంలోని మిగిలిన పిల్లలకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారు. దర్యాప్తు అనంతరం పిల్లల మృతికి గల కారణాలు వెలువడతాయన్నారు. ఆరోగ్యశాఖ బృందం ఇప్పటివరకు గ్రామంలో 57 మంది పిల్లలకు మలేరియా, డెంగీ పరీక్షలు నిర్వహించినట్లు ఓ అధికారి తెలిపారు. అవసరమైన వారికి మందులు అందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ క్రమంలో ప్రభావిత ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనికి గల కారణాలను. నీటి నమూనాలను పరిశీలిస్తున్నారు. అలాగే ఆహార పదార్థాలపైనా ఆరా తీస్తున్నారు.

# దంపతులను బురిడీ కొట్టించి 3.5 కోట్లు దోపిడీ

**ఎమ్మెల్యేను ఆశ్రయించిన బాధితులు**

**క్షుద్రపూజలతో భయపెట్టాడు,**

**అందినకాడికి దోచుకుని ఆపై బెదిరింపులు**



**వనపర్తి, నవంబర్29:** ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: ఆరోగ్యం బాగుచేయాలని తనను ఆశ్రయించిన దంపతులను క్షుద్రపూజల పేరుతో భయపెట్టి ఏకంగా రూ.3.50 కోట్లు కొట్టేశాడో నకిలీ గురువు. ఈ ఘటన కర్నూలు జిల్లా ఆదోని మండలం బైచిగేరిలో చోటుచేసుకుంది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోవట్లేదని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో బాధితులు గోడు వెళ్లబోసుకున్నారు. తెలంగాణలోని వనపర్తి జిల్లా పెబ్బేరులో ఉంటున్న వెంకటయ్య, పద్మ దంపతులు ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. బైచిగేరి గ్రామానికి చెందిన దుర్గాసింగ్‌కు దేవుడు వస్తాడని, అక్కడికి వెళ్తే ఆరోగ్యం కుదుట పడుతుందని ఎవరో చెబితే కొన్ని రోజుల కిందట దంపతులు అక్కడికి వెళ్లారు. దీన్ని ఆసరాగా చేసుకున్న దుర్గాసింగ్ వారికి కట్టుకథలు చెప్పారు. మీ పొలంలో నిధి ఉందని, అది తీసేంత వరకూ మీకు, మీ పిల్లలకు ప్రాణహాని ఉంటుందని భయపెట్టాడు. ఆ నిధి తీస్తానని చెప్పి వారి నుంచి రూ.80 లక్షలు కాజేశాడు. ఓ రోజు రాత్రి బాధితుల స్వగ్రామం ఉండవల్లి శివారులోని వారి పొలంలో క్షుద్రపూజలు చేశాడు. అనంతరం ఇక్కడ అమ్మవారి విగ్రహం బయటపడిందని చెప్పి మూడడుగుల ఎత్తున్న విగ్రహాన్ని దంపతులకు చూపించాడు. ఈ విగ్రహాన్ని ఇంట్లో పెట్టుకుంటే ప్రాణహాని ఉంటుందని, అమ్మేస్తే రూ.కోట్లు వస్తాయని నమ్మబలికాడు. విగ్రహం కొనుగోలుకు విదేశాల నుంచి కొందరు దిల్లీకి వచ్చారని చెప్పి, ఐదు సార్లు బాధితులను దిల్లీకి తీసుకెళ్లాడు. ఈ క్రమంలో వారి నుంచి సుమారు రూ.3.50 కోట్లు వసూలు చేశాడు. చివరికి మోసపోయామని గ్రహించిన దంపతులు తమ డబ్బు తిరిగివ్వాలని దుర్గాసింగ్‌ను కోరారు. దాంతో అతడు బెదిరింపులకు దిగాడు. 'గ్రామంలోకి అడుగు పెడితే చంపేస్తామని దుర్గాసింగ్‌తో పాటు ముకుంద అనే వ్యక్తి మమ్మల్ని బెదిరించారు. దీనిపై పెబ్బేరు పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదు. గత నెల ఆదోనికి వచ్చి డీఎస్పీతో పాటు తాలూకా పోలీసు సీఐకి ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదు' అని దంపతులు ఎమ్మెల్యే వద్ద బోరున విలపించారు. ఎమ్మెల్యే ఆదోని డీఎస్పీతో ఫోన్‌లో మాట్లాడగా, సాక్ష్యాలు లేకపోవడంతో కేసు నమోదు చేయలేదని డీఎస్పీ తెలిపారు.

# డాక్టర్‌ను ట్రాప్ చేసి 14 కోట్లు కొట్టేశారు!

**కొంపముంచిన ఫేస్‌బుక్‌పరిచయం**

**ఆమె సూచనతో పెట్టుబడి పెట్టి దివాళా**

**చైనీస్‌సైబర్ ఫ్రాడ్‌గ్యాంగ్‌గా గుర్తింపు**




**హైదరాబాద్, నవంబరు 29:** సైబర్ నేరగాళ్ల ఉచ్చులో ఓ డాక్టర్ సర్వం పోగట్టుకున్నాడు. మోసాలను అడ్డుకునేందుకు పోలీసులు ఎన్నో రకాలు చర్యలు తీసుకున్నప్పటికీ సైబర్ నేరగాళ్లు కొత్త పద్ధతుల్లో దూసుకుపోతున్నారు. ప్రజలను మోసం చేస్తూ భారీగా డబ్బులను కొట్టేస్తున్నారు. తమ మాయ మాటలతో ప్రజల బ్యాంకు ఖాతాల్లోని డబ్బులను ఈజీగా సొంతం చేసుకుంటున్నారు. యాప్‌లను, కొత్త లింక్‌లను ఓపెన్ చేయొద్దని, ఓటీపీలు చెప్పవద్దని పోలీసులు పదే పదే చెబుతున్నారు. అయినా కూడా సైబర్ నేరగాళ్లు రోజుకో రకం మోసాలకు తెరతీస్తున్నారు. తాజాగా తెలంగాణలో భారీ మోసం వెలుగులోకి వచ్చింది. ఓ డాక్టర్..సైబర్ నేరగాళ్ల వలలో పడి పెద్ద మొత్తంలో నగదును పోగుట్టుకున్నాడు. హైదరాబాద్‌కు చెందిన ఓ డాక్టర్‌ను సైబర్ కేటుగాళ్లు ఎంతో ఈజీగా ట్రాప్ చేశారు. పెట్టుబడుల పేరుతో దాదాపు రూ.14 కోట్లను స్వాహా చేశారు. సదరు నేరగాళ్లు డాక్టర్‌ను సోషల్ మీడియా ద్వారా సంప్రదించారు. మోనిక మాధవన్ పేరుతో ఫేస్‌బుక్‌లో డాక్టర్‌కు మెసేజ్ చేశారు. ఆపై నకిలీ ట్రేడింగ్ వెబ్‌సైట్ లింక్ పంపించారు నేరగాళ్లు. చాలా పెద్ద మొత్తంలో లాభాలు వచ్చాయని డాక్టర్‌ను నమ్మించారు. అయితే డబ్బు విత్ డ్రా చేయాలంటే ట్యాక్స్ కట్టాల్సి ఉంటుందని చెప్పుకొచ్చారు. మొదట డాక్టర్ దానిని పట్టించుకోకపోవడంతో ట్యాక్స్ పే చేయాల్సిందే అంటూ అతడిపై సైబర్ నేరగాళ్లు తీవ్ర ఒత్తడి తీసుకొచ్చారు. ఇక డబ్బులు భారీగా వస్తాయన్న భ్రమలో డాక్టర్ కూడా వచ్చే డబ్బు కోసం ఉన్న డబ్బును సైబర్ నేరగాళ్లకు సమర్పించుకున్నాడు. తాను ట్యాక్స్ పే చేసినప్పటికీ అవతలి నుంచి ఎలాంటి నగదు రాకపోవడంతో మోసపోయినట్లు గుర్తించాడు. వెంటనే సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన సైబర్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. డాక్టర్‌కు వచ్చిన మెసేజ్ ఎక్కడి నుంచి వచ్చింది?... ఎవరు పంపారు? అనే దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఏది ఏమైనా సైబర్ నేరగాళ్ల వలలో పడి భారీ మొత్తంలో నగదును పోగుట్టుకోవద్దని ప్రజలకు సైబర్ పోలీసులు మరోసారి హెచ్చరించారు.

# కేసీఆర్ ఎప్పుడు రావాలో అప్పుడే వస్తారు

## కొందరు మూర్ఖులు కనిపించడం లేదంటున్నారు

- కేసీఆర్‌ది దొంగదీక్ష అన్న వారికి ఉద్యమం ఏంతెలుసు
- కాంగ్రెస్ నేతలపై మండిపడ్డ బీఆర్ఎస్ నేత కేటీఆర్



**హైదరాబాద్, నవంబరు 29:** కొందరు మూర్ఖులు కేసీఆర్ కనిపించడం లేదని అంటున్నారని.. గోడకు వేలాడదీస్తే తుపాకీ కూడా మౌనంగానే ఉంటుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ లేకపోతే తెలంగాణ లేదని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని వారు కేసీఆర్‌ను విమర్శిస్తున్నారని మండిపడ్డారు. పీసీసీ అధ్యక్షుడు కేసీఆర్ దీక్ష.. దొంగ దీక్ష అని మాట్లాడుతున్నారని.. అడ్డమైన మాటలు కొందరు మాట్లాడుతున్నారంటూ ఫైర్ అయ్యారు. సింహం తన గాథను తాను చెప్పుకోకపోతే, వేటగాడు చెప్పే పిట్టకథనే నిజం అనుకుంటారు అంటూ కేటీఆర్ పేర్కొన్నారు. దీక్షా దివస్ కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడుతూ... కేసీఆర్ ఎప్పుడు బయటకు రావాలో అప్పుడే వస్తారని తెలిపారు. ఎదురుదాడి ఎలా చెయ్యాలో కేసీఆర్‌కు తెలిసినంతగా ఇంకెవరికీ తెలియదన్నారు. నాయకుడిని నాయకుడే అంటారని.. అర్భకుడిని అర్భకుడే అంటారంటూ వ్యాఖ్యలు చేశారు. ఇలా మాట్లాడితే తనకు అహంకారం అంటారని.. కానీ తాను ఇలానే మాట్లాడుతానని.. ఏం చేసుకుంటారో చూసుకోండి అని అన్నారు. మహాభారతంలో పాండవులు హీరోలు.. విలన్లు కౌరవులు అని.. అలాగే రామాయణంలో హీరో శ్రీరాముడు... విలన్ రావణుడని తెలిపారు. ఇప్పుడు తెలంగాణ కథలో హీరో ఉన్నాడు... శకునులు, మారీచులు ఉన్నారంటూ కామెంట్స్ చేశారు. చరిత్రను మలుపు తిప్పిన రోజు కేసీఆర్ దీక్ష చేసిన రోజు అని చెప్పుకొచ్చారు. సచ్చుడో తెలంగాణ వచ్చుడో అన్న కేసీఆర్ నినాదం సునామీ సృష్టించిందన్నారు. కేసీఆర్ దీక్ష విఫలం కావాలని చాలా మంది ప్రయత్నం చేశారని ఆరోపించారు. తెలంగాణ ఉన్నంత కాలం కేసీఆర్ అనే పదాన్ని ఎవరూ తుడిచివేయలేరని స్పష్టం చేశారు. టైం బాగాలేనప్పుడు గ్రామ సింహాలు కూడా పులుల్లా గర్జిస్తాయంటూ ఎద్దేవా చేశారు. ఎన్నడూ జై తెలంగాణ అననోళ్ళు పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నారంటూ మండిపడ్డారు. మొదటి నుంచి విలన్ పాత్ర పోషిస్తున్నది కాంగ్రెస్ పార్టీ అంటూ విరుచుకుపడ్డారు. పది మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి బైఎలక్షన్స్‌కు రావాలంటూ సీఎం రేవంత్‌కు మాజీ మంత్రి సవాల్ విసిరారు. సోనియా గాంధీని బలిదేవత అన్నది ఇప్పుడున్న ముఖ్యమంత్రి అని గుర్తుచేశారు. సోనియా గాంధీకి అసెంబ్లీలో ధన్యవాదాలు తెలిపిన సంస్కారి కేసీఆర్ అని అన్నారు. కేసీఆర్ దొంగ దీక్ష అయితే ఆనాడు కేంద్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు విరమించమని చెప్పిందని ప్రశ్నించారు. రాజీవ్ గాంధీ విగ్రహం స్థానంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని పెట్టుకుందామని దీక్షా దివస్ సాక్షిగా ప్రతిజ్ఞ చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ హీరోలను విలన్లుగా చిత్రీకరిస్తుందని విమర్శించారు. కాళేశ్వరం మీద కుట్ర జరిగిందని ఆరోపించారు. మేడిగడ్డ బ్యారేజ్‌ను బాంబులు పెట్టి కూల్చివేసే ప్రయత్నం జరిగిందన్నారు. గులాంల ఎగురులాట కొంత కాలమే... వచ్చే కాలమంతా గులాబీలదే అంటూ కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.



# దీక్షా దివస్ పేరుతో డ్రామాలు

## బిఆర్ఎస్ నేతలపై మండిపడ్డ సీతక్క

**హైదరాబాద్, నవంబరు 29:** బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఒక్కరోజే దీక్షా దివస్ చేసేవాళ్లని.. అధికారం పోయిన తర్వాత ఇప్పుడు పది రోజుల పాటు దీక్షా దివస్ పేరుతో నాటకాలు ఆడుతున్నారని మంత్రి సీతక్క విమర్శించారు. ప్రజలకు పదేళ్లలో చేసిన అభివృద్ధి ఏంటో ఈ దీక్షా దివస్‌లో చెప్పాలని డిమాండ్ చేశారు. అది చెపివుంటే ప్రజలు గమనించే వారని అన్నారు. రెండు సంవత్సరాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఎంతో చేసిందన్నారు. ఈ విజయాలను ప్రజలకు వివరించేందుకు తాము 10 రోజులపాటు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని.. వీటిని అడ్డుకునే కుట్రతోనే దీక్షా దివస్ పేరుతో బిఆర్ఎస్ నాటకాలు ఆడుతోందని మండిపడ్డారు. తెలంగాణ వచ్చాక వందల రెట్లు లబ్ది పొందింది కేసీఆర్ కుటుంబమేనని అన్నారు. అమరులు పోయారు ..వారి కుటుంబాలు పోయాయని అన్నారు. కానీ బిఆర్ఎస్ నేతలు మాత్రం కోట్లకు పడగలెత్తారని మండిపడ్డారు. ఆ పార్టీ దగ్గర అధికారం మాత్రమే లేదు. కోట్లాది రూపాయలు ఉన్నాయి. అధికారం ఉంటేనే ప్రజల్లో ఉంటాం.. లేకపోతే బయటకే రావొద్దని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. దీక్షా దివస్ పేరుతో చేస్తున్న డ్రామాలను తెలంగాణ ప్రజలు విశ్వసించరని మంత్రి అన్నారు. కొవిడ్‌ను ఆరోగ్యశ్రీలో చేర్చాలంటూ 2021లో ఇందిరా పార్క్ వద్ద సీతక్క దీక్ష చేపట్టారు. దీంతో ఆమెపై అప్పటి ప్రభుత్వం కేసు నమోదు చేసింది. కేసు విచారణలో భాగంగా నాంపల్లిలోని ప్రజా ప్రతినిధుల కోర్టుకు సీతక్క హాజరయ్యారు.

# భూములు అమ్ముకునే కుట్ర

- గ్లోబల్ సమ్మిట్ పేరుతో రియల్ వ్యాపారం
- సీఎం రేవంత్‌పై సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ ఆరోపణలు



సిద్ధిపేట, నవంబరు 29: గ్లోబల్ సమ్మిట్ పెట్టి భూములు అమ్ముకునేందుకు రేవంత్‌రెడ్డి ప్లాన్ చేస్తున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మాజీమంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. కేవలం రియల్ వ్యాపరమం కోసమే ఈ సమ్మిట్ అని ఆరోపణలు చేశారు. సిద్దిపేటలో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ..నవంబర్ 29వ తేదీ ఒక చరిత్ర.. ఉద్యమాన్ని మలుపు తిప్పిన రోజు ఇదని చెప్పుకొచ్చారు. ఉద్యమానికి సిద్దిపేటకు అవినాభావ సంబంధం ఉందని గుర్తుచేశారు. సిద్దిపేటలో జరిగిన ఉద్యోగుల గర్జన ఒక చరిత్ర అని వివరించారు. కేసీఆర్ ఆమరణ దీక్ష ఒక చరిత్ర.. ఎన్నో త్యాగాలతో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని పేర్కొన్నారు.'తెలంగాణ రాష్ట్రం కోసం మాజీ సీఎం కేసీఆర్ పోరాడారు. టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కేసీఆర్ పోరాటం గురించి మూర్ఖంగా మాట్లాడుతున్నారు. డిసెంబర్ 9వ తేదీ తెలంగాణ రాష్ట్ర ప్రకటన కేసీఆర్ దీక్ష ఫలితమే. మిలియన్ మార్చ్ మా వంతు.. మిలియన్‌ల కొద్దీ డబ్బు మూటలు కట్టి ఢిల్లీకి పంపుడు కాంగ్రెస్ వంతు. తెలంగాణ ఉద్యమ ద్రోహి రేవంత్‌రెడ్డికి కోదండ రామ్ దగ్గర అయ్యారు. మన నిధులు, మన నీళ్లు మనకు దక్కేలా చేసింది కేసీఆర్. కృష్ణానది నీళ్ల పంపకంపై ఆంధ్రప్రదేశ్.. తెలంగాణ ఉద్యమాన్ని కించపరిచేలా ట్రైబ్యునల్ ముందు మూడు రోజులుగా వాదిస్తుంది. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు ఈ విషయంపై మాట్లాడటం లేదు. తెలంగాణ రాష్ట్ర మూడు కోట్ల ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరచాలని చూడొద్దు. తెలంగాణ రావడంతోనే మన రాష్ట్రం పచ్చని మాగాణిగా మారి పంటలు పండుతున్నాయి. రాష్ట్రం ఉన్నంత కాలం కేసీఆర్ పోరాట చరిత్ర ఉంటుందని హరీశ్‌రావు పేర్కొన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాలలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో శనివారం దీక్ష దివస్ జరిగింది. ఈ కార్యక్రమంలో హరీశ్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, యాదవ రెడ్డి, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. ఇటీవల మరణించిన ఉద్యమకారుడు అందెశ్రీకి నివాళులు అర్పించారు నాయకులు. అంతకుముందు దీక్షా దివస్ సందర్భంగా సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్ చౌరస్తా నుంచి పొన్నాల బీఆర్ఎస్ జిల్లా కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ఆవరణలో ఉద్యమ స్ఫూర్తి పైలాన్‌ను తిరిగి ఆవిష్కరించారు.

# హుస్నాబాద్‌లో పలు అభివృద్ధి పనులు

## 3న సిఎం చేతుల మీదుగా ప్రారంభం

## పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన పొన్నం



**సిద్దిపేట, నవంబరు 29:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లాల పర్యటనలో భాగంగా డిసెంబర్ 3వ తేదీన హుస్నాబాద్‌లో పర్యటించనున్నారు. పలు కార్యక్రమాల్లో సీఎం పాల్గొంటారు. అనంతరం భారీ బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. సీఎం పర్యటన దృష్ట్యా పోలీసు అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో హుస్నాబాద్ పట్టణ శివారులోని ఏనె వద్ద మైదానంలోని బహిరంగ సభ ప్రాంగణాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. పోలీసులకు మంత్రి పొన్నం కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. ప్రజాపాలన ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జరిగిన అభివృద్ధి, ఇంకా చేయాల్సిన అభివృద్ధి పనులపై ఈ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతారని చెప్పుకొచ్చారు. హుస్నాబాద్ నియోజకవర్గానికి సంబంధించిన అనేక అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేస్తారని మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు. ముఖ్యమంత్రి, కేబినెట్ మంత్రుల సహకారంతో మిగిలిన సమస్యలను ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పరిష్కరించి ముందుకెళ్లే ప్రయత్నం చేస్తామని పేర్కొన్నారు. నాలుగు జిల్లాల మధ్యలో కేంద్రంగా ఉన్న హుస్నాబాద్ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి సభకు హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు.

# దీక్షా దివస్ అంటే స్వాతంత్ర్య దినోత్సవమే

- తెలంగాణ వచ్చేదాకా దీక్ష విరమించని కెసిఆర్
- భువనగిరి దీక్షా దివస్‌లో మాజీమంత్రి జగదీశ్ రెడ్డి




**యాదాద్రి భువనగిరి, నవంబరు 29:** కేసీఆర్ నా శవయాత్ర.. తెలంగాణ జైత్ర యాత్ర ఒకేసారి జరగాలి అన్నారని.. అప్పటిదాకా దీక్ష విరమించేది లేదని పట్టుబట్టారని అంటూ ఆనాటి ఘటనలను మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి గుర్తు చేశారు. ఆనాటి ఆంధ్రా పోలీస్‌లు, నాయకులు ఎన్నో జిమ్మిక్కులు చేశారని.. అయినా అన్నింటిని ఛేదించి తెలంగాణ సాధించామన్నారు. భువనగిరి జిల్లా కేంద్రంలో నిర్వహించిన దీక్షా దివస్ వేడుకల్లో సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రరెడ్డి పాల్గొన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నవంబర్ 29 దీక్ష దివస్ మనందరికీ స్వాతంత్ర్యం తెచ్చిన రోజు అని తెలిపారు. దేశానికి ఆగస్టు 15 ఎలాగో, మనకు నవంబర్ 29 అలాగేనన్నారు. కేసీఆర్ చావు నోట్లో తలపెట్టి, మొక్కవోని పట్టుదలతో దీక్ష చేసి, ఢిల్లీ మెడలు వంచిన రోజనరి పేర్కొన్నారు. కేసీఆర్ దీక్ష చేసిన 11 రోజులు ఒక్కోక్షణం ఒక్కో భయంతో గడిపామని.. తమ నేతకు ఏమైనా అయితే తెలంగాణ ఎటు పోతుందో అని కన్నీరు పెట్టామన్నారు. కే హైదరాబాద్ లేకుండా తెలంగాణ అన్నారని.. అప్పుడు కేసీఆర్ గుండె లేని మనిషి వున్నా లేనట్లే హైదరాబాద్‌తో కూడిన తెలంగాణనే కావాలని పట్టుబట్టారన్నారు. ఢిల్లీ గడగడ లాడిపోయిందని.. తెలంగాణ బెబ్బులిలా నిలబడి బరిగీసి కొట్లాడింది.. లక్ష్యం ముద్దడినం అంటూ గుర్తు చేశారు. కేసీఆర్ అంటే తెలంగాణ తెచ్చిన ముఖ్యమంత్రి.. తెలంగాణ కోసం చావు అంచుల దాకా, పేగులు తెగే దాకా కొట్లాడిన ఉక్కు మనిషి కేసీఆర్ అన్నారు. అలాంటి కేసీఆర్‌పై ఇప్పుడు కాంగ్రెస్ దొంగలు అవాకులు చవాకులు మాట్లాడుతున్నారని.. తస్మాత్ కొడుకుల్లారా.. కేసీఆర్‌పై నోరు జారితే ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. కేసీఆర్ తెలంగాణ సమాజానికి దేవుడని.. అందరి గుండెల్లో గూడు కట్టుకున్న మహానేత మా కేసీఆర్ అన్నారు. కేసీఆర్ సైనికులుగా మేమంతా తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి పని చేశామని.. ఇప్పుడు వస్తున్న 24 గంటల కరంట్, మంచి నీళ్లు, పాడి పంటలు, తెలంగాణ ఆదాయం అన్ని అన్ని కేసీఆర్ సాధించినవేనన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ వాళ్లు అనుభవిస్తున్న పదవులు అన్ని కేసీఆర్ తెచ్చినవేనని.. కేసీఆర్‌పై కుట్రలు చేయని పార్టీ లేదని.. ఎప్పుడు పిల్లి శాపనార్థాలు పెడతారని విమర్శించారు. ఇప్పుడు కూడా కేసీఆర్ ఆరోగ్యం బాగాలేదని అబద్దాలు ప్రచారం చేస్తున్నారని.. కేసీఆర్ మళ్లీ సీఎం కావడం ఖాయమన్నారు. తెలంగాణ అభివృద్ధి జరిగిగేది ఒక్క కేసీఆర్‌తోనే సాధ్యమని.. తెలంగాణ వాదులపై తుపాకీ ఎక్కుపెట్టిన దుర్మాగుడు రేవంత్.. ఆయన పాలనే ఇప్పుడు నడుస్తుండడం దౌర్భాగ్యమన్నారు. తెలంగాణలో లాఠీ, లూఠీ పాలన నడుస్తుందని.. తెలంగాణ కాంగ్రెస్ విముక్త రాష్ట్రంగా అయ్యేంత వరకు పోరాటం చేద్దామంటూ జగదీశ్‌రెడ్డి పిలుపునిచ్చారు.

# రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ దీక్షా దివస్

## సిద్దిపేటలో హరీష్ రావు బైక్ ర్యాలీ ■ తెలంగాణ భవన్‌లో కేటీఆర్ నివాళి




**హైదరాబాద్, నవంబర్ 29:** రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు దీక్షా దివస్‌ను ఘనంగా జరుపుకున్నారు. సిద్దిపేటలో అంబేద్కర్ విగ్రహానికి హరీశ్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి,ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, యాదవరెడ్డి పాల్గొన్నారు. హైదరాబాద్‌లోనూ దీక్షా దివస్‌ను ఘనంగా జరుపుకున్నారు. తెలంగాణ భవన్‌కు భారీగా బీఆర్ఎస్ శ్రేణులు తరలివచ్చాయి. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి, అమరవీరులకు నివాళులర్పించారు. ఉస్మానియా యూనివర్సిటీలో బీఆర్ఎస్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలో మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో దీక్షా దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవరం మాట్లాడుతూ.. కేసీఆర్ దీక్షతోనే తెలంగాణ వచ్చిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ ప్రాణత్యాగానికి కూడా సిద్ధపడ్డారని పేర్కొన్నారు. తెలంగాణను అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌దే అని చెప్పారు. ఖమ్మంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్సీ తాతా మధు, ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, చంద్రావతి పాల్గొన్నారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. దీక్షా దివస్ సందర్భంగా సంగారెడ్డిలో అమరవీరులకు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, రాష్ట్ర నాయకులు దేవీప్రసాద్ ఇతర బీఆర్ఎస్ నాయకులు నివాళులర్పించారు.



సంపాదకీయం

# రాజకీయ పార్టీల నిబద్ధతకు పరీక్ష!

రాజకీయాల్లో సంకల్ప బలం ముఖ్యం. తమతో పాటు బడుగుబలహీన వర్గాలను ముందుకు తీసుకుని వెళ్లామన్న ప్రయత్నం చేయాలి. ఎంతసేపు వారే పల్లకి మోయాలన్న ఫ్యూడల్ భావాలను వీడాలి. పల్లకి ఎక్కే అవకాశం వారికి కూడా కల్పించాలి. వారినీ సానబెట్టి రాటదేలేలా చేయాలి. స్థానిక ఎన్నికల్లో 42 శాతం బిసి రిజర్వేషన్ల అభ్యర్థనను హైకోర్టు తిరస్కరించింది. ఇదే అదనుగా కాంగ్రెసేతర పార్టీలు కాంగ్రెస్‌ను తిట్టిపోస్తూ రాజకీయంగా లబ్దిపొందాలని చూస్తున్నాయి. నిజానికి రాజకీయంగా లబ్ది పొందాలంటే ఆయా వర్గాల్లో పట్టును సాధించాలి. అందుకు పార్టీ పరంగా ఆయా వర్గాలను ముందుకు తీసుకుని వెళ్లాలి. హైకోర్టు తీర్పు తరవాత గత్యంతరం లేని పరిస్థితు ల్లో ప్రభుత్వం పాతపద్దతిలోనే స్థానిక ఎన్నికలకు సిద్దం అయ్యింది. ఇది ఆహ్వానించదగ్గ విషయం. రిజర్వేషన్లు ఉంటేనే బిసిలను, ఎస్సీ,ఎస్టీలను ఆదరించడం కాదు...లేకున్నా వారికి రాజకీయంగా ప్రవేశం కల్పించాలి. ఇప్పుడు రాజకీయ పార్టీలు అదేపనిగా పాత వ్యవహారాలను తవ్వుతూ పోకుండా తమ పార్టీ పరంగా బిసిలు, ఎస్సీలు, ఎస్టీలను రాజకీయింగా పైకి తీసుకుని వచ్చే ప్రయత్నాలు చేయాలి. ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ పెట్టగానే ఎందరో ఎస్సీలు, ఎస్టీలు, బిసిలకు టిక్కెట్లు ఇచ్చి రాజకీయంగా వారికి అండగా నిలిచారు. అనామకులు ఎందరో రాజకీయంగా తెరపైకి చ్చారు. గుంటూరులో కాంగ్రెస్ దిగ్గజం ఆచార్య ఎన్‌జి రంగా లాంటి వారు అనామకుడి చేతిలో ఓటమి చెందారు. అలా ఆనాడు ఎన్టీఆర్ సృష్టించిన ప్రభంజనంలో మహామహులు ఓటమి చెందారు. కొత్త తరం రాజకీయాల్లోకి వచ్చింది. అలా రాజకీయాల్లోకి వచ్చి నిలదొక్కుకున్న వారు నిలదొక్కుకున్నారు. ఆ తరవాత అదే ఒరవడి సాగింది. ఇది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బడుగు, బలహీనవర్గాల రాజకీయ ప్రవేశాలకు నాంది పలికింది. కుల ప్రాతిపదికను మొదటి కమిషన్ రిజర్వేషన్లను వ్యతిరేకిస్తే, కులాన్ని ఒక సూచికగా తీసుకోవాలని ఉన్నత న్యాయస్థానం మండల్ కమిషన్ తీర్పులో స్పష్టం చేసింది. 1992లో ఇందిరా సహాని కేసులో సుప్రీంకోర్టు మొత్తం రిజర్వేషన్లు 50శాతానికి మించకూడదని ఇచ్చిన తీర్పు ఫలితంగా తమిళనాడు సహా ఎన్నో రాష్ట్రాల్లో ప్రతిష్టంభన ఏర్పడింది. చివరికి ఇందిరా సహాని కేసు కూడా పరీక్ష ఎదుర్కొనక తప్పలేదు. తమిళనాడు 69శాతం రిజర్వేషన్లు కల్పించినప్పటికీ సుప్రీంకోర్టు విధించిన పరిధి వల్ల సందిగ్ధత ఏర్పడింది. దీంతో అసెంబ్లీలో ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చి, 69శాతం రిజర్వేషన్లు అమలు అయ్యేట్టు, సుప్రీంకోర్టు విధించిన 50శాతం పరిధి నుండి రక్షణ పొందడానికి రాజ్యాంగం 9వ షెడ్యూల్లో చేర్చేట్టుగా అప్పటి ముఖ్యమంత్రి జయలలిత పావులు కదిపారు. అయితే ఇదంతా అసెంబ్లీ, పార్లమెంట్ వ్యవహారాల్లో పోరాడాల్సిన అంశం. అప్పటి వరకు ఈ వర్గాలను దూరం చేసుకోవడం తగదు. నిజానికి ఈ వర్గాలను దగ్గరకు చేసుకునేందుకు ఇదో మహత్తర అవకాశంగా రాజకీయ పార్టీలు భావించాలి. సర్పంచ్ పదవి అన్నది ఎవరైనా రాజకీయంగా ఎదగడానికి పరమపద సోపానం లాంటిది. యు-వతను రాజకీయాల్లో ఆహ్వానిం చేందుకు, గ్రామాలను అభివృద్దిలో నిలిపేందుకు ఇదో మంచి అవకాశం. అధికార కాంగ్రెస్ సహా అన్ని పార్టీలు సర్పంచ్ ఎన్నికల్లో వివిధ కులవర్గాలకు చెందిన సమర్థులైన యువతను నిలపాలి. చదువున్న వారికి ప్రాధాన్యం ఇవ్వాలి. నిజాయితీ రాజకీయాలను ప్రోత్సహించాలి. అందుకు రిజర్వేషన్లు లేనిచోట్ల ఎస్సీ,ఎస్టీ, బిసి వర్గాలను నిలబెట్టాలి. వారంతా రాజకీయంగా ఎదగడానికి అవకాశం వస్తుంది. దీంతో రాజకీయాల్లో కొత్తనీరు రావడానికి ప్రాతిపదిక వస్తుంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తెలంగాణ ప్రభుత్వం పాత రిజర్వేషన్లతోనే పంచాయతీ ఎన్నికలను నిర్వహించక తప్పడం లేదు. మరొకవైపు శాసనసభలో చేసిన తీర్మానాలకు కట్టుబడి, 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలుకు రక్షణ కల్పించేలా 9వ షెడ్యూల్‌ను ఆశ్రయించాలనే ఉద్యమం కొనసాగుతోంది. ఈ విషయంలో ప్రచారం వేగంగా మారుమూల ప్రాంతాల ప్రజలకు కూడా చేరింది. గ్రామాల్లో కూడా ఇప్పుడిప్పుడే యువత రాజకీయాల వైపు మొగ్గుచూపుతోంది. ఎంతకాలం వృద్ద జంబుకాలే పార్టీల్లో వేలాడకుండా కొత్తతరాన్ని ఆహ్వానించాలి. సమాజంలో అట్టడుగుస్థాయి వర్గాలను వెతికి పట్టుకుని, వారిని రాజకీయాల్లో ముందుకు తీసుకుని రావాలి. ఎంతకాలం వారిని కేవలం కార్యకర్తలుగానే ఉపయోగించకునే దౌర్భాగ్యం నుంచి బయటపడి నవతరం నాయకత్వం అవతరించే దిశగా నేడు పార్టీలు అడుగులు వేయాలి. పార్టీపరంగా వారికి అండదండలు కల్పించాలి. సవాళ్లను ఎదుర్కోవడానికి నిరంతర అవగాహన కల్పించాలి. వారిని రాజకీయాల్లో రాటుదేలేలా చేయాలి. విద్యార్థి ఉద్యమాలతో రాటుదేలిన వారిని ముందుకు దింపాలి. ఇందుకు పార్టీపరంగా సమైక్య పోరాటం అనివార్యంగా గుర్తించాలి. తెలంగాణ శాసనసభలో చేసిన ఏకగ్రీవ తీర్మాణాలకు అనుగుణంగా అన్ని రాజకీయ పార్టీలు 42శాతం రిజర్వేషన్లకు ఆమోదం తెలిపాయి. అదే స్ఫూర్తితో బీసీ సభ్యులను ఇప్పుడు గెలిపించుకోవాలి. పంచాయతీ ఎన్నికలలో సర్పంచ్ ఎన్నికకు పార్టీ గుర్తు ఉండదన్న నెపంతో వీరిని పక్కన పెట్టాలని చూస్తే అసెంబ్లీ తీర్మానాలకు విలువ ఉండదు. అందువల్ల అన్ని పార్టీలు ఈ విషయంలో తీవ్రంగా ఆలోచన చేసి, రిజర్వేషన్లు లేనిచోట్ల వివిధ వర్గాల అభ్యర్థులను నిలబెట్టి ముందుకు నడిపించాలి. రాజకీయాలలో ప్రతి ఒక్కరూ ఓటు వేసే విధంగా మనకు సమానత్వం ఉంది. కానీ సామాజిక, ఆర్థిక జీవితంలో మనకు అసమానతలు అనేకం ఉన్నాయి. ప్రధానంగా రాజకీయాల్లో పదవుల పందేరంలో ఇప్పటికీ అంగ్రవర్గాలదే పైచేయిగా ఉంటోంది. మనం ఈ వైరుధ్యాన్ని వీలైనంత త్వరగా తొలగించాలి. లేకుంటే అసమానతలు ఎదుర్కొంటున్న వారిలో ఆవేశం కట్టలు తెంచుకుంటే, అజమాయిషీ చెలాయిస్తున్న వారు అడుసులో కూరుకు పోతారు. ఎంతో కష్టపడి నిర్మించిన రాజకీయ ప్రజాస్వామ్య నిర్మాణాన్ని బలోపేతం చేయాలంటే అసమానతలు అన్నవి తొలగించుకుంటూ పోవాలి. అందుకు రిజర్వేషన్లే ప్రాతిపదిక కానవసరం లేదు. రాజకీయ సంకల్పం ఉంటే ఇది సాధ్యం అవుతుంది. ఉన్నత వర్గాల వారికి చట్టసభల్లో స్థానాలు తగ్గించి, బీసీ వర్గాలకు స్థానాలు పెంచడం వల్ల సామాజిక సామరస్యత వస్తుంది. ఇప్పుడు రిజర్వేషన్ల కోసం కొట్లాడుతున్న బీసీ నాయకులను ఎన్నికలలో గెలిపించిన చరిత్రను లిఖించినవారు అవుతారు.

# శ్రీలంకలో ద్విత్వా తుపాను బీభత్సం

- వరదలకు ఇప్పటికే 123మంది మృతి
- మరికొందరి ఆచూకీ గల్లంతు
- దేశంలో అత్యవసర పరిస్థితి ప్రకటన




**కొలంబో, నవంబరు 29:** దిత్వా తుఫాను కారణంగా శ్రీలంక చిగురుటాకులా వణికింది. ఈ ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటంతో ఇప్పటి వరకు 123 మంది మరణించగా.. అనేక మంది గల్లంతయ్యారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధి కారులు చెబుతున్నారు. ఈ క్రమంలో శ్రీలంక ప్రభుత్వం దేశంలో అత్యవసర పరిస్థితిని ప్రకటించింది. వరదల వ ల్ల ఏర్పడిన విధ్వంసం కారణంగా తలెత్తిన అత్యవసర పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకే దేశమమంతటా అత్యవసర పరిస్థితిని ప్రకటిస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. శనివారం శ్రీలంకను దాటిన దిత్వా తుఫాను 123 మందికి పైగా ప్రాణాలను బలిగొందని, విధ్వంసం, మౌలిక సదుపాయాలకు నష్టం వాటిల్లిందని ఆ దేశ అధికారులు తెలిపారు. 'ది త్వా శ్రీలంక నుండి భారత తీరం వైపు వెళ్లింది. ఈ క్ర మంలో భారీ వర్షం, అధిక వేగంతో కూడిన గాలులు వీ శాయి. ఈ తుఫాన్ కారణంగా ఇప్పటికే అనేక ప్రాంతాలు తీవ్రంగా నష్టపోయాయి. ఎంతో మంది జీవనం అస్తవ్యస్తంగా మారింది' అని వాతావరణ శాఖ డైరెక్టర్ జనరల్ అతుల కరుణనాయకే మీడియాతో తెలిపారు. ఇదే సమయంలో విపత్తు నిర్వహణ కేంద్రం శనివారం ఓ ప్రకటనలో పలు విషయాలను వెల్లడించింది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా అనేక ఇళ్లు ధ్వంసమయ్యాయనియని తెలిపింది. 43వేల మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించామని డీఎంసీ జనరల్ డైరెక్టర్ సంపత్ తెలిపారు. పోలీసులు, అధికారులు, రెస్క్యూ సిబ్బంది సహాయక చర్యలు కొనసాగుతున్నా యన్నారు. లోతట్టు ప్రాంతాల్లో పరిస్థితి మరీ దయనీయంగా ఉ ందన్నారు. వందలమందిని తాత్కాలిక పునరావాసాలకు తరలించామని డీఎంసీ జనరల్ డైరెక్టర్ వెల్లడించారు.

# స్లీపర్ బస్సు ప్రమాదాలపై ఆందోళన


- ఆ బస్సులను తక్షణం పక్కన పెట్టేయండి
- రాష్ట్రాలకు జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆదేశం



**న్యూఢిల్లీ, నవంబరు 29:** ఇటీవల స్లీపర్ బస్సుల కారణంగా జరిగిన పలు రోడ్డు ప్రమాదాల్లో అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో జాతీయ మానవ హక్కుల కమిషన్ రంగంలోకి దిగింది. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న స్లీపర్ బస్సులను తక్షణం పక్కనపెట్టేయాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు మార్గదర్శకాలు జారీ చేసింది. ఎన్‌హెచ్‌ఆర్‌సీ మార్గదర్శకాల ప్రకారం.. ఏఐఎస్:052, ఏఐఎస్:119 నిబంధనల మేరకు వాహనాలు ఉండేలా రిజిస్ట్రేషన్, రెన్యూవల్ సమయంలో చర్యలు తీసుకోవాలి. ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలి. బస్-బాడీ బిల్డింగ్ సంస్థలు, వాహనాల ఆపరేటర్లు నిబంధనలను అతిక్రమించకుండా కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ జాతీయ స్థాయిలో ఓ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. వాహనాల భద్రతకు సంబంధించి సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్టు (సీఐఆర్‌టీ) మార్గదర్శకాలను రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు అమలు చేయాలి. ఎమర్జెన్సీ సమయాల్లో అడ్డంకిగా మారే అవకాశం ఉ న్న బస్సులోపలి ఏర్పాట్లను తొలగించాలి. అవసరమైన మేరకు బస్సులను రికాల్ చేసి మార్పులు చేసేలా మార్గదర్శకాలు జారీ చేయాలి. మోటార్ వాహన చట్టం, ఏఐఎస్ ప్రమాణాల ఉల్లంఘనలకు బస్సు తయారీదారులతో పాటు అధికారులు కూడా బాధ్యులు అయ్యేలా చర్యలు తీసుకోవాలి. రోడ్డు ప్రమాద ఘటనల్లో బాధితులకు సహాయం, పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలి. ఇటీవల రాజస్థాన్‌లో జరిగిన బస్సు ప్రమాదంలో 20 మంది మరణించారు. ఈ నేపథ్యంలో ఎన్‌హెచ్‌ఆర్‌సీ వద్ద ఫిర్యాదు దాఖలైంది. నిబంధనల అతిక్రమణ కారణంగా అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారని ఫిర్యాదుదారులు పేర్కొన్నారు. ఇది జీవించే హక్కు ఉల్లంఘనేనని తెలిపారు. దీంతో.. ప్రమాదానికి గల కారణాలపై అధ్యయనం నిర్వహించాలని సీఐఆర్‌టీని ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఆదేశించింది.

## ఆక్స్‌ఫర్డ్ చర్చలకు రాకుండా
# అబద్ధాల ప్రచారం

### భారత్‌పై నోరు పారేసుకున్న పాక్ ప్రతినిధులు
### గట్టిగా తిప్పికొట్టిన భారత్ ప్రతినిధి



**న్యూఢిల్లీ, నవంబర్ 29:** తప్పుడు ప్రచారాలు చేయడం ద్వారా తప్పుకోవడం అలవాటు చేసుకున్న పాకిస్థాన్ మరోసారి తన వక్రబుద్ధిని చాటుకుంది. యూకేలో జరిగే ప్రముఖ చర్చలో పాల్గొనకుండా.. భారత్ అధికారులు వెనుదిరిగారంటూ తప్పుడు ప్రచారానికి తెర లేపింది. అయితే, దీన్ని భారత్ గట్టిగా తిప్పికొట్టింది. వివరాల్లోకి వెళితే.. యూకేలో ఆక్స్‌ఫర్డ్ యూనియన్‌లో గురువారం భారత్-పాక్ అధికారుల మధ్య చర్చజరగాల్సి ఉంది. ఇందులో భారత్ తరఫున మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ ఎంఎం నరవాణెళి, సుబ్రమణియన్ స్వామి, రాజస్థాన్ మాజీ ఉప ముఖ్యమంత్రి సచిన్ పైలట్‌లు పాల్గొనాల్సి ఉంది. పాక్ నుంచి ఆ దేశ మాజీ విదేశాంగ మంత్రి హీనా రబ్బానీ, యూకేలోని రాయబారి మొహమ్మద్గ ÷సైల్, రిటైర్డ్ జనరల్ జుబైరా మహమూద్ హయత్‌లు హాజరుకానున్నారు. అయితే, ఈ చర్చలో పాల్గొనకుండా భారత్ అధికారులు చివరి నిమిషంలో వెనుదిరిగారంటూ యూకేలోని పాక్ రాయబార కార్యాలయం తప్పుడు ప్రచారానికి తెరలేపింది. 'పాక్ బృందం ఇప్పటికే లండన్‌లో సిద్ధంగా ఉంది. ఆక్స్‌ఫర్డ్ చర్చల్లో పాల్గొనాల్సి ఉంది. అయితే, ఇందులో పాల్గొనకుండా భారత్ బృందం వైదొలగాలని నిర్ణయించుకుందని యూనియన్ నిర్వాహకులు తెలిపారు. అందుకు గల కారణాలు మాత్రం తెలపలేదని ఎక్స్‌లో రాసుకొచ్చింది. అయితే పాక్ అబద్ధపు ప్రచారాన్ని భారత్‌కు చెందిన సీనియర్ న్యాయవాది సాయి దీపక్ గట్టిగా తిప్పికొట్టారు. పాక్ తన తప్పుడు ప్రచారాలను ఇంకా కొనసాగిస్తూనే ఉందని ఎద్దేవా చేశారు. సుబ్రమణియన్, నరవాణెళి కొన్ని కారణాల వల్ల చర్చకు హాజరుకాలేకపోతున్నందున, వీరికి ప్రత్యామ్నా యాలు చూపాలని యూనియన్ అధికారులు తనను కోరారని దీపక్ చెప్పారు. ఈ క్రమంలో తాను యూకేకు వెళ్లి మరో బృందంతో చర్చకు సిద్ధమయినట్లు తెలిపారు. అయితే.. చర్చకు కొన్ని గంటల ముందు యూనియన్ అధికారులు తనకు కాల్ చేసి.. పాక్ తరఫున హాజరవ్వాల్సిన బృందం యూకేకు రాలేదని వెల్లడించారన్నారు. దీంతో చర్చ ఆగిపోవడం తనకు ఆగ్రహం తెప్పించిందన్నారు. పాక్ బృందం కూడా యూకేలోనే ఉందని, భారత్‌తో చర్చల్లో పాల్గొనేందుకు భయపడి వెనుదిరిగినట్లుగా కనిపిస్తుందని విమర్శించారు. తమను ఎదుర్కోలేక పిల్లల వెనక దాక్కుందని ఎద్దేవా చేశారు. దాయాది బృందం ఇంకా ఆక్స్‌ఫర్డ్‌లోనే ఉంటే.. తమతో చర్చకు రావాలని ఆయన సవాల్ విసిరారు. దీపక్ పోస్టులతో పాక్ ప్రకటనలు తప్పు అని మరోసారి స్పష్టమైంది. పాక్ చర్చలో పాల్గొనాల్సి వస్తే బేలతనం బయటపడుతుందనే ఇలా చేసి ఉంటుందని అనుకుంటున్నారు.

# ఢిల్లీ పేలుడు నిందితులకు మరో పదిరోజుల జ్యుడిషియల్ కస్టడీ

**న్యూఢిల్లీ, నవంబరు 29:** ఢిల్లీ పేలుడు కేసులో కీలక నిందితులైన డాక్టర్ ముజమ్మిల్ షకీల్ గనయి, డాక్టర్ అదీల్ అహ్మద్ రాథెర్, డాక్టర్ సహీన్ సయీద్, ముఫ్తో ఇర్ఫాన్ అహ్మద్ వాగాయ్‌కు 10 రోజుల జ్యుడిషియల్ కస్టడీకి పాటియాలా హౌస్ కోర్టు శనివారం ఆదేశించింది. ఇంతకుముందు విధించిన 10 రోజుల కస్టడీ శనివారంతో ముగియడంతో ఈ నలుగురిని కోర్టు ముందు హాజరుపరిచారు. జమ్మూకశ్మీర్ పోలీసులు వెలుగులోకి తీసుకువచ్చిన 'వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్'కు సంబంధించి ఇంతవరకూ ఏడుగురికి పైగా అనుమానితులను అరెస్టు చేసారు. ఈ వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్‌కు నేరుగా ఢిల్లీ పేలుడుతో సంబంధం ఉందని దర్యాప్తు సంస్థలు గుర్తించాయి.

# 1 నుంచి పార్లమెంట్ శీతాకా సమావేశాలు

### రాజ్‌నాథ్ అధ్యక్షతన నేడు అఖిలపక్ష భేటీ

**న్యూఢిల్లీ, నవంబరు 29:** పార్లమెంటు శీతాకాల సమావేశాలు డిసెంబర్ 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. డిసెంబర్ 19వ తేదీ వరకూ ఈ సమావేశాలు జరుగుతాయి. సమావేశాలకు ముందు సంప్రదాయంగా నిర్వహించే అఖిలపక్ష సమావేశాన్ని ఆదివారం ఉ దయం 11 గంటలకు నిర్వహించ నున్నారు. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన ఈ అఖిలపక్ష సమావేశం జరుగ నుంది. పార్లమెంటు సమావేశాలు సజావుగా జరిగేలా సహకరించాల ని కేంద్రం కోరనుంది. సోమవారం నుంచి ప్రారంభమయ్యే పార్లమెం టు శీతాకాల సమావేశాల్లో పలు అంశాలపై చర్చకు విపక్షం కసరత్తు చేస్తోంది. సర్‌తో సహా ఢిల్లీ కాలుష్యం తదితర అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉంది. ఇకపోతే కీలకమైన పౌర అణు ఇంధన రంగంలో ప్రైవేటు రంగానికి ఆహ్వానం పలికేందుకు ఉద్దేశించిన 'ది ఆటమిక్ ఎనర్జీ బిల్లు-2025'తో సహా 10 కీలక బిల్లులు సభ ముందుకు రాను న్నాయి. పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న కీలకమైన బిల్లులలో 'ది ఆటకమిక్ ఎనర్జీ బిల్లు-2025'తో పాటు సెక్యూరిటీస్ మార్కెట్స్ కోడ్ బిల్లు (ఎస్ఎంసి)-2025, జాతీయ రహదారుల (సవరణ) బిల్లు, అ ర్బిట్రేషన్, కాన్సిలియేషన్ (సవరణ) బిల్లు, ఇన్సూరెన్స్ చట్ట (సవరణ) బిల్లు, ఇన్సాల్వెన్సీ, దివాలా కోడ్ (సవరణ) బిల్లు, కార్పొరేట్ చట్ట (సవరణ) బిల్లు, ది హైయర్ ఎడ్యుకేషన్ కమిషన్ ఆఫ్ ఇండియా బిల్లు-2025, ది మణిపూర్ గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్ (సవరణ) బిల్లు-2025, జన్ విశ్వాస్ (నిబంధనల సవరణ) బిల్లు-2025 ఉ ండనున్నాయి. సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా చట్టం-1992, డిపాజిటరీస్ చట్టం-1996, సెక్యూరిటీస్ కాంట్రాక్ట్స్ (నియంత్రణ) చట్టం-1956ను విలీనం చేసేందుకు 'సెక్యూరిటీస్ మార్కెట్స్ కోడ్ బిల్లు-2025'ను కేంద్రం తీసుకువస్తోంది. జాతీయ రహదారుల విస్తరణ, పొడిగింపుకోసం అవసరమైన భూసేకరణ ప్రక్రియ వేగంగా, అత్యంత పారదర్శకంగా జరిగేందుకు వీలుగా నేషనల్ హైవేస్ (సవరణ) బిల్లును తెస్తోంది. చేయని తప్పులకు కంపెనీ డైరెక్టర్లు బాధ్యులు అవుతున్నందున అవాంఛనీయ దర్యాప్తు, విచారణల నుంచి రక్షణ కల్పించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ఆర్బిట్రేషన్, కాన్సిలేయేషన్ చట్ట సవరణ బిల్లును పార్లమెం టులో కేంద్రం ప్రవేశపెట్టనుంది. దీనిపై సూచనల కోసం కమిటీకి సిఫారసు చేసే అవకాశం ఉంది. కాగా, ది హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషన్ ఆఫ్ ఇండియా బిల్లుతో ఏకీకృత ఉన్నత విద్యా కమిషన్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం కొత్త బిల్లు తీసుకురానుంది. కాగా, చండీగఢ్ కేంద్ర పాలిత ప్రాంతాన్ని రాజ్యాంగంలోని 240వ అధికరణ పరిధిలోకి తెచ్చే బిల్లు పార్లమెంటులో ప్రవేశపెడతారని అనుకున్నప్ప టికీ అలాంటి ఆలోచన ఏదీ లేదని ఇటీవల కేంద్రం ప్రకటించింది. కాగా, ఈసారి పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో పలు అంశాలను లేవనెత్తేందుకు విపక్షాలు కసరత్తు చేస్తున్నాయి. ప్రధానంగా ఎస్ఐఆర్ ఓటర్ల సవరణ జాబితా, అదానీ అంశం, ఢిల్లీ పొల్యూషన్ వంటి అంశాలను లేవనెత్తే అవకాశాలున్నాయి. దీనికి సంబంధించిన విపక్ష నేత రాహుల్ ఇప్పటికే ప్రకటన చేశారు.



# మూడు ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక జోన్లు



**అమరావతి :** రాష్ట్రంలో మూడు ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. 3 ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రత్యేక జోన్లు ఏర్పాటు చేస్తామన్నారు. రాజధాని రైతులంతా ఒకే గొడుగు కిందకు రావాలని పిలుపునిచ్చారు. వారు జెఎసిగా ఏర్పడి ప్రభుత్వంతో సంప్రదింపులకు సిద్ధంగా ఉండాలన్నారు. ఈమేరకు సీఎం చంద్రబాబు మీడియాతో ఇష్టాగోష్ఠి సమావేశం నిర్వహించారు. అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. రైతులంతా అమరావతి ప్రాంత అభివృద్ధి అసోసియేషన్ కిందకు రావాలని, జేఏసీగా ఏర్పడితే వారితో సంప్రదిస్తూ సమస్యలు పరిష్కరిస్తామన్నారు. క్యాపిటల్ గెయిన్స్ మినహాయింపు గురించి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు వివరించాం. ఈ అంశంపై కేంద్రం చర్చించి నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. రాష్ట్ర పరిధిలో ఉన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తాం అని చంద్రబాబు చెప్పారు.. రాజధాని రైతుల నుంచి ఎవరైనా సిబ్బంది డబ్బులడిగితే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు. భూ త్యాగాలు చేసిన రైతుల సమస్యలు పరిష్కరించాలి. ఈ విషయంలో తొలుత కొంత గ్యాప్ ఉంది. నాతో సమావేశమైన అనంతరం రైతులకు అన్నింటిపైనా స్పష్టత వచ్చింది. రాజధాని అభివృద్ధి ఇక అన్‌స్టాపబుల్. రాజధాని పరిసర ప్రాంతాల్లో లేఅవుట్ల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తాం అన్నారు. త్వరలోనే కార్యాచరణ రూపొందిస్తాం అని సీఎం చంద్రబాబు తెలిపారు. రైతులకు సంబంధించిన ప్రతి పనికి సిఆర్‌డిఎ అధికారులు డబ్బులు డిమాండ్ చేయడంపై విచారణ చేయిస్తాం అన్నారు. పనుల కోసం ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లే రాజధాని రైతుల నుంచి సిబ్బంది డబ్బులు తీసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భూమిని త్యాగం చేసిన రైతుల సమస్యలు పరిష్కరించకుండా డబ్బులు డిమాండ్ చేస్తారా అని మండిపడ్డారు. రాష్ట్రంలో మూడు ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నాం.. ఇందుకు అనుగుణంగా 3 ప్రాంతీయ జోన్లు ఏర్పాటు చేస్తామన్నారు. అభివృద్ధి ఏ ఒక్క ప్రాంతానికో పరిమితం కాకుండా అన్ని ప్రాంతాలు సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పుకొచ్చారు. వచ్చే ఏడాది నాటికి అమరావతి నిర్మాణం ఒక కొలిక్కి వస్తుంది.. రాజధాని ప్రాంతంలో కాకుండా మిగిలిన ప్రాంతాల్లో లేఔట్స్ కి త్వరలోనే అనుమతి ఇస్తాం.. క్యాపిటల్ గెయిన్స్ కు సంబంధించి కేంద్రం నుంచి అనుమతులు రావాల్సి ఉందన్నారు. రాజధాని రైతులు కోరిన క్యాపిటల్ గెయిన్స్ మినహాయింపు కేంద్ర ఆర్థిక మంత్రికి వివరించాం.. కేంద్రం చర్చించి నిర్ణయం తీసుకుంటుంది.. రాష్ట్ర పరిధిలో ఉన్న సమస్యలన్నీ దశల వారీగా పరిష్కరిస్తాం.. రాష్ట్రంలో అవినీతి నిర్మూలనకు ప్రత్యేక దృష్టి పెట్టాం.. త్వరలోనే ఆ దిశగా కార్యాచరణ రూపొందిస్తామని సూచించారు.

## రాజధాని భూములపై త్రిసభ్య కమిటీ భేటీ



మొదటి పేజీ తరువాయి

రైతుల సమస్యలపై చర్చించారు. అనంతరం కేంద్రమంత్రి మీడియాతో మాట్లాడుతూ.. 1286 ప్లాట్లకు వీధి పోటు సమస్యలు ఉన్నాయని.. వాస్తు ప్రకారం కొన్ని ఇబ్బందులు వచ్చాయని తెలిపారు. 156 మంది రైతులకు వాస్తు ఇబ్బందులు ఉన్నాయని తెలిపారు. ఒక వేళ వాస్తు బాగాలేని రైతులు తమకు వేరే చోట కావాలని చెప్తే కేటాయిస్తారని అన్నారు. రైతులకు పెన్షన్, హెల్త్ కార్డు సమస్యలు ఉన్నాయని.. ఒక నెలలోనే పరిష్కారం అవుతాయని వెల్లడించారు. లంక భూములు, అసైన్డ్ భూముల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టామన్నారు. అసైన్డ్ ల్యాండ్‌ను మిగిలిన భూములతో సెపరేట్ చేసి క్యాబినెట్‌లో చర్చిస్తామని అన్నారు. ప్రతి రెండు వారాలకు అందరి రైతుల సమస్యలు వింటామని కేంద్రమంత్రి పెమ్మసాని తెలిపారు. అమరావతి రాజధాని రైతుల సమస్యలను త్రి సభ్య కమిటీ ఎప్పటికప్పుడు తెలుసుకుంటోందని మంత్రి నారాయణ అన్నారు. గ్రామ కంఠాల్లో ఇచ్చిన భూములు, జరీబు, నాన్ జరీబు అన్ని భూములపై దృష్టి పెడతామని చెప్పారు. వచ్చే క్యాబినెట్‌లో అసైన్డ్ భూములు, లంక భూములపై చర్చించనున్నట్లు తెలిపారు. అమరావతి రాజధాని గ్రామాల్లో హెచ్‌డీ లైన్స్, ఇతర మౌలిక వసతులపై దృష్టి పెట్టామన్నారు. గ్రామకంఠాల్లో ఎవరికైతే ఎ÷-లాట్లు ఇచ్చారో వాటిపై ఉన్న అనుమానాలు నేపథ్యంలో అన్ని వెర్గి÷ చేయమని అధికారులకు చెప్పినట్లు తెలిపారు. లంక భూములు విషయంలో ప్రస్తుతానికి ఇబ్బంది లేదన్నారు. ఆర్ అండ్ బి రోడ్‌లకు సంబంధించి పరిహారం తక్షణం వచ్చేలా సీఆర్డీఏ చూస్తుందన్నారు. ఆర్ అండ్ బి ఇవ్వాల్సిన పరిహారాన్ని సీఆర్డీఏ ముందుగా చెల్లిస్తుందన్నారు. 9 గంటలకు అని సమయం ఇచ్చామనని.. అయితే కొందరు రైతుల అలస్యంగా వచ్చారని తెలిపారు. వచ్చే సమావేశం నాటికి అందరినీ పిలుస్తామని మంత్రి నారాయణ పేర్కొన్నారు.

## విశాఖ హోటళ్లలో దారుణం

### నాసిరకం, పాచిపోయిన ఫుడ్ సరఫరా

### అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు అధికారుల హెచ్చరిక

**విశాఖపట్టణం :** పర్యాటక నగరంగా పేరుగాంచిన విశాఖపట్నంలో కొన్ని హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకులు కస్టమర్ల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. పేరుకు మాత్రమే హంగులతో ఆకర్షిస్తూ, లోపల మాత్రం రోజుల తరబడి నిల్వ ఉంచిన పాచిపోయిన ఆహారాన్ని వేడి చేసి వడ్డిస్తున్నారు. రుచి కోసం రకరకాల రంగులు, హానికరమైన రసాయనాలు కలుపుతూ ప్రజల జీవితాలను ప్రమాదంలోకి నెడుతున్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు ఎన్నిసార్లు తనిఖీలు చేపట్టినా యాజమాన్యాల తీరు మారకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఇలాంటి హోటళ్ల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. తాము తినే పదార్థాలు తాజావా కాదా అని నిర్ధారించుకోవాలని హచ్చరించారు. నగరంలో హోటళ్ల అరాచకం రోజురోజుకూ పెరిగిపోతున్న నేపథ్యంలో, ఆహార భద్రతా ప్రమాణాల శాఖ అధికారులు మెరుపు దాడులు నిర్వహిస్తున్నారు. ఈ తనిఖీల్లో అధికారులకు కళ్లు బైర్లు కమ్మే దృశ్యాలు దర్శనమిస్తున్నాయి. దాదాపు ఏ రెస్టారెంట్ చూసినా కల్తీగా మారిపోయింది. ఈ ఏడాది ఆగస్టు నెలలో జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన విస్తృత తనిఖీల్లో 40 హోటళ్లు, రెస్టారెంట్లలో కిలోల కొద్దీ నిల్వ ఆహార పదార్థాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ముఖ్యంగా 17 హోటళ్లలో అత్యంత దారుణ స్థితిలో ఉన్న ఆహారాన్ని గుర్తించి, వాటిపై కేసులు నమోదు చేశారు. అక్కయ్యపాలెంలోని నరసింహ నగర్ లో ముంతాజ్ హోటల్ ఈ ఏడాది జూన్ నెలలో జరిపిన తనిఖీల్లో ఇక్కడ కుళ్లిపోయిన కోడిగుడ్లు, చికెన్, చేప, రొయ్య వంటకాలను గుర్తించారు. హోటల్‌పై కేసు కూడా నమోదు చేశారు. అలాగే, ఏంవీపీ కాలనీలో గల ఆహా ఏమి రుచులు రెస్టారెంట్ లో ఆగస్టు 22న జరిపిన దాడుల్లో ఈ రెస్టారెంట్లో నాలుగైదు రోజులకు మించి నిల్వ ఉన్న 85 కిలోల చికెన్, మటన్, రొయ్యలు, చేపలను అధికారులు గుర్తించారు. మరో హోట్ సెలబ్రేషన్స్ పై తనిఖీ చేయగా నిల్వ ఉంచిన బిర్యానీ లభించింది. అలాగే, నగరంలో దాదాపు 1000 వరకు హోటళ్లు, రెస్టారెంట్లలో ఉన్న ఎక్కడ తనిఖీ చేసినా నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు దొరకడంపై ఫుడ్ సేఫ్టీ అధికారులు కఠిన చర్యలు తీసుకుంటున్నప్పటికీ హోటల్స్ తీరు మారడం లేదు.

# కర్నూలు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

మొదటి పేజీ తరువాయి



పరిధిలోని కొటేకల్ గ్రామం వద్ద ఈ ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది.. రెండు కార్లు ఢీకొన్న ఈ ఘటనలో ఇద్దరు చిన్నారులు సహా మొత్తం ఐదుగురు మృత్యువాత పడ్డారు. మరో నలుగురు గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆదోనికి తరలించారు. కర్ణాటక నుంచి శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం దర్శనం కోసం మంత్రాలయం వెళ్తుండగా.. కోటేకల్ గ్రామ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. మృతులంతా ఒకే కుటుంబానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. వీరిని కర్ణాటక రాష్ట్రం కోలార్ జిల్లా చిక్కహోసల్లి గ్రామానికి చెందిన.. వెంకటేశప్ప(60), ఆయన కూతురు మీనాక్షి(32), అల్లుడు సతీశ్(36), మనవళ్లు రుత్విక్, బన్నీగౌడ్‌లుగా తేల్చారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. బెంగళూరు నుంచి మంత్రాలయం వెళ్తున్న కర్ణాటక బస్సు పత్తికొండ పరిధిలోని తుగ్గలి, రాతన గ్రామాల మధ్య బోల్తాపడింది. ఆ సమయంలో బస్సులో 29 మంది ప్రయాణికులు ఉన్నట్టు సమాచారం. వారిలో ఇద్దరు వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి.

## కర్నూలు ప్రమాదంపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

### తక్షణ సహాయక చర్యలకు ఆదేశం

### క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సూచన

**అమరావతి :** కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం కోటేకల్ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతి చెందడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విచారం వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మరణించిన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ మరో ముగ్గురికి అత్యవసర వైద్య సహాయం అందించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాల ని ఆదేశించారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఇక.. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లా ఎస్పీ, రేంజ్ ఐజీలు హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకున్నారు. మృతి చెందిన ఐదుగురు కర్ణాటకలోని కోలార్ జిల్లాకు చెందిన వారిగా గుర్తించారు. మృతుల్లో ఇద్దరు చిన్నారులు ఉన్నట్టు సీఎం చంద్రబాబుకు అధికారులు తెలిపారు. కర్నూలు జిల్లా రోడ్డు ప్రమాదంపై మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆరా తీశారు. కోటేకల్ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై దిగ్భ్రాం÷-రతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో ఐదుగురు చనిపోవడం.. మృతుల్లో చిన్నారులు ఉండటంపై విచారం వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ బాధితులకు మెరుగైన వైద్య సహాయం అందించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రమాదంలో మృతి చెందిన వారికి సంతాపం తెలుపుతూ.. వారి కుటుంబాలకు సానుభూతి తెలియజేశారు. ప్రయాణికులు ప్రయాణ సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రయాణికుల భద్రతా ప్రమాణాలపై కఠిన చర్యలు తీసుకునేలా అధికారులకు మరోసారి మంత్రి ఆదేశాలు జారీ చేశారు. రోడ్లపై ప్రయాణికుల నిర్లక్ష్యానికి తావు లేకుండా పర్యవేక్షణ పెంచాలని మంత్రి అచ్చెన్నాయుడు సూచనలు చేశారు. కర్నూలు రోడ్డు ప్రమాద ఘటనపై మంత్రులు టీజీ భరత్, నిమ్మల రామానాయుడు దిగ్భారతి వ్యక్తం చేశారు. ప్రమాదంపై అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని మంత్రులు ఆదేశించారు. ఈ ఘటన జరగడం ఎంతో బాధాకరమని.. మృతుల కుటుంబాలకు మంత్రులు టీజీ భరత్, నిమ్మల రామానాయుడు సంతాపం తెలిపారు.

## రాష్ట్ర అంశాలపై పార్లమెంట్‌లో

# గట్టిగా గళం విప్పాలి



**అమరావతి :** డిసెంబర్ 1 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ శీతాకాల సమావేశాల నేపథ్యంలో జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పార్టీ ఎంపీలకు కీలక దిశానిర్దేశం చేశారు. అమరావతిలో లోక్‌సభ సభ్యులు బాలశౌరి, తంగెళ్ల ఉదయ శ్రీనివాస్‌తో ఆయన ప్రత్యేకంగా సమావేశమై, పార్లమెంట్‌లో అనుసరిం చాల్సిన వ్యూహాలపై చర్చించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై పార్లమెంట్‌లో గట్టిగా గళం విప్పాలని సూచించారు. దేశ ప్రయోజనాలకు సంబంధించిన చర్చల్లో చురుగ్గా పాల్గొనేందుకు ముందస్తుగా సిద్ధం కావాలని ఎంపీలకు తెలిపారు. రాష్ట్రానికి సంబంధించిన అభివృద్ధి ప్రాజెక్టులను వేగవంతం చేసేందుకు సంబంధిత కేంద్ర మంత్రులతో సమావేశమై, వివరణాత్మక నివేదికలు అందించాలని స్పష్టం చేశారు. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్ట్, రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్రం అందిస్తున్న సహకారం చాలా కీలకమని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలకు కేంద్ర పథకాల ద్వారా రావాల్సిన నిధులపై రాష్ట్ర అధికారులతో సమీక్షించి, ఆ వివరాలను కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

## ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథిగా 'సర్గమ్ 2025'

### నేవీ డే సన్నాహక కార్యక్రమాల్లో అలరించిన నేవీ బ్యాండ్



డిసెంబర్ 4వ తేదీన జరగబోయే నేవీ డే ఉత్సవాలకు ముందస్తుగా తూర్పు ప్రాంత నావికాదళ కమాండ్ విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన సర్గం 2025 – ఇండియన్ నేవల్ సింఫనిక్ ఆర్కెస్ట్రా కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శనివారం సాయంత్రం సముద్రిక ఆడిటోరియంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన పవన్ కళ్యాణ్‌కి విశాఖపట్నం విమానాశ్రయంలో నేవల్ ఆఫీసర్లు రజనీష్ శర్మ, కిషోర్, శాసన సభ్యులు కొణతాల రామకృష్ణ, వంశీ కృష్ణ యాదవ్, సుందరపు విజయ్ కుమార్, పంచకర్ల రమేష్, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి నేరుగా ఈస్టర్న్ నావల్ కమాండ్ లోని శౌర్య అతిథి గృహం చేరుకున్నారు. ఉప ముఖ్యమంత్రివర్యులతో విశాఖ పోలీస్ కమిషనర్ శ్రీ శంఖబ్రత బాగ్చి సమావేశమయ్యారు. అనంతరం శ్రీ పవన్ కళ్యాణ్ గారు సముద్రిక చేరుకున్నారు. చీఫ్ అడ్మిరల్ శ్రీ సంజయ్ భల్లా, ఆయన సతీమణి శ్రీ ప్రియా భల్లా స్వాగతం పలికారు.

**అలరించిన నేవీ బ్యాండ్**

సర్గం 2025లో భాగంగా తూర్పు ప్రాంత నావికాదళ సింఫనీక్ బ్యాండ్ లయబద్ధంగా చేసిన సంగీత విన్యాసాలు ఆకట్టుకున్నాయి. మ్యూజిక్ కంపోజర్, ఈస్ట్రన్ నావెల్ కమాండ్ బ్యాండ్ డైరెక్టర్ శ్రీ సతీష్ ఛాంపియన్, ఈస్ట్రన్ నావెల్ బ్యాండ్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీ ప్రదీప్ కుమార్ లు లయబద్ధంగా సంగీతానికి దర్శకత్వం వహించగా, దేశభక్తి గీతాలు, హిందీ పాటలతో పాటు ఎన్విరాన్మెంట్ సంబంధిత అంశాలపై కూడా ఈస్ట్రన్ నేవీ బ్యాండ్ చేసిన సంగీతం అందరిని ఆకట్టుకుంది. సుమారు గంటకు పైగా చేసిన ఈ సంగీత విన్యాసాలు అందరిని సమ్మోహితం చేశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన శ్రీ పవన్ కళ్యాణ్ గారి చేతుల మీదుగా లయన్ కింగ్ మ్యూజిక్ మెమొంటోను శ్రీ శరత్ కుమార్ సింగ్ బాబుకి అందజేశారు. తూర్పు ప్రాంత నావికాదళ కమాండ్ వైస్ అడ్మిరల్ శ్రీ సంజయ్ భల్లా చేతుల మీదుగా ముఖ్యఅతిథి శ్రీ పవన్ కళ్యాణ్ గారు టోకెన్ ఆఫ్ రెమెంబెన్స్ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ పవన్ కళ్యాణ్ గారి కుమారుడు శ్రీ అకీరా నందన్ పాల్గొన్నారు.

## తదుపరి సీఎస్‌గా సాయిప్రసాద్

మొదటి పేజీ తరువాయి

స్వీకరించనున్నారు. ఈ మేరకు సాధారణ పరిపాలనా శాఖ పొలిటికల్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. సురేశ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత సీఎస్ కె. విజయానంద్ పదవీకాలాన్ని మరో మూడు నెలల పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది సర్కార్. ఈ మేరకు జీవో నంబర్ 2230ను విడుదల చేసింది ప్రభుత్వం. మరోవైపు.. పదిమంది డిప్యూటీ కలెక్టర్‌లకు పోస్టింగ్‌లు ఇస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు జీవో ఆర్టీ నెంబర్ 2228 జారీ చేశారు సీఎస్ విజయానంద్.

## అమరావతి అంతులేని కథ

మొదటి పేజీ తరువాయి

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి విస్తరణ కోసం ప్రభుత్వం మరోసారి భూసేకరణకు సిద్ధమవుతున్న నేపథ్యంలో వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు తీవ్ర విమర్శలు చేశారు. అమరావతి కథ ఒక అంతులేని కథలా మారిందని ఆయన ఎద్దేవా చేశారు. చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన వెంటనే అమరావతిలో భూముల ధరలు పడిపోయాయని వ్యాఖ్యానించారు. రాజధాని పేరుతో చంద్రబాబు ప్రజలను మభ్యపెడుతూ దోచుకుంటున్నారని అంబటి రాంబాబు ఆరోపించారు. ఇప్పటికే రాజధాని కోసం రైతులు 35 వేల ఎకరాల భూములు త్యాగం చేశారని గుర్తుచేశారు. ప్రభుత్వ భూములతో కలిపి మొత్తం 50 వేల ఎకరాలతో ప్రపంచంలోనే అత్యుత్తమ రాజధాని నిర్మిస్తానని గతంలో చంద్రబాబు ప్రగల్భాలు పలికారని విమర్శించారు. ఇప్పుడు మళ్లీ భూసేకరణకు ఎందుకు సిద్ధమవుతున్నారని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వ నిర్ణయాల వల్ల అమరావతి రైతుల పరిస్థితి అత్యంత దారుణంగా తయారైందని అంబటి ఆవేదన వ్యక్తం చేశారు. రాజధాని నిర్మాణంపై స్పష్టత ఇవ్వకుండా, పదేపదే భూసేకరణ అనడం రైతులను ఇబ్బందులకు గురి చేయడమేనని ఆయన అన్నారు. ప్రభుత్వ తీరుతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు.

## తిరుమల కల్తీనెయ్యి కేసు

### మరో 11మందిని నిందతులుగా చేర్చిన అధికారులు

**తిరుమల :** తితిదే కల్తీ నెయ్యి కేసులో సీబీఐ నేతృత్వంలోని సిట్ విచారణ వేగవంతం చేసింది. కేసు నమోదు చేసిన సమయంలో 15 మందిని, ఆ తర్వాత 9 మందిని నిందితులుగా పేర్కొన్న సిట్.. తాజాగా మరో 11 మందిని నిందితులుగా చేరుస్తూ నెల్లూరు ఏసీబీ కోర్టులో మెమో దాఖలు చేసింది. వారిలో ఏడుగురు తితిదే ఉద్యోగులు ఉన్నారు. 2019–2024 మధ్య తితిదే కొనుగోలు విభాగంలో పని చేసిన జీఎంలు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లపై సిట్ కేసులు నమోదు చేసింది. గతంలో జీఎంలుగా పని చేసిన జగదీశ్వర్‌రెడ్డి, మురళీకృష్ణ, ఎస్వీ గోశాల పూర్వ డైరెక్టర్ హరినాథ్‌రెడ్డి ఇందులో ఉన్నారు. దీంతో ఈ కేసులో ఇప్పటివరకు పేర్కొన్న నిందితుల సంఖ్య 35కి చేరింది. వారిలో 10 మందిని అరెస్టు చేశారు.

## హైకోర్టు న్యాయమూర్తికి ఘన స్వాగతం





**నిజామాబాద్, నవంబర్ 29 ( సమయం న్యూస్).** రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మాధవీ దేవి శనివారం నిజామాబాద్ కు విచ్చేసిన సందర్భంగా జిల్లా ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు. స్థానిక రోడ్లు – భవనాల శాఖ అతిథి గృహం వద్ద హైకోర్టు న్యాయమూర్తిని, జిల్లా జడ్జి జీ.వీ.ఎన్.భరతలక్ష్మి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, ఆయా శాఖల జిల్లా అధికారులు, న్యాయవాదులు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. అనంతరం జిల్లా జడ్జి, కలెక్టర్, పోలీస్ కమిషనర్లతో హైకోర్టు న్యాయమూర్తి అతిథి గృహంలో కొద్దిసేపు భేటీ అయ్యారు. అంతకు ముందు హైకోర్టు జడ్జి పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించారు.

## దీక్షా దివస్ సందర్భంగా ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ

**-దీక్షా దివస్ ప్రతి తెలంగాణ వాసిలో కొత్త స్ఫూర్తి నింపుతుంది"**

**- మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి**



**పరిగి మున్సిపల్,(మం)నవంబర్29,(సమయం న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర సాధనలో చారిత్రాత్మక మైలురాయిగా నిలిచిన 2009 నవంబర్ 29న జరిగిన అమరణ నిరాహార దీక్షను స్మరించుకుంటూ, దీక్షా దివస్ సందర్భంగా వికారాబాద్ జిల్లా పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి పరిగి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బీఆర్ఎస్ అధ్యక్షుడు, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు "తెలంగాణ వచ్చాడో %-% కేసిఆర్ సాచ్చుడో" అనే నినాదంతో చేపట్టిన చారిత్రాత్మక నిరాహార దీక్షను స్మరించుకోవడం కోసం ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మాజీ ఎమ్మెల్యే తెలిపారు. అదేవిధంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## దీక్షా దివస్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు

- **2009 నవంబర్ 29..వలస పాలనపై అంతిమ సమరానికి సన్నదమైన తెలంగాణ**




**నారాయణపేట,నవంబర్,29(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా కేంద్రంలో దీక్షా దివస్ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు 2009 నవంబర్ 29.. వలస పాలనపై అంతిమ సమరానికి సన్నద్ధమైన తెలంగాణం. పోరు గడ్డపై నిలబడి తెలంగాణ తరఫున కేసీఆర్ చేసిన ఆమ 'రణం' ఒక్క పిలుపుతో కేసీఆర్ వెంట నడిచిన తెలంగాణ జన సైన్యం..ముక్కోటి తెలంగాణ బిడ్డల ఆకాంక్షలే ఆయన కవచం..పోరు భూమిలో మరణానికి ఎదురు వెళ్లిన కేసీఆర్ మొండి ధైర్యం అకుంఠిత దీక్షను చూసి ఆసేతుహిమాచలం ఆశ్చర్య పోయిన వైనం తెలంగాణ ప్రకటన రూపంలో కేసీఆర్ సాధించిన అద్భుత విజయం. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మాజీ నరేందర్ రెడ్డి మరియు నారాయణపేట మాజీ ఎమ్మెల్యే ఎస్ ఆర్ రెడ్డి, మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి మరియు జిల్లా నాయకులు వివిధ మండలాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# బొట్టుగూడ ఉన్నత పాఠశాలకు నూతన భవనాన్ని నిర్మిస్తున్న మంత్రి కోమటి రెడ్డి ని ఘనంగా సన్మానించిన పూర్వ విద్యార్థులు



**హైదరాబాద్, నవంబర్ 29( సమయం న్యూస్) :** నల్గొండ పట్టణంలో అత్యంత ప్రాముఖ్యత చెందిన బొట్టుగూడ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల నూతన భవన నిర్మాణాన్ని కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టడం పట్ల బొట్టుగూడ పాఠశాల పూర్వ విద్యార్థులు నేడు రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి ని నేడు హైదరాబాద్ లోని ఆయన నివాసంలో కలసి ఘనంగా సన్మానించారు. దాదాపు ఏడు దశాబ్దాల చరిత్ర గలిగి జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు, ఎందరో ప్రముఖ ఉపాధ్యాయులు బోధించిన బొట్టుగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్నేళ్ళుగా ప్రయివేటు భవనంలో కొనసాగుతోంది. ఈ పాఠశాలకు శాశ్వత భవనం కావాలని మంత్రి కి పూర్వ విద్యార్థులు విజ్ఞప్తి చేయగా ప్రకాశం బజార్ సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలంలో రూ. 8 కోట్లకు పైగా వ్యయంతో కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మాణం చేపట్టారు. కార్పొరేట్ స్థాయి సౌకర్యాలతో డిజిటల్ క్లాసులు, కంప్యూటర్ విద్య, ఇంగ్లీష్ % ఉర్దూ మీడియం బోధనకు ప్రాధాన్యత ఇస్తూ నిర్మాణం చేపట్టారు. ఇందుకు కృతజ్ఞతగా, బొట్టుగూడ పాఠశాల పూర్వ విద్యార్థులైన నల్గొండ జిల్లా వక్ఫ్ బోర్డు ప్రసిడెంట్ హాఫీజ్ ఖాన్, జీహెచ్ఎంసీ అడిషనల్ కమీషనర్ ఎన్. రఘుప్రసాద్, అడిషనల్ ఎస్.పి. పూర్ణ చందర్, సమాచార శాఖ జాయింట్ డైరెక్టర్ కన్నెకంటి వెంకట రమణ, అటవీ శాఖ డిప్యూటీ డైరెక్టర్ హలీం, గొట్టిపర్తి వేణుగోపాల్, ఏ. విశ్వేశ్వర్ రావు తదితరులు మంత్రి వెంకట రెడ్డిని కలసి ఘనంగా సన్మానించారు. కాగా, నూతనంగా నిర్మిస్తున్న బొట్టుగూడ పాఠశాల నిర్మాణ పనులు దాదాపుగా పూర్తయ్యాయని త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీద దీన్ని ప్రారంభించనున్నట్లు మంత్రి కోమటి రెడ్డి వెల్లడించారు.

# రాజ్యాంగం పట్ల ప్రతిఒక్కరు అవగాహన కలిగి ఉండాలి.

- **అదనపు కలెక్టర్ శ్యామల దేవి.**




**ఆదిలాబాద్ నవంబర్29( సమయం న్యూస్).:** ప్రతి ఒక్కరు రాజ్యాంగం పట్ల అవగాహన కలిగి ఉండాలని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అన్నారు. శనివారం సంజయ్ నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల రిజర్వ్ పోలీస్ లైన్ లో పౌర హక్కుల రోజు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ముందుగు డా.బి.ఆర్ అంబెద్కర్ చిత్రపటానికి అదనపు కలెక్టర్, అధికారులు పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరు రాజ్యాంగం గురించి అవగాహన కలిగి ఉండాలని, ఈ నెల 26 న ఘనంగా రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించుకున్నామని అన్నారు. అన్ని వర్గాల వారికీ రాజ్యాంగం ద్వారానే హక్కు రావడం జరిగిందన్నారు. చదువుతో గౌరవం లభిస్తుందని, ప్రతి ఒక్కరు మంచిగా చదువుకోవాలని అన్నారు. విద్యార్థి దశనుండే మంచి అలవాట్లు అరవర్చుకోవాలని, ఆడపిల్లలకు పరిమితులు విధించకుండా తల్లిదండ్రులు పిల్లల పట్ల శ్రద్ధ వహించాలని అన్నారు. సమాజంలో మద్యం, మత్తు పదార్థాలకు అలవాటు పడి చెడిపోతున్నారని, జిల్లా యంత్రాంగం ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని అన్నారు. అందరు చట్టాన్ని గౌరవించాలని, సేవాభావం కలిగి ఉండాలని, మనం చేసిన మంచి పనులతో సమాజంలో చిరస్థాయిగా నిలవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ విద్యార్థులకు విదేశీ విద్య నిధి క్రింద ప్రభుత్వం 20 లక్షల రూపాయలు అందించడం జరుగుతున్నదని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు . ఈ కార్యక్రమాలో జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి సునీత, ఎస్సీ కార్పొరేషన్ ఈడి మనోహర్, అర్బన్ తహసీల్దార్ శ్రీనివాస్, ఇతర అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సామజిక కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు

# నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినిత్ ఐపీఎస్ అదేశాలమేరకు

- **గ్రామపంచాయతీ నామినేషన్ల వద్ద బందోబస్తు,**
- **సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన**
- **కోస్గి సీఐ సైదులు.**



**కోస్గి,మద్దూరు మండలం, నవంబర్,29(సమయం న్యూస్)** జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ ఆదేశాల మేరకు కొడంగల్ నియోజకవర్గంకోస్గి సర్కిల్ పరిధిలో జరు గనున్న గ్రామపంచాయతీ ఎన్నికల ఏర్పాట్లను దృష్టిలో ఉంచుకుని,కోస్గి సీఐ సైదులు, మద్దూర్ ఎస్సై విజ యేకుమార్ లు శనివారం మద్దూర్ మండలంలోని దోరేప ల్లి, పల్లెగడ్డ తండా,నీడ్చింత, కొత్త పల్లి మండల నామి నేషన్ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా అధికా రులు కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన భద్రతా చర్యలు, నామినేషన్ దాఖలు కోసం వచ్చే అభ్యర్థులు మరియు ప్రజలకు అందుబాటులో ఉంచాల్సిన అవసరమైన ప్రాథమిక సౌకర్యాలను పూర్తిగా పరిశీలించారు. తదుపరి మద్దూరు మండలంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించి. పోలింగ్ రోజు ఎటువంటి అంతరాయాలు లేకుండా, శాంతి భద్రతల మధ్య ఎన్ని కలు జరిగేలా అవసరమైన అన్ని ఏర్పాట్లను చేయాలని సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా సీఐ సైదులు మాట్లాడుతూ...సమస్యాత్మక కేంద్రాల్లో అదనపు బందోబస్తు, ప్రాథమిక సౌకర్యాలు అయిన త్రాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, ప్రహరీ గోడలుమొత్తంగా ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, శాంతియుతంగా సాగేందుకు పోలీసులు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఎస్సై విజయ్‌కుమార్ మాట్లాడుతూ, నామినేషన్ కేంద్రాల వద్ద హెడ్ కానిస్టేబుల్స్ , కానిస్టేబుళ్లకు క్లియర్ ఇన్‌స్ట్రక్షన్స్ ఇచ్చి, ఎలాంటి అనవసర గుంపులు, ఉద్రిక్తతలు చోటుచేసుకోకుండా పహారా బలోపేతం చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, పోలీసులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# క్రీడా స్ఫూర్తిని చాటిన దివ్యాంగులు, ఉల్లాసంగా జిల్లా స్థాయి దివ్యాంగుల ఆటల పోటీలు



**కొత్తగూడెం నవంబర్29( సమయం న్యూస్) :** అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంలో భాగంగా దివ్యాంగులకు జిల్లా స్థాయి ఆటల పోటీలు ప్రగతి మైదానం కొత్తగూడెం నందు జిల్లా సంక్షేమ అధికారిణి స్వర్ణలత లెనినా జెండా ఊపి, బెలూన్లు ఎగురవేసి ప్రారంభించారు. దివ్యాంగులు అందరితో సమానంగా అన్ని క్రీడలలో రాణించాలని, జిల్లా నుండి రాష్ట్ర, జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయిలో ఆటల పోటీల్లో రాణించాలని, అందుకు అనుగుణంగా ప్రభుత్వము జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక శిక్షణ ఇస్తారని, దివ్యాంగులు ప్రతిరోజూ ఆటలు ఆడడం ద్వారా వారిలో మానసికొల్లాసంతో పాటు శారీరక సామర్థ్యం, ఆత్మస్థైర్యం పెరుగుతుందని, దివ్యాంగులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించారని కొనియాడారు. షాట్ పుట్ లో సందీప్, అనిత, అఖిల్, సాయి కౌశిక్, రవి, జావెలిన్ త్రో లో రవి, సావిత్రి, అఖిల్, మోక్షిత్, రన్నింగ్ లో సందీప్, అనిత, అఖిల్, నాగరాజు, హేమంత్ చౌదరి, క్యారమ్ బోర్డు లో శైలు, సందీప్, ప్రవీణ్, రాజు ప్రథమ స్థానంలో గెలుపొందారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ పద్మ శ్రీ, పి.ఈ.టి.లు నరేష్, మంగీలాల్, మదన్, బావ్ సింగ్, జిల్లా దివ్యాంగుల సంఘాల నాయకులు సతీష్, నయీం, ప్రవీణ్, రాజేందర్, ముజాహిద్దీన్, దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలల నిర్వాహకులు ప్రసాద్, అరుణ, నాగలక్ష్మి, గౌతమి, సుబ్బ లక్ష్మి, కార్యాలయ సిబ్బంది వర ప్రసాద్, నాగేశ్వర రావు, నరేష్, ప్రవీణ్, దివ్యాంగులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఇరుగు -పొరుగుల సఖ్యత , హక్కుల అమలతోనే ఆదర్శ సమాజం

● పలువురు వక్తలు

**ఖమ్మం ,నవంబర్ 29 :(సమయం న్యూస్)** ఇరుగు పొరుగు మధ్య సఖ్యత , వారి హక్కుల నిష్పక్షపాత అమలు తోనే ... ఆదర్శ ఇరుగు బిపొరుగు లఆదర్శసమాజం ఏర్పడుతుందని పలువురు వక్తలు అన్నారు.ఆదర్శ పొరుగు వారు – ఆదర్శ సమాజం రౌండ్ టేబుల్ సమావేశం లోవక్తల సందేశం జమాఅతె ఇస్లామీ హింద్ దేశవ్యాప్తంగా నవంబర్ 21–30 వరకు నైబర్స్ రైట్స్ క్యాంపెయిన్ (పొరుగు వారి హక్కులు) ప్రచార ఉద్యమంలో భాగంగా స్థానిక కార్యాలయంలో జమాఅతె ఇస్లామీ హింద్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జనాబ్ రషాదుద్దిన్ అధ్యక్షతన ముస్లిం మేధావులు రౌండ్ టేబుల్ సమావేశం లో పలువురు వక్తలు మాట్లాడారు. తొలుత ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మహమ్మద్ ముజాహిద్ మాట్లాడుతూపొరుగున ఉన్న బంధువులు, అపరిచితులైన పొరుగువారు, పక్కనున్న మిత్రులు, బాటసారులు, మీ అధీనంలో ఉన్న జనం పట్ల ఉదారబుద్ధితో వ్యవహరించా లన్నారు. మరొక ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షులు జఫర్ అలీ మతీన్ మాట్లాడుతూ సత్సమాజ నిర్మాణం కావాలంటే, శాంతియుత , సమైఖ్య జీవనం కొరకు , ప్రతి ఒక్కరు సత్ ప్రవర్తన , పొరుగు వారిపట్ల సత్ సంబంధాలు కలిగి ఉండాలి అని కోరారుడిజిటల్ ప్రపంచంలో ఇతరుల భావాలను గౌరవిస్తూ పిల్లలకు పొరుగువారి హక్కులను బోధించడం, వారికి తినుబండారాలు, ఆట వస్తువుల విషయంలో పక్కవారిని కూడా భాగస్వాములను చేయాలని అన్నారు. డేర్ సెక్రెటరీ డాక్టర్ ఫయాజ్ మాట్లాడుతూ జమాఅతె




ఇస్లామీ హింద్ నిర్వహించిన పొరుగు వారి హక్కుల ఉద్యమం వలన పొరుగు వారి మధ్య నైతిక విలువలు మానవ బంధాలు బలపడతాయని అన్నారుచివరిగా సభధ్యక్షులు జనాబ్ రషాదుద్దిన్ మాట్లాడుతూ సమాజంలో సఖ్యత, సత్సంబం ధాలు, మానవతా విలువలను పెంపొందించేందుకు జమాతే ఇస్లామి హింద్ దేశవ్యాప్తంగా పది రోజుల పాటు 'ఆదర్శ పొరుగు %-% ఆదర్శ సమాజం' పేరుతో ప్రత్యేక ఉద్యమాన్ని ప్రారంభించింది. పొరుగువారి పట్ల సత్ప్రవర్తన కలిగి ఉండడం ఇంకా మన పిల్లలకు కూడా అదే శిక్షణ ఇవ్వడం, మంచి పొరుగు వారిగా మారడం – మంచి పొరుగు వారిగా మార్చుకోవడం అదే నిజమైన దైవభక్తి, వేగవంతమైన పట్టణ జీవితం, అపార్ట్‌మెంట్ సంస్కృతి వంటి పరిణామాల వల్ల, ఒకప్పుడు కుటుంబంలా ఉన్న పొరుగువారితో సంబంధాలు మెల్లగా కోల్పోయాయని అన్నారు. ఈ ఉద్యమం పొరుగు వారి మధ్య నైతిక విలువలు మానవ బంధాలు బలపడేం దుకుతోడ్పడుతుందనిఅన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ ఇలియాస్ ,జిల్లా అధ్యక్షులు జైనుల్ పాషా ,ఉపాధ్యక్షులు అబ్దుల్ సమి, సెంట్రల్ అధ్యక్షులు ఇంతియాజ్ , నార్త్ అధ్యక్షులు మొహమ్మద్ యూసుఫ్ షరీఫ్, సౌత్ అధ్యక్షులు సయ్యద్ నిజాముద్దీన్, వెస్ట్ అధ్యక్షులు అబ్దుస్ సుబుర్, ఎంపీజే రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ ఖాసిం,ఐట రీజనల్ సెక్రెటరీ, మొహమ్మద్ అబ్దుల్ ముజీబ్ జేమ్స్ స్కూల్ కరస్పాండెంట్ షేక్ నసీరుద్దీన్ , విద్యావంతులు పాల్గొన్నారు.

# విద్యార్థులు సృజనాత్మక ఆలోచనలు పెంచుకోవాలి

- సమాజానికి మేలు చేసే సైన్స్ ప్రాజెక్టులను రూపొందించాలి
- స్థానిక సమస్యల పరిష్కారం దిశగా విద్యార్థుల ఆలోచనలు సాగాలి
- మానవ జీవితాన్ని ప్రకృతితో అనుసంధానించడమే సైన్స్ ఉద్దేశం
- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి
- ఘనంగా ప్రారంభమైన జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన 2025- 26



**కరీంనగర్ నవంబర్29( సమయం న్యూస్) :** విద్యార్థులు ప్రకృతితో మమేకమవుతూ సమాజానికి మేలు చేసే ఆవిష్కరణలు, ప్రాజెక్టులు రూపొందించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు.జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈరోజు స్థానిక కొత్తపల్లి లోని అల్ఫోర్స్ ఈ టెక్నో పాఠశాలలో 2025–26 సంవత్సర జిల్లాస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శిన, ఇన్స్పైర్ అవార్డ్స్ మనాక్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి హాజరయ్యారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ గత 10 ఏళ్లుగా క్రమం తప్పకుండా మన జిల్లా నుండి సైన్స్ ఎగ్జిబిట్ లు రాష్ట్ర స్థాయిలో ఎంపిక కావడం, అక్కడి నుండి జాతీయ స్థాయికి ఎంపిక కావడం మనందరికీ గర్వకారణం అని అన్నారు. ఏ జిల్లాలో లేని విధంగా కరీంనగర్ లో సైన్స్ మ్యూజియం ఉందని, ప్రభుత్వ, ప్రైవేట్ పిల్లలు ఎవరైనా మ్యూజియం సందర్శించవచ్చని పేర్కొన్నారు. ఆత్మనిర్భర్ భారత్ లో భాగంగా విద్యార్థులు బాలశాస్త్రవేత్త లుగా ఎదగడానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని కాబట్టి విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని తెలియజేశారు. మన దేశం కోసం, మన ప్రజల కోసం ఏం మంచి చేయగలుగుతామో ఆ దిశగా ఆలోచించడమే ఆత్మనిర్భర్ భారత్, వికసిత భారత్ లక్ష్యమన్నారు. విద్యార్థులే దేశ భవిష్యత్తు కావున ఇప్పటి విద్యార్థుల ఆలోచనలు, ఆవిష్కరణలు, విలువలే భావి తరాలకు ఆదర్శంగా నిలుస్తాయని స్పష్టం చేశారు. వ్యవసాయాభివృద్ధి, ప్లాస్టిక్ నివారణ, పునరుత్పాదక శక్తి, శాస్త్ర సాంకేతికత, నీటి సంరక్షణ, ఆరోగ్యం – పరిశుభ్రత, గణిత నమూనాలు మొదలైన అంశాలలో ఈ విజ్ఞాన మేళ నిర్వహిస్తున్నామన్నారు. మన వనరులను కాపాడుకోవడం, నీరు, ఆహారం, విద్యుత్ శక్తి మొదలైన వాటిని వృధా చేయకపోవడం మన నిత్యజీవితంలో భాగం కావాలన్నారు.

విద్యార్థుల విజ్ఞాన శాస్త్ర ఆలోచనలు ప్రపంచ స్థాయిలోనే ఉండాలని ఏమీ లేదని, మన చుట్టూ ఉన్న స్థానిక సమస్యల గురించి ఆలోచించడం, వాటిని గుర్తించడం, వాటి పరిష్కారం దిశగా ఆవిష్కరణలు చేయడం విద్యార్థుల ప్రధాన లక్ష్యంగా ఉండాలన్నారు. సమస్య పెద్దది కాకముందే గుర్తించి, దాన్ని తొలి దశలోనే పరిష్కరించడం వల్ల దాని వల్ల ఏర్పడే దుష్పరిణామాలని తొలగిం చుకోగలు గుతామని స్పష్టం చేశారు. ప్రకృతిని తల్లిలాగా చూసు కుంటే, ప్రకృతి కూడా మంచి ఫలితాలను ఇస్తుందన్నారు. ప్రకృతి తో మానవ జీవితం అనుసంధానిం చబడినప్పుడే నూతన ఆవిష్కరణలకు శాస్త్ర సాంకేతిక రంగ అభివృద్ధికి సార్ధకత ఉంటుందని ప్రకృతికి అనుగుణంగా జీవన విధానం ఏర్పరచుకొని భవిష్యత్ తరాలకు నూతన ఆవిష్క రణలను అందించాలని సూచించారు.జిల్లా విద్యాశా ఖాధి కారి శ్రీరామ్ మొండయ్య మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలన్నింటి నుంచి భాగస్వా మ్యం ఉండడం సంతోష దాయకమని పేర్కొన్నారు. విద్యార్థు లు ప్రతి అంశాన్ని శాస్త్రీయ దృక్పథంతో పరిశీలించాలని, ఆలోచనల్,లో ప్రవర్తనలో వైజ్ఞానికత ఉండాలన్నారు. ఉపాధ్యాయులు కూడా పాఠశాలల్లోని విజ్ఞాన శాస్త్ర ప్రయోగశాలలను వినియోగిస్తూ విద్యార్థుల్లో శాస్త్రపరమైన ఆలోచనలు పెంపొందించడానికి కృషి చేయాలని సూచించారు.అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ భారత ప్రభుత్వం విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించడానికి, వారిని బాల శాస్త్రవేత్తలుగా రూపొందించడానికి ఇన్స్పైర్ పురస్కారాల పేరుతో అధిక నిధులు వెచ్చిస్తున్నదని, దానిని విద్యార్థులంతా సద్విని యోగం చేసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. సమా జం మొత్తం ఇంజనీరింగ్ వైపు, వైద్యరంగం వైపు మాత్రమే కాకుండా విజ్ఞాన శాస్త్రం వైపు కూడా దృష్టి సారించాలని, తద్వారా శాస్త్రవేత్తలుగా ఎదిగి భారతదేశ శాస్త్ర సాంకేతి కతను మరింత ఉన్నత దిశకు తీసుకువెళ్లే ప్రయత్నం చేయా లని ఆయన సూచించారు.జిల్లా సైన్స్ అధికారి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాస్థాయిలో బాల వైజ్ఞానిక ప్రదర్శన కొరకు మొత్తం 807 సైన్స్ ఎగ్జిబిట్ లు, 126 ఇన్స్పైర్ మనక్ ఎగ్జిబిట్లు వచ్చాయని తెలిపారు. ఈ ప్రదర్శనలో ఏడు అంశాల్ని ప్రదర్శనకు పెట్టామని, ప్రతి అంశం నుంచి ఉత్తమంగా వచ్చిన ఒక ప్రదర్శనను రాష్ట్ర స్థాయికి పంపిస్తామని పేర్కొన్నారు.జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు కార్య దర్శి ఎస్. భగవంతయ్య, సెక్టోరియల్ అధికారులు కర్ర అశోక్ రెడ్డి, ఆంజనేయులు, మిల్కూరి శ్రీనివాస్, కృపా రాణి, కొత్తపల్లి మండల విద్యాశాఖాధికారి ఆనందం, అన్ని మండలాల మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యా యులు, సంఘాలనాయకులు,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మీడియా సెంటర్, ఏంసి ఏంసి, కంట్రోల్ రూమ్, హెల్ప్ లైన్ ఏర్పాటు

- ప్రారంభించిన అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.అనిల్ కుమార్,
- కంట్రోల్ రూమ్ నెంబర్ - 9100817108

**మహబూబాబాద్ నవంబర్29( సమయం న్యూస్).** గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్ కంట్రోల్ రూమ్, హెల్ప్ లైన్ సెంటర్,లను, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.అనిల్ కుమార్, శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా 24 గంటలు పని చేసే కంట్రోల్ రూమ్, మీడియా సెంటర్ ను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెడు తున్నట్లు ఫిర్యాదులు వచ్చినా.. మీడియా లో ఫేక్ న్యూస్ ప్రసారమైన, ఓటర్లు ఏదైనా సందేహాల నివృత్తికి, సమా చారం కోసం సంప్రదించిన వెంటనే స్పందించాలని చెప్పారు. ఎన్నికల ఫిర్యాదుల ఉంటే ప్రజలు కంట్రోల్ రూం నెంబర్ 9100817108 అందుబాటులో ఫోన్ చేసి చెప్పవచ్చని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిఓ వెంకటేశ్వర్లు,డిపిఓ హరిప్రసాద్, డిపిఓ పి.రాజేంద్ర ప్రసాద్, డివిజనల్ పంచాయతీ అధికారులు స్వరూప, పుల్లారావు ఏంసిఏంసి సభ్యులు ఏం.ఏ.ఫిరోజ్, కె.రాము, సిబ్బంది విక్రమ్ తదితరులు ఉన్నారు.

# నామినేషన్ స్వీకరణ క్లస్టర్ జి.పి.లను సందర్శించిన కలెక్టర్



**మహబూబ్ నగర్ నవంబర్29( సమయం న్యూస్) :** గ్రామపంచాయతీ ఎన్నికల తొలి విడత నామినేషన్ లు దాఖలుకు నేడు చివరి తేదీ కావడంతో అభ్యర్థులు ఎక్కువ సంఖ్యలో నామినేషన్ లు దాఖలు చేశారు. శనివారం మహబూబ్ నగర్ రూరల్ మండలం పరిధిలో ఫతేపూర్ క్లస్టర్ జి .పి.లో నామినేషన్ల స్వీకరణ ను కలెక్టర్ పరిశీలించారు ఫతేపూర్ క్లస్టర్–1 నందు ఫతేపూర్, భవాని తండా, లాల్యా నాయక్ తండా, తువ్వగడ్డ తండా, సర్పంచ్ మరియు వార్డు సభ్యుల స్థానాలకు అభ్యర్థులు నామినేషన్ల ను దాఖలు చేయనున్నారు రిటర్నింగ్ అధికారులను నామినేషన్ ప్రక్రియపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.నవాబ్ పేట్ మండలంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో క్లస్టర్–5 నందు నవాబ్ పేట్, పల్లె గడ్డ, దాయపంతులపల్లి, యన్మన్ గండ్ల సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాల అభ్యర్థులు నామినేషన్ల స్వీకరణ ను కలెక్టర్ పరిశీలించారు. నామినేషన్ కేంద్రంలోకీ గుంపులుగా రాకుండా చూసుకోవాలని రిటర్నింగ్ అధికారితో పాటు సహాయక రిటర్నింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం నవాబ్ పేట్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పోలింగ్ సామాగ్రిని, స్ట్రాంగ్ రూమ్ పరిశీలించారు

# రేపు ఢిల్లీకి ఆర్ పి ఐ నేత నకరికంటి సంజీవరావు ప్రయాణం




**ఖమ్మం నవంబర్ 29 : ( సమయం న్యూస్ )** రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నకరికంటి సంజీవరావు తెలంగాణ రాష్ట్రంలోని ఎస్సీ ఎస్టీలకు సంబంధించిన వివిధ సమస్యలపై ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు , కేంద్రమంత్రిరామ్ దాస్ అతవాలే తో చర్చించేందుకు నెంబర్ 1వ తేదీనదేశ రాజధాని ఢిల్లీకి ప్రయాణం కానున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలోని ఎస్సీ ,ఎస్టీ ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు... ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై కేంద్రమంత్రి కీ వివరించనున్నారు. ఈ ఎస్సీ ఎస్టీ , అట్రాసిటీ కేసులలో బాధితులకు రావలసిన నష్టపరిహారం పెండింగ్ లో ఉండటంపై సంజీవరావు కేంద్రమంత్రికి నివేదిక ఇవ్వనున్నారు. అదేవిధంగా ఎస్సీ,, ఎస్టీ ప్రజలకు చెందిన అసైన్,ఇనాంభూములను రాష్ట్ర ప్రభుత్వం వెనుకకు తీసుకోవడాన్ని , రాష్ట్రంలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికలలో వివిధ ప్రాంతాలలో ఆర్ పి ఐ తరఫుననిలబడ్డ అభ్యర్థుల గురించి కేంద్ర సామాజిక న్యాయ శాఖ మంత్రి రాందాస్ అతా వాలే కు వినతి పత్రం రూపంలో అన్ని అంశాల గురించి వివరిస్తూ సమర్పించనున్నారు. అనంతరం ఎస్సీ జాతీయ కమిషన్ ని కూడా కలుసుకొని , ఆంధ్ర ,తెలంగాణలో నెలకొన్న ఈ విషయాలపై ప్రస్తావిస్తూ .. ప్రతి నెల హియరింగ్ పెట్టాలని కోరనున్నారు. ఇదిలా ఉండగా ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ లకు సంబంధించి నష్ట పరిహారం చెల్లింపులో సుమారు 44 కోట్ల రూపాయల బకాయిలు ఉన్నాయని తెలిపారు . అదేవిధంగా రెండు రాష్ట్రాలలో లాక్ అప్ డెత్ ల గురించి కూడా ప్రస్తావన ఉంటుందన్నారు.

# భక్త రామదాసు కళాక్షేత్రాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలి

● జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ఖమ్మం, నవంబర్ 29: ( సమయం న్యూస్ ) :** ఖమ్మం నగరంలో సాంస్కృతిక ప్రదర్శనలకు వేదికగా ఉన్న భక్త రామదాసు కళాక్షేత్రం ఆధునీకరణకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. శనివారం భక్త రామదాసు కళాక్షేత్రాన్ని మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య తో కలిసి జిల్లా కలెక్టర్ సందర్శించారు. కళాక్షేత్రం మొత్తం కలియతిరుగుతూ చేయవలసిన పనులను పరిశీలించారు. కళా క్షేత్రంలో చేపట్టవలసిన ఆధునీకరణ పనులపై టాప్ ప్రూఫ్ లీకేజీ, ఎంట్రీ, ఎగ్జిట్ గేట్, పార్కింగ్, కలర్ వాష్, పరిసరాలలో పచ్చదనం కోసం మొక్కల పెంపు, నిర్వాహణ, మరమ్మత్తు పనులపై అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ కళలకు, కళాకారులకు పుట్టినిల్లయిన ఖమ్మం జిల్లాలో ఉన్న భక్త రామదాసు కళాక్షేత్రాన్ని ఆధునీకరించి, మౌళిక వసతులు ఏర్పాటు చేయాలన్నారు.

భక్తరామదాసు కళాక్షేత్రం ఆకర్షణీయంగా తయారు చేయడం, సౌండ్, ఆడియో వ్యవస్థను మెరుగు పర్చడం, పూర్తి స్థాయిలో లైటింగ్ ఏర్పాటుకు చర్యలు, గోడలకు సంప్రదాయక వాల్ పెయిటింగ్స్, సీటింగ్ అరేంజ్మెంట్స్, టాప్ ప్రూఫ్ వాటర్ లీకేజీ, కళాక్షేత్రం బయట పరిసరాల్లో గ్రీనరికి చర్యలు, పూర్తి స్థాయి మరమ్మత్తు పనులకు ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఇంటీరియర్ మరింత ఆకర్షణీయంగా తయారు చేయడం, కళాక్షేత్రంలో ఏసి ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని, వెనుక ఉన్న ప్రేక్షకులకు డయాస్ స్పష్టంగా కనిపించేలా రూపొందిచాలని అన్నారు. కళాక్షేత్రం సౌండ్ ప్రూఫ్, లోపల ఆడియో మైక్ వ్యవస్థ పక్కాగా ఉండేలా చూడాలని తెలిపారు. ముందు సీట్లలో కూర్చునే ప్రేక్షకులకు ఇబ్బంది కలగకుండా స్టేజీ ఏర్పాట్లు ఉండాలని కలెక్టర్ అన్నారు.ఇంజనీరింగ్ అధికారులు తయారుచేసిన మోడల్ డిజైన్ మ్యాప్ లు, ఆర్కిటెక్చర్ రూపొందించి నమూనా వీడియోను కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెంట జెడ్పి సీఈఓ దీక్షా రైనా, పంచాయతీరాజ్ ఇఇ మహేష్ బాబు, మున్సిపల్ డిప్యూటీ కమీషనర్ శ్రీనివాస్, అసిస్టెంట్ కమీషనర్ అనిల్, ఖమ్మం అర్బన్ తహసీల్దారు సైదులు, మునిసిపల్ డిఇ ధరణి కుమార్, టౌన్ ఫ్లానింగ్ అధికారి సంతోష్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

- మహిళల భద్రత కు అండగా "షీ" టీమ్
- పరిగి సబ్ డివిజన్ "షీ" టీమ్ ఇంచార్జ్ నర్సింహులు



**దోమ మండలం,నవంబర్,29(సమయం న్యూస్) :** మహిళల భద్రత కోసమే "షీ" టీమ్ నిరంతరం పనిచేస్తుందని పరిగి సబ్ డివిజన్ "షీ" టీమ్ ఇంచార్జ్ నర్సిములు తెలిపారు. శనివారం దోమ పోలీస్ స్టేషన్ పరిధి లోని కేజీబీవీ పాఠశాలలో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, పరిగి డీఎస్పీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు పరిగి సబ్ డివిజన్ "షీ" టీమ్ ఇంచార్జ్ నర్సింహులు ఆధ్వర్యంలో,ముఖ్యఅతిథులు ఎంఇఓ వెంకట్,ఎస్సై వసంత్ కుమార్ జదేవ్, కళాబృంద ఇంచార్జ్ అశోక్ సమక్షంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిగి సబ్ డివిజన్ "షీ" టీమ్ ఇంచార్జ్ మాట్లాడుతూ మహిళలు బాలికలకు అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ శాఖ ద్వారా ఏర్పరిచిన టోల్ ఫ్రీ 8నెంబర్లు 100, 181 ను సంప్రదించాలని అన్నారు. అదేవిదంగా మొబైల్ వాడకం దారులు అనుకొని పరిస్థితులలో సైబర్ క్రైమ్ లో మోసపోయినట్లు గుర్తించిన వెంబడి టోల్ ఫ్రీ నెంబర్ 1930కు తగిన సమాచారాన్ని ఇవ్వాలన్నారు. అంతే కాకుండా మహిళలు బాలికలు టి-సేఫ్ యాప్ ను ప్లే స్టోర్ ద్వారా యాక్టివేట్ చేసుకోవాలన్నారు. ముఖ్యంగా యాంటీ ర్యాగింగ్, యాంటీ డ్రగ్స్ యాక్ట్, రోడ్ సేఫ్టీ, ట్రాఫిక్ సేఫ్టీ, తదితర అంశాలను గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శైలజ అలాగే ఉపాధ్యాయులతో పాటు "షీ" టీమ్ సభ్యులు శోభ,బి సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

## నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన అబ్జర్వర్-సీతా లక్ష్మీ



**కోస్గి,గుండుమాల్ మండలం, నవంబర్,29(సమయం న్యూస్):** జిల్లాలో మొదటి విడత ఎన్నికలు జరిగే నారాయణపేట జిల్లా లోని కొడంగల్ నియోజకవర్గం కోస్గి, గుండు మల్ మండలాల నామినేషన్ల కేంద్రాలను శనివారం జిల్లా ఎన్నికల సాధారణ పరిశీల కురాలు సీతా లక్ష్మీ పరిశీలించారు.నామినేషన్ల ప్రక్రియ పై రిటర్నింగ్ అధికారులతో చర్చించారు. నామినేషన్ల దాఖలు కు శనివారం చివరి రోజు కావడంతో ఇంత వరకు ఎన్ని నామినేషన్లు వచ్చాయని అక్కడి అధికారులకు ఆమె అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ వేస్తున్న అభ్యర్థులతో మాట్లాడారు. నామినేషన్ల ను అన్ని పత్రాలను జత పర్చి, తప్పులు లేకుండా దాఖలు చేయాలని, ఏమైనా సందేహం ఉంటే అధికారులను అడిగి నివృత్తి చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారి అబ్దుల్ ఖలీల్, ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓ లు పాల్గొన్నారు.

## బీజేపీ నుండి కాంగ్రెస్‌లోకి చేరికలు



**బాన్సువాడ, నవంబర్ 29 (సమయం న్యూస్) :** బాన్సువాడ పట్టణంలోని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మరియు మాజీ డీసీసీబీ చైర్మన్ శ్రీ పోచారం భాస్కర్ రెడ్డి గారి సమక్షంలో వర్ని మండలంలో రాజకీయంగా ప్రాధాన్యమైన చేరికలు నమోదయ్యాయి.వర్ని మండల పరిధిలోని కూనిపూర్ గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ కార్యకర్తలు శివ, వర్ని మండల బీజేపీ నాయకులు నవీన్ రెడ్డి, సతీష్, దత్తు, మహేందర్ రెడ్డి, బాలు, ప్రవీణ్ గౌడ్, శేఖర్, గోవుర్ నరేష్ తదితరులు ఈ రోజు కాంగ్రెస్ పార్టీ కండువాలు ధరించి అధికారికంగా పార్టీలో చేరారు.ఈ సందర్భంగా కొత్తగా చేరిన నాయకులకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించిన పోచారం భాస్కర్ రెడ్డి గారు, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.చేరికల కార్యక్రమంలో వర్ని మండల ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు-కలెక్టర్ సిక్తా పట్నాయక్



**నారాయణపేట,నవంబర్,29(సమయం న్యూస్) :** 2వ సాధారణ పంచాయతీ ఎన్నికలు- 2025 దృష్ట్యా ప్రతి (సోమవారం) జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల అనంతరం ప్రజావాణి కార్యక్రమం తిరిగి నిర్వహించు వివరాలను పత్రిక ప్రకటన ద్వారా తెలియజేయడం జరుగుతుందని, ప్రజలు, దరఖాస్తుదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

# విజయానికి వికలాంగత అడ్డు కాదు

- సవ్యాంగులకు దీటుగా దివ్యాంగుల ప్రతిభ.
  జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య



**సంగారెడ్డి, నవంబర్ 29( సమయం న్యూస్). :** దివ్యాంగులు సవ్యాంగులకు దీటుగా అన్ని రంగాలలో తమ ప్రతిభను చాటుతున్నారని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో మహిళా, శిశు, వికలాంగుల, మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం జిల్లా స్థాయి దివ్యాంగుల క్రీడా పోటీలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ప్రావీణ్య క్రీడా పోటీలను ప్రారంభించి పాల్గొన్న వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,దివ్యాంగులు సవ్యాంగులకు ఏమాత్రం తీసిపోకుండా అన్ని రంగాలలో అద్భుత ప్రతిభను కనబరుస్తున్నారని అన్నారు. వికలాంగత విజయానికి అడ్డు కాదని, పట్టుదల ఆత్మవిశ్వాసంతో అనుకున్నది సాధించాలని ఉద్బోధించారు. ప్రభుత్వం అందరి కోసం సమాన అవకాశాలు, సదుపాయాలు కల్పించేందుకు కట్టుబడి ఉందని పేర్కొన్నారు. క్రీడలు దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచడంతో పాటు వారిలోని ప్రతిభను వెలుగులోకి తెస్తాయని అన్నారు.కార్యక్రమంలో వివిధ క్రీడా విభాగాల్లో జిల్లా వ్యాప్తంగా వచ్చిన దివ్యాంగులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. వీరికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రన్నింగ్, షాట్‌పుట్, వీల్‌చెయిర్ రేస్, ఇండోర్ గేమ్స్ తదితర విభాగాల్లో పోటీలు జరిగాయి. ఆయా పోటీలను కలెక్టర్ ప్రత్యేకంగా దగ్గరుండి పరిశీలించడంతోపాటు క్రీడాకారులను ప్రోత్సహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేసారు.

ఈ కార్యక్రమంలో డి డబ్ల్యు ఓలలిత కుమారి, య-ువజన సంక్షేమ శాఖ అధికారి ఖాసిం బే గ్ , జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. ఎం. వసంత్ రావు,అధికారులు, కోచ్‌లు, వాలంటీర్లు,దివ్యాంగులు,జిల్లా దివ్యాంగుల అసోసియేషన్ ప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.

# పాత మున్నేరు బ్రిడ్జి పై అర్ధాంతరంగా రాకపోకల బంద్ బైపాస్‌లో భారీ ట్రాఫిక్

- తీవ్ర ఇబ్బందుల మధ్య ప్రయాణికులు



**ఖమ్మం నవంబర్ 29 :( సమయం న్యూస్ )** స్థానిక మున్నేరు పై కాల్వ ఒడ్డు వద్ద నూతనంగా నిర్మిస్తున్న కేబుల్ బ్రిడ్జి నిర్మాణ దారులు , స్థానిక పోలీసు వారితో సమన్వయం చేసుకోలేక పోవడం వల్ల స్థానికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పాత వంతెన పై నుండి రాకపోకలు నిర్వహిస్తే నిర్మాణ పనులకు అంతరాయం ఏర్పడుతుందని గత డిసెంబర్ నెలలో మున్నేరు కింద పాత చెప్టా రోడ్డును అన్ని మరమ్మతుల నిర్వహించి , పునరుద్ధరించారు . ఆ చెప్టా రోడ్డు స్థానిక వాహనాలకు ఎంతగానో ఉపయోగపడటమే కాక నిర్మాణ పనులు నిరంతరాయంగా కొనసాగాయి. కాగా గత జూలై లో మున్నేరు ఉధృతి వల్ల ఆ చెప్ట రోడ్డు కొట్టుకు పోయింది. దాంతో స్థానిక వాహన దారులు, పాద చారులు బైపాస్ నుండి ఖమ్మం నగరానికి రాకపోకలు సాగించారు. అప్పట్లో బైపాస్ రోడ్డు పై నుండి రాకపోకలు తీవ్ర ఇబ్బంది కరంగా సాగింది. పాత వంతెన ట్రాఫిక్ ను బైపాస్ మళ్లించడం వల్ల అక్కడ వత్తిడి పెరిగినది. ఒక్కోసారి నూతన బస్ స్టాండ్ నుండి మహబూబాబాద్ క్రాస్ రోడ్డు వరకు ట్రాఫిక్ బారులు తీరేవి. అది జాతీయ రహదారి కావడం వల్ల అంతర్రాష్ట్ర వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. అలాగే పోలీసు శాఖ ఆ ట్రాఫిక్ నియంత్రిం చడానికి అత్యంత తీవ్రంగా కృషి చేశారు, దారిపొడవున సిబ్బంది ను నియమించారు. ఆ ఇబ్బందుల వల్ల స్థానికుల్లో అసహనం కలిగించింది. ప్రభుత్వం పాత వంతెన పై ద్విచక్ర వాహనాలకు మాత్రమే అనుమతిం చారు. కానీ నిర్మాణ పనుల కారణంగా అపుడప్పుడు ద్విచక్ర వాహనాలను అనుమతించడంలేదు. కాగా పోలీసు వారి ముందస్తు సమాచారం తో స్థానికులు పరిస్థితి అర్థం చేసుకొని బైపాస్ మీదుగా రాకపోకలు సాగించేవారు. కాగా నవంబర్ 28 ( శుక్రవారం ) ఉన్నఫళంగా రాకపోకలు నిలపటం వల్ల ద్విచక్ర వాహన చోదకులు తీవ్ర అస ంతృప్తి, అసహనం వ్యక్తం చేస్తు న్నారు. ముందస్తు సమా చారం లేకపోవటంతో వంతెన వరకు వచ్చి, అక్కడ పోలీ సు వారు వంతన మూసేసారు అని చెప్పడంతో అందరూ హతాసులై తిట్టుకుంటూ పోతు న్నారు. కనీసం ముందస్తు సమాచారం ఇస్తే తగు ప్రత్యామ్నాయాలు చూసుకునే వారమే అని బాధపడ్డారు. ఉదయ పదకొండు నుండి రాత్రి ఎనిమిది వరకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నిర్మాణ బాధ్యులు, పోలీసు శాఖ సమన్వయ లోపం ప్రయాణికుల పట్ల శాపంగా మారింది. ఇప్పుడు వరద పరిస్థితి లేదు... కాబట్టి మరోసారి చెప్ట రోడ్డు నిర్మించేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలి కోరుతున్నారు. చాప్ట రోడ్డును మరోసారి పునరుద్ధరిస్తే అప్పుడు ద్విచక్ర వాహనాలు, కార్లు, స్కూలు బస్ పిల్లల కు ఇబ్బంది లేకుండా ఉంటుంది. అలాగే బైపాస్ రోడ్డు పై వత్తిడి తగ్గుతుంది.... అంటూ వాపోతున్నారు . ఇది ఇలా ఉండ గా నేడు రేపు కూడా ఉదయం సాయంత్రం నుండి ద్వి చక్ర వాహనాలు అనుమతించడం లేదు అని పోలీసు శాఖ ప్రకటించడం విశేషం .

# విజయవంతంగా ముగిసిన ఎన్.ఎస్.ఎస్ సాహస శిబిరం

- కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్-డాక్టర్. బి.శ్రీనివాస్ రెడ్డి



**కొడంగల్ మున్సిపల్(మం)నవంబర్,29(సమయం న్యూస్)** ఈనెల 18 వ తేదీన హిమాచల్ ప్రదేశ్ లోని ధర్మశాలలో ప్రారంభమైన ఎన్. ఎస్. ఎస్ జాతీయ స్థాయి సాహస శిక్షణ శిబిరం [Adenture Camp] 27వ తేదీన విజయవంతంగా ముగిసినట్లు కోడంగల్ ప్రభుత్వ డీగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. బి. శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో పాలమూరు విశ్వ విద్యాలయం నుండి పాల్గొన్న మొత్తం పది మంది ఎన్. ఎస్. ఎస్ వాలంటీర్లలో తమ కళాశాల బి. ఎ. మొదటి సంవత్సరం విద్యార్థి వి. సికిందర్ ఒకరని తెలిపారు. ఈ శిబిరం, భారత యువజన వ్యవహారాలు మరియు క్రీడా మంత్రిత్వ శాఖచే అటల్ బీహారీ వాజ్ పేయి పర్వతారోహణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ సాహస శిబిరంలో వాలంటీర్లకు ఎత్తయిన కొండలపై ట్రెక్కింగ్, రాక్ క్లైంబింగ్, జుమార్ క్లైంబింగ్, రాపెల్లింగ్, వాటర్ స్పోర్ట్స్, యోగా, శారీరక శిక్షణ, సాంస్కృతిక, పర్యావరణ అవగాహన కల్పించబడినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సాహస శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులు సముద్ర మట్టానికి 2875 మీటర్ల ఎత్తు గల త్రియుండ్ పర్వత శిఖరాన్ని కూడా చేరుకున్నారు. ఇటువంటి కార్యక్రమాల వల్ల విద్యార్థుల్లో జాతీయ సమైక్యత, దేశభక్తి, క్రమశిక్షణ, శారీరక, మానసిక, సామాజిక వికాసం,నాయకత్వ లక్షణాలు, విశాల మనస్తత్వం అభివృద్ధి చెందుతాయని తెలిపారు. అంతేగాక సికిందర్ సాహస యాత్ర ఎంతోమంది విద్యార్థులకు స్ఫూర్తి గా నిలుస్తుందన్నారు. ఈ సాహస శిబిరం వల్ల తాను వివిధ రాష్ట్రాల వాలంటీర్లతో కలిసి పనిచేయడం వల్ల వారి భాష, సంస్కృతి, కట్టుబాట్లు వంటి ఎన్నో విషయాల్ని నేరుకున్నట్లు, తాను ఎనలేని ఆత్మ స్థైర్యాన్ని పొందినట్లు ఎన్. ఎస్. ఎస్ వాలంటీర్ వి. సికిందర్ తెలిపాడు.

# 24 గంటల పాటు త్రాగునీటి సరఫరాకు చర్యలు

**• మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు**

**ఖమ్మం, నవంబర్ 29( సమయం న్యూస్ ) :** ఖమ్మం నగరంలో 24 గంటల పాటు త్రాగునీటి సరఫరాకు చర్యలు చేపట్టామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. ఖమ్మం నగరం 35వ డివిజన్ లో పర్యటించి 50.25 లక్షల రూపాయలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో చేపట్టే అభివృద్ధి పనులు నాలుగు కాలాల పాటు స్థిరంగా ఉండే విధంగా పూర్తి చేయాలని అన్నారు. ప్రతి ఒక్కరూ ఖమ్మం నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుకునేందుకు బాధ్యతతో వ్యవహరించాలని అన్నారు. కార్పొరేటర్లు, ప్రజలు మున్సిపల్ కమీషనర్ కు సహకరిస్తూ పారిశుధ్య నిర్వహణ మెరుగ్గా ఉండేలా చూడాలని అన్నారు. అమృత్ పథకం క్రింద ఖమ్మం మున్సిపాలిటీకి 220 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని, అధికారులు, ప్రజా ప్రతినిధులు కూర్చొని చేపట్టాల్సిన పనుల యొక్క డిపిఆర్ తయారు చేయాలని అన్నారు. డిసెంబర్ నెలలో అమృత్ పనులకు టెండర్ పిలిచి రాబోయే వేసవి కాలం నాటికి పనులు పూర్తి చేయాలని, నగర వ్యాప్తంగా 24 గంటల పాటు త్రాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని అన్నా రు.



నగరంలో డ్రైయిన్ నిర్మాణం కోసం మరో 200 కోట్ల పనులు జరుగుతున్నాయని అన్నారు. ఖమ్మం ఖిల్లాకు రోప్ వే సౌకర్యం కల్పించి పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టామని, లకారం ప్రక్కన శిల్పారామం నిర్మిస్తున్నామని, వెలుగు మట్ల అర్బన్ పార్క్ అభివృద్ధి చర్యలు చేపట్టామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, నగర మేయర్ పునుకొల్లు నీరజ, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, కార్పొరేటర్లు, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా లో అధ్యయన పరిశీలనకు అపారమైన అవకాశాలు

**ఆదిలాబాద్ నవంబర్29(బీసమయం న్యూస్). :** ఆదిలాబాద్ జిల్లాలో అధ్యయనం, పరిశీలనకు అపారమైన అవకాశాలు మెండుగా ఉన్నాయని జిల్లా కలెక్టర్ రాజార్షి షా అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ శిక్షణలో భాగంగా జిల్లా పర్యటన పూర్తి చేసుకున్న ఐఆర్ఎస్, ఐఎస్ఎస్, ఐఆర్ఎంఎస్, ఐపీఓఎస్, ఐడిఎఏస్, ఐఇఎస్ అధికారుల బృందానికి నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు సమర్థవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. శిక్షణలో భాగంగా నిర్వహించిన పర్యటనలో విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి, మునిసిపల్, పంచాయతీ రాజ్ సహా ప్రతి శాఖకు సంబంధించిన అంశాలను అధ్యయనం చేయడం భవిష్యత్ ప్రణాళికలు, పరిపాలనా నిర్ణయాల్లో మేలైన అవగాహనను కల్పిస్తుందని పేర్కొన్నారు. శిక్షణలో పాల్గొన్న అధికారులందరికీ 'ఆల్ ది బెస్ట్' తెలిపారు. అంతకు ముందు శిక్షణలో పాల్గొన్న అధికారులు మాట్లాడుతూ, పర్యటనలో అధ్యయనం చేసిన అంశాలను, జిల్లాలోని వివిధ రంగాల పనితీరును ఆసక్తిగా గమనించామని తెలిపారు. జిల్లా యంత్రాంగం అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, శిక్షణ కలెక్టర్ సలోని



చాబ్రా, కోఆర్డినేటర్ స్వామి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.[29/11, 17:09ð Adl.Pro Untnur: పత్రికా ప్రకటననవంబర్ 29, 2025 – ఆదిలాబాద్

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో: సోమవారం ప్రజావాణి రద్దు,,...జిల్లా కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్ జిల్లా పరిధిలో గ్రామపంచాయతీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) అమల్లో ఉన్న నేపథ్యంలో, వచ్చే సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామపంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన వెంటనే ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చింది. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నంత వరకు ప్రజావాణి కార్యక్రమం చేపట్టబడదని, కోడ్ ముగిసిన వెంటనే ప్రజావాణిని తిరిగి యథావిధిగా పునఃప్రారంభిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

# ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలి

**• ఆర్.ఓలు, ఏ.ఆర్.ఓ శిక్షణలో కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి**

**నిజామాబాద్, నవంబర్ 29 ( సమయం న్యూస్) :** గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలను ఎలక్షన్ కమిషన్ నియమ, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియం ఆర్.ఓలు, ఏ.ఆర్.ఓలకు పంచాయతీ ఎన్నికల నిర్వహణ తీరుతెన్నులపై పునఃశ్చరణ కల్పించేందుకు శనివారం శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, చట్టబద్ధతతో కూడిన ఎన్నికల విధులను ఎంతో జాగరూకతతో నిర్వర్తించాల్సి ఉంటుందని, నియమ, నిబంధనల గురించి స్పష్టమైన అవగాహన ఉన్నప్పుడే పొరపాట్లకు ఆస్కారం లేకుండా సమర్థవంతంగా విధులు నిర్వహించవచ్చని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని శిక్షణ తరగతుల్లో సూచించే అంశాలను శ్రద్ధగా విని ఆకళింపు చేసుకోవాలని, ఎన్నికల సంఘం ద్వారా అందించబడిన హ్యాండ్ బుక్ (కర దీపిక) ను చదువుకుని ఈ.సీ మార్గదర్శకాల మేరకు సజావుగా ఎన్నికలు జరిగేలా కృషి చేయాలని హితవు పలికారు. ఎలాంటి సందేహాలు ఉన్నా, అధికారులను అడిగి నివృత్తి చేసుకోవాలని అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్, వార్డు స్థానాల కోసం పోటీ చేసే అభ్యర్థులు ప్రత్యేకంగా కొత్త బ్యాంకు ఖాతాను తెరువాల్సి ఉందని, ఈ ఖాతా ద్వారానే ఎన్నికల కార్యకలాపాలకు సంబంధించిన లావాదేవీలు జరపాలని ఈ.సీ నిర్దేశించినందున నామినేషన్ పత్రాల కోసం వచ్చే అభ్యర్థులకు ఈ విషయాన్ని తెలియజేయాలన్నారు. నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, ఉపసంహరణ ప్రక్రియలను



ఈ.సీ మార్గదర్శకాలకు అనుగుణంగా రిటర్నింగ్ అధికారులు తమ స్వీయ పర్యవేక్షణలో నిర్వహించాలని సూచించారు. సమయ పాలనను పక్కాగా పాటించాలని. అన్నారు. నామినేషన్ల ఉపసంహరణ కోసం అభ్యర్థులు కాకుండా, వారి తరపున ప్రతిపాదకులు వచ్చిన సమయంలో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతనే ఉపసంహరణకు అనుమతించాలని కలెక్టర్ సూచించారు. బ్యాలెట్ పేపర్ లో అభ్యర్థుల పేర్లను అక్షర క్రమం ఆధారంగా వరుసగా ముద్రించాల్సి ఉంటుందని, ఓటరు జాబితాలోని అభ్యర్థి పేరును అక్షర క్రమం కోసం పరిగణలోకి తీసుకోవాలన్నారు. అభ్యర్థులు ఎన్ని సెట్ల నామినేషన్లు సమర్పిస్తే, అన్ని నామపత్రాలను తప్పనిసరిగా పరిశీలించాలని, వాటిలో ఎన్ని ఆమోదించబడ్డాయి, ఎన్ని తిరస్కరణకు గురయ్యాయి, అందుకు గల కారణాలు ఏమిటీ అనే అంశాలను వెల్లడించాల్సి ఉంటుందని అన్నారు. వెంట దివెంట రోజువారీ రిపోర్టులను పంపించాలని, అభ్యర్థుల నామినేషన్ పత్రాలను స్కాన్ చేసి ఆన్ లైన్లో అప్లోడ్ చేయాలని సూచించారు. ఉపసంహరణ ప్రక్రియ ముగిసిన మీదట బ్యాలెట్ పత్రాన్ని జాగ్రత్తగా రూపొందించాలని, పోటీలో ఉన్న అభ్యర్థుల పేర్లు, వారికి కేటాయించిన గుర్తులతో పాటు "నోటా" సింబల్ ను కూడా తప్పనిసరిగా చేర్చాలని కలెక్టర్ సూచించారు. ఎలాంటి తప్పిదాలను తావులేకుండా పూర్తి పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ బాధ్యతలను నిర్వర్తించాలని, జిల్లాకు మంచి పేరు తేవాలని హితవు పలికారు. తరగతుల్లో జిల్లా పంచాయతీ అధికారి డి.శ్రీని వాస్ రావు, డీఎల్పీఓ శ్రీనివాస్, ఆర్.ఓలు, సహాయ ఆర్.ఓలు పాల్గొన్నారు.

# బీసీ స్టడీ సర్కిల్స్ ద్వారా IELTS శిక్షణ తరగతులు

**• విదేశాల్లో ఉన్నత విద్యనుభ్యసించే వారికి అంతర్జాతీయ స్కాలర్షిప్ లు**

**• పొందేలా స్టడీ సర్కిల్ లో శిక్షణ - శ్రీనివాస్ రెడ్డి బీసీ స్టడీ సర్కిల్స్ డైరెక్టర్**

**హైదరాబాద్ నవంబర్ 29( సమయం న్యూస్) :** తెలంగాణ రాష్ట్రంలోని బిసి మరియు ఇతర విద్యార్థులకు విదేశాలలో వున్న అత్యున్నత విశ్వ విద్యాలయాలలో ఉన్నత విద్యను అభ్యసించేందుకు గల అవకాశాలను మరియు విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఇవ్వబడుతున్న అంతర్జాతీయ స్కాలర్షిప్లు పొందడం లక్ష్యంగా నిర్మాణాత్మక అవగాహన సెషన్లు, శిక్షణా కార్యక్రమాలను తెలంగాణ బి.సి స్టడీ సర్కిల్ వారు ప్రారంభించడం జరుగుతుందని బీసీ స్టడీ సర్కిల్స్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటన లో తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో భాగంగా రాష్ట్రం లోని 12 బి.సి స్టడీ సర్కిల్స్ నందు విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించేందుకు గల అవకాశాలను వివరించేందుకు అవగాహన కార్యక్రమాలను మరియు IELTS శిక్షణ తరగతులు ప్రారంభించడం జరుగుతుందని వెల్లడించారు.

పైన తెలుపబడిన అవగాహన కార్యక్రమాలకు మరియు IELTS శిక్షణ తరగతులుకు హాజరు అవ్వుటకు ఆసక్తి వున్న గ్రాడ్యుయేషన్ (ప్రొఫిషనల్ మరియు నాన్ ప్రొఫెషనల్) ఉత్తీర్ణత పొందిన అభ్యర్థులు తేది 01.12.2025 నుండి 21.12.2025 వరకు తేదీ వరకు టి.జి.బి.సి.స్టడీ సర్కిల్ వెబ్సైట్ www.tgbcstudycircle.cgg.gov.in ద్వారా ఆన్లైన్ దరఖాస్తు చేసుకోవచ్చు. మరింత సమాచారం %ఫ్స్ట్ర.చీశీ%.040-24071178 ద్వారా తెలుసుకోవచ్చని బీసీ స్టడీ సర్కిల్స్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

# న్యాయ, పోలీస్, ఆబ్కారీ, జైలు శాఖల అధికారులు సమిష్టి కృషితో బాధితులకు సత్వర న్యాయం అందించాలి

**• జిల్లా ప్రధాన న్యాయమూర్తి కే. ప్రభాకర్ రావు .**




శనివారం జిల్లా కోర్టు కాంప్లెక్స్ లో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్ తో కలిసి ఆయన న్యాయ అధికారుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ, అధికారులు సమిష్టి కృషితో బాధితులకు సత్వర న్యాయం అందించాలని అన్నారు. ముఖ్యంగా దీర్ఘకాలికంగా పెండింగ్ కేసులను, ఫోక్సో, గంజాయి వంటి కేసులను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలన్నారు. జిల్లా కోర్టులోని వివిధ విభాగాల్లో అక్టోబర్ మాసాంతానికి 7310 కేసులు పెండింగ్ లో ఉన్నాయని, 98 కేసులు దీర్ఘాకాలికంగా పెండింగ్ ఉన్నాయని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, 18 భూసేకరణ కేసుల 66 లక్షల రూపాయలకు సంబంధించిన వివరాలను సీసీఎల్ఏ నుండి ఇరిగేషన్, ఆర్థిక శాఖకు పంపించి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఏజెన్సీ ఏరియాలో సివిల్ సూట్స్ కేసులను శనివారం విచారణ జరపడం జరుగుతుందని, పాత ఏజెన్సీ కేసులను ఆర్డీవో, సబ్ కలెక్టర్ పరిధిలో విచారణకు పంపడం జరుగుతుందని, ఇది ఒక ఆదిలాబాద్ జిల్లాకి పరిమితం ఉందన్నారు. జైలు, ఆబ్కారీ, డ్రగ్ లకు సంబంధించి లోక్ అదాలత్ పెండింగ్ కెసులను పర్యవేక్షిస్తూ, వాటి పరిష్కారానికి జిల్లా యంత్రాంగం ద్వారా సహకారం అందిస్తామని తెలిపారు. అనంతరం జల్ సంచాయి జన్ బాగిదరి విభాగంలో రాష్ట్రపతి చేతులమీదుగా అవార్డు అందుకున్నందుకుగాను జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయమూర్తులు, ఎస్పీ, అధికారులు కలెక్టర్ ను సన్మానించారు.

ఈ సమావేశంలో న్యాయమూర్తులు వివేక్ కుమార్, లక్ష్మి కుమారి, సి ఏం రాజ్యలక్ష్మి, డి.హుస్సేన్, మౌనిక, పోలీస్, జైలు, అబ్కారీ శాఖల అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

# సత్యసాయి సేవ సమితి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం.

**కోస్గి మున్సిపల్(మం)నవంబర్,29(సమయం న్యూస్) :** భగవాన్ శ్రీ సత్యసాయి బాబా సేవ సమితి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నారాయణపేట జిల్లా కోస్గి సత్యసాయి సేవ సమితి కన్వీనర్ విష్ణు ప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా (ఆదివారం)నేడు స్థానిక వేద పాఠశాలలో సత్యసాయి సేవా సంస్థలు యువజన విభాగం తరఫున రక్తదాన శిబిరం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. సత్యసాయి భక్తులు,యువజన సంఘాల సభ్యులు ముందుకు వచ్చి రక్తదానం చేయాలని అన్నారు. ఈసందర్భంగా సత్యసాయి సేవా సంస్థలు యువజన విభాగం జిల్లా కోఆర్డినేటర్ వెంకట్ రాములు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పోటీ చేసే అభ్యర్థులకు నియమాలు పాటించాలి.

**జనగాం నవంబర్29( సమయం న్యూస్) :** పబ్లిక్ మీటింగ్ పెట్టుకోవడానికి అనుమతులు

వివిధ రాజకీయ పార్టీ ల ప్రతినిధులు అలాగే పోటీ చేస్తున్న అభ్యర్థులు తమ ప్రచారం కోసం పబ్లిక్ మీటింగ్ పెట్టుకోవడానికి, ర్యాలీ లు నిర్వహించడానికి, మైకులు పెట్టుకోవడానికి సంబంధిత మండల తహసీల్దార్ కి అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవలిసి ఉంటుంది.. అప్పుడు ఆ తహసీల్దార్ స్థానిక %బానూ% ద్వారా వారికి అనుమతి ఇవ్వడం జరుగుతుందిపోలింగ్ పరిసమాప్తం కావడానికి నిర్ణయించిన సమయానికి ముందు 44 గంటల నుండి బహిరంగ సభలను నిర్వహించటం, ఊరేగింపులు చేయడం నిషిద్ధం అనుమతి పొందిన బహిరంగ సమావేశాలు అలాగే రోడ్ షో ల వద్ద లౌడ్ స్పీకర్లు ఉదయం 6 గంటల నుండి రాత్రి పది గంటల మధ్య మాత్రమే ఉపయోగించాలి ఈ నిబంధనను ఎవరైనా ఉల్లంఘించినట్లయితే పోలీస్ అధికారులు లౌడ్ స్పీకర్ లను జప్తు చేయడానికి అధికారం కలిగి ఉంటారు

ఎన్నికల ప్రచారానికి వాహనాల వినియోగం

సర్పంచ్ పదవికి పోటీ చేసే అభ్యర్థులు గ్రామపంచాయతీ పరిధిలో తమ ప్రచారానికి ఒక వాహనాన్ని ఉపయోగించడానికి అనుమతిస్తారు

అట్టి అభ్యర్థులు ప్రచారానికి వినియోగించేందుకు ప్రతిపాదించిన వాహనాల వివరాలను సంబంధిత తాసిల్దార్లకు మందుగా తెలియజేయాల్సి ఉంటుంది

వార్డు సభ్యుని పదవికి పోటీ చేసే అభ్యర్థులు ప్రచారం కోసం ఎలాంటి వాహనాన్ని ఉపయోగించకూడదు

పోలింగ్ రోజున వాహనాల వినియోగం

పోలింగ్ రోజున గ్రామపంచాయతీ సర్పంచ్ పదవికి పోటీ చేసే అభ్యర్థులు ఒక వాహనాన్ని ఉపయోగించేందుకు మాత్రమే అనుమతిస్తారు

పోలింగ్ రోజున ఇతర వాహనాలను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించరు

వార్డు విస్తీర్ణం చాలా తక్కువ ఉంటుంది కాబట్టి వార్డు మెంబర్ పదవికి పోటీ చేసే అభ్యర్థులకు వాహన అనుమతి ఉండదు

వాహన అనుమతులు .. సంబంధిత తహసిల్దార్లు నిర్ణిత నమూనాలో గ్రామపంచాయతీ సర్పంచ్ పదవులకు పోటీ చేసే అభ్యర్థులకు మాత్రమే వాహన పర్మిట్లను జారీ చేస్తారు

వాహన పర్మిట్ అసలు ప్రతి వాహనం ముందు వైపు అద్దంపై అభ్యర్థులు అతికించాల్సి ఉంటుంది

## ప్రీ మెట్రిక్ స్కాలర్షిప్ దరఖాస్తు సమర్పించుట కు రెండు రోజులే గడువు.

● జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి సంగీత

**పెద్దపల్లి, నవంబర్ -29( సమయం న్యూస్).:** డిసెంబర్ 31 లోపు ప్రీ మెట్రిక్ స్కాలర్షిప్ దరఖాస్తు సమర్పించాలని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి సంగీత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి జిల్లాలోని ప్రభుత్వ % ఎయిడెడ్ పాఠశాలలోని గిరిజన విద్యార్థిని, విద్యార్థులకు 3వ తరగతి నుండి 8వ తరగతి వరకు న్యూ స్కీం పథకం క్రింద, 9 నుంచి 10వతరగతి వరకు రాజీవ్ విద్యా దీవెన పథకము క్రింద గిరిజన విద్యార్థిని, విద్యార్థులకు ప్రి-మెట్రిక్ స్కాలర్షిప్ ఈ-పాస్ లాగిన్ లో డిసెంబర్ 31 లోపు రిజిస్ట్రేషన్ చేసి హార్డ్ కాపీలను జిల్లా గిరిజన అభివృద్ధి ఆధికారి కార్యాలయం కరీంనగర్ గారికి త్వరితగతిన సమర్పించాలని, ఇతర వివరాలకు 9502664044 ఫోన్ నెంబర్ నందు సంప్రదించ గలరని గిరిజన అభివృద్ధి అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఉద్యోగుల పెండింగ్ బిల్లులు రూ. 707.30 కోట్లు విడుదల

**హైదరాబాద్ నవంబర్29( సమయం న్యూస్) :** ఉద్యోగ సంఘాలకు ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగుల పెండింగ్ బిల్లులకు సంభంసించిన రూ. 707.30 కోట్లు విడుదల చేస్తూ డిప్యూటీ సీఎం బట్టి పక్రమార్క ఆదేశాలు జారీ చేశారు. డిప్యూటీ సీఎం ఆదేశం మేరకు ఆర్థిక శాఖ అధికారులు నవంబర్ నెలకు సంబంధించి రూ.707.30 కోట్ల పెండింగ్ బిల్లులను శనివారం విడుదల చేశారు. ఉద్యోగ సంఘాలకు ఇచ్చిన హామీలో భాగంగా ప్రతినెల రూ. 700 కోట్లకుపైగా నిధులను విడుదల చేస్తూ వస్తున్నారు. అందులో భాగంగా ఈనెల రూ. 707.30 కోట్లను ఉద్యోగుల పెండింగ్ బిల్లులను ఆర్థిక శాఖ విడుదల చేసింది. నవంబర్ తో వరుసగా నాలుగు నెలలుగా ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగుల బకాయిలను చెల్లిస్తూ వస్తోంది. ఇందులో గ్రాట్యుటీ, జీపీఎఫ్, సరెండర్ లీవ్స్, అడ్వాన్స్ లకు సంబంధించిన బిల్లులు ఉన్నాయి.

### కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మాజీ డీసీసీబీ చైర్మన్ శ్రీ పోచారం భాస్కర్ రెడ్డి గారి అధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ లోకి చేరికలు



**వర్ని నవంబర్29( సమయం న్యూస్) :** వర్ని మండల పరిధిలోని కూనిపూర్ గ్రామానికి చెందిన బీజేపీ పార్టీకి చెందిన మండల సీనియర్ కార్యకర్తలు శివ వర్ని మండల బీజేపీ నాయకులు, నవీన్ రెడ్డి, సతీష్, దత్తు, మహేందర్ రెడ్డి, బాలు, ప్రవీణ్ గౌడ్, శేఖర్, గోవుర్ నరేష్ గార్లు బాన్సువాడ లోని నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పోచారం భాస్కర్ రెడ్డి గారి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ లో చేరారు ఈ సంధర్బంగా పార్టీ కండువా కప్పి పార్టీ లోకి సాదరంగా ఆహ్వానించిన పోచారం భాస్కర్ రెడ్డి గారు పాల్గొన్న వర్ని మండల ప్రజాప్రతినిధులు, నాయకులు

## ఎన్నికల ప్రక్రియ సమర్ధవంతంగా చేపట్టాలి

● జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల నవంబర్ 29,( సమయం న్యూస్).:** 2వ సాధారణ పంచాయతీ ఎన్నికలు-2025 నేపథ్యంలో ఎన్నికల నిర్వహణ ప్రక్రియ సమర్థవంతంగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశం మందిరంలో తెలంగాణ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్ సెంటర్ (టి.జి.ఆర్.ఎ.సి.) సంచాలకులు, అదనపు జనరల్ సంచాలకులు, ఎన్నికల సాధారణ పరిశీలకులు పి. మనోహర్, ఎన్నికల ఖర్చుల పరిశీలకులు ఈ.రాజేశ్వర్ లతో కలిసి నోడల్ అధికారులు, సహాయ ఖర్చుల పరిశీలకులు, ప్రత్యేక బృందాల అధికారులతో ఎన్నికల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల సాధారణ పరిశీలకులు మాట్లాడుతూ సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు జరుగుతున్న ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఖచ్చితంగా అమలు చేయాలని, ఎన్నికల నిర్వహణ కొరకు ఫ్లయింగ్ సర్వేయలెన్స్ బృందం, స్టాటిస్టిక్ సర్వేయలెన్స్ బృందం, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేసి ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది నియమించడం జరిగిందని తెలిపారు. ఈ క్రమంలో ప్రజలను ప్రలోభ పెట్టే అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, అభ్యర్థుల ప్రచారంలో వినియోగించే ప్రతి అంశాన్ని ఎన్నికల సంఘం జారీ చేసిన ధరల పట్టికను అనుసరించి లెక్కించాలని తెలిపారు. 5 వేల జనాభా కంటే అధికంగా ఉన్న సర్పంచ్ స్థానానికి 2 లక్షల 50వేల రూపాయలు, 5 వేల జనాభా కంటే తక్కువగా ఉంటే 1 లక్ష 50 వేల రూపాయలను, వార్డు సభ్యుల స్థానానికి 5 వేల జనాభా కంటే ఎక్కువగా ఉంటే 50వేల రూపాయలు, 5 వేల జనాభా కంటే తక్కువగా ఉంటే 30 వేల రూపాయలను ప్రచార వ్యయ పరిమితి విధించడం జరిగిందని తెలిపారు. అభ్యర్థులు బ్యాంకు ఖాతా కలిగి ఉన్నట్లయితే సదరు శాఖలో నూతన కరెంట్ ఖాతాను తెరిచి వినియోగించుకోవచ్చని, ఇతర బ్యాంకు శాఖలలో అయితే నూతన ఖాతా తెరిచి వినియోగించాలని తెలిపారు. ఎన్నికల సంఘం జారీ చేసిన నిర్దిష్ట నమూనాలో అభ్యర్థుల ఎన్నికల ఖర్చుల వివరాలు ప్రతి రోజు నమోదు చేయాలని, సహాయ ఖర్చుల పరిశీలకులు ఖర్చుల వివరాలను పరిశీలించాలని తెలిపారు. పంచాయతీ ఎన్నికలకు అధికారులు, సంఖ్య ఎక్కువగా అవసరం ఉంటుందని, అసెంబ్లీ ఎన్నికలకు సమానంగా ఎన్నికల నిర్వహణ జరుగుతుందని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ముగిసేంత వరకు జిల్లాలోని బెల్ట్ షాపులను మూసి ఉంచాలని, అభ్యర్థుల ప్రచార అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఫిర్యాదులు, సమాచారం కొరకు కంట్రోల్ రూమ్ నం.08736- 250501 ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ ఖర్చుల పరిశీలకులు, నోడల్ అధికారులు, ప్రత్యేక బృందాల అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

## దివ్యాంగులను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలి

● జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.

**నిర్మల్ నవంబర్29( సమయం న్యూస్):** దివ్యాంగులకు అన్ని రంగాలలో ప్రోత్సాహకం అందించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. శనివారం, సాయంత్రం పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని దివ్యాంగులకు జిల్లా స్థాయి క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ మాట్లాడుతూ, దివ్యాంగులకు అందరూ ప్రోత్సాహకాన్ని అందిస్తూ, సమాజంలో భాగస్వామ్యం చేయాలన్నారు. ∩ ఇటీవలి అందుల క్రికెట్ ప్రపంచ కప్ భారత జట్టు గెలుచుకుందని ఉదాహరించారు. దివ్యాంగులంతా క్రీడలను తమ జీవితంలో భాగస్వామ్యం చేసుకోవాలని చెప్పారు. క్రీడల వల్ల ఉల్లాసం కలుగుతుందని వివరించారు. దివ్యాంగుల కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. తప్పకుండా డిఆర్ సి సమావేశాలు నిర్వహించి, సమస్యలను తెలుసుకుంటూ, తగు చర్యలు చేపడతామని తెలిపారు. దివ్యాంగులు తమ నైపుణ్యాలు పెంచుకొని, వివిధ రంగాలలో ప్రగతి సాధించాలని సూచించారు.

# బలవంతపు ఏకగ్రీవాలకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు

**నిజామాబాద్, నవంబర్ 29( సమయం న్యూస్) :** స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎవరైనా బలవంతపు ఏకగ్రీవాలకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం నూతన మార్గదర్శకాలు జారీ చేసిందని తెలిపారు. అందరూ ఐకమత్యంగా ఉంటూ, సమిష్టి నిర్ణయం ద్వారా సర్పంచ్, వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకుంటే అది ఆహ్వానించదగ్గ పరిణామం అని అన్నారు. అయితే అందుకు భిన్నంగా డబ్బుల ప్రలోభాలు చూపి, భయ భ్రాంతులకు గురి చేసి బలవంతంగా ఏకగ్రీవాలు చేయించే ప్రయత్నాలను ఎంతమాత్రం ఉపేక్షించమని స్పష్టం చేశారు. ఇది ఎన్నికల వ్యవస్థకు, ప్రజాస్వామ్య స్ఫూర్తికి గొడ్డలి పెట్టు అని అన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ, బలవంతపు ఏకగ్రీవాలకు ప్రయత్నించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించిందని అన్నారు. ఈ తరహా సంప్రదాయానికి చరమగీతం పాడుతూ, స్వేచ్ఛాయుత వాతావరణంలో పూర్తి పారదర్శకంగా, నిష్పక్షపాతంగా



ఎన్నికలు నిర్వహించేలా రాష్ట్ర ఎన్నికల సంఘం ఏకగ్రీవాల విషయంలో నూతన నియమ నిబంధనలతో మార్గదర్శకాలు జారీ చేసిందని కలెక్టర్ తెలిపారు. ఏకగ్రీవ ఎన్నిక అని నిర్ధారణ చేయడానికి ముందు "తప్పనిసరి ధృవీకరణ" విధానాన్ని అమలులోకి తెచ్చిందని అన్నారు. ఏకగ్రీవాల వెనుక ఎలాంటి అంశాలు దాగి ఉన్నాయి అన్నది పరిశీలించేందుకు మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేస్తామని, పోటీలో మిగిలి ఉన్న ఏకైక అభ్యర్థితో పాటు, పోటీ నుండి తప్పుకున్న అభ్యర్థుల నుండి లిఖిత పూర్వకంగా డిక్లరేషన్ తీసుకోవడం జరుగుతుందన్నారు. తమను ఎవరూ బెదిరించలేదని పోటీ నుండి వైదొలగిన వారు, తాను ఎవరినీ బలవంత పెట్టలేదని పోటీలో మిగిలిన ఏకైక అభ్యర్థి డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. వాటిని జిల్లా ఎన్నికల అథారిటీ క్షుణ్ణంగా పరిశీలించి, సమిష్టి నిర్ణయంతో ఏకగ్రీవం అయ్యిందని నిర్ధారణ చేసుకుని నో అబ్జెక్షన్ లెటర్ ఇస్తారని, ఆ తరువాతే ఏకగ్రీవ ఎన్నిక ఫలితాన్ని ప్రకటిస్తారని కలెక్టర్ తెలిపారు. ఈ క్రమంలో ఎక్కడైనా ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ఏకగ్రీవం చేసినట్లు నిర్ధారణ జరిగితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని అన్నారు. సదరు ఎన్నికను రాష్ట్ర ఎన్నికల సంఘం రద్దు చేసే అవకాశం ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రతి ఎన్నిక, ప్రతి గెలుపు ప్రజల అభిప్రాయాన్ని నిజాయితీగా ప్రతిబింబించేలా ప్రజాస్వామ్య పటిష్టతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ హితవు పలికారు.

## సీబీసీ రాజ్యాంగ దినోత్సవ ఫోటో ఎగ్జిబిషన్‌ను సందర్శించిన పాట్నా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎల్. నరసింహా రెడ్డి

● విద్యార్థులతో మాటామంతి

**హైదరాబాద్ నవంబర్29( సమయం న్యూస్) :** కేశవ్ మెమోరియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ సహకా రంతో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న రాజ్యాంగ దినోత్సవ ఫోటో ఎగ్జిబిషన్‌ను కేశవ్ మెమోరియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ (కేఎంఈఎస్) అధ్యక్షులు, హైదరాబాద్ విశ్వవిద్యాలయం ఛాన్సలర్, పాట్నా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎల్. నరసింహా రెడ్డి ఈ రోజు సందర్శించారు.

జస్టిస్ రెడ్డితో పాటు సీబీసీ అదనపు డైరెక్టర్ జనరల్ శ్రీమతి శ్రుతి పాటిల్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాజ్యాంగ దినోత్సవం, వందేమాతరం ఏ150 సమాచార ప్యానెల్‌లను ఆయన ఆసక్తిగా పరిశీలించారు. విద్యార్థులకు రాజ్యాంగ ఇతివృత్తాలను ఆకర్షణీయంగా, సమాచారం అందించే విధంగా ప్రదర్శించడానికి చేసిన ప్రయత్నాలను ఆయన అభినందించారు. కేశవ్ మెమోరియల్ కాలేజ్ ఆఫ్ లా (కేఎంసీఎల్) విద్యార్థులనుద్దేశించి ప్రసంగించిన జస్టిస్ నరసింహా రెడ్డి... భారత రాజ్యాంగ ప్రాముఖ్యతను ప్రధానంగా ప్రస్తావించారు. డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ నేతృత్వంలోని ముసాయిదా కమిటీ చేసిన అద్భుత కృషికి ఫలితంగా రాజ్యాంగాన్ని ఆయన అభివర్ణించారు. రాజ్యాంగం అనుకూలతే దాని గొప్ప బలం అన్న జస్టిస్ నరసింహా రెడ్డి... సాంకేతికత, న్యాయం అందించడం, పరిపాలన, సంక్షేమం సహా అభివృద్ధి చెందుతున్న సామాజిక అవసరాలకు అనుగుణంగా దానిని మార్చుకోవచ్చని పేర్కొన్నారు.




ప్రాథమిక హక్కులను భారత ప్రజాస్వామ్యానికి కేంద్ర బిందువుగా అభివర్ణించిన జస్టిస్ నరసింహా రెడ్డి... పౌరులు తమ ప్రాథమిక విధులను సక్రమంగా నిర్వర్తించినప్పుడే ఈ హక్కులు అర్థవంతంగా ఉంటాయని అన్నారు. భారత్ ఇప్పుడు దాని శాస్త్రీయ, ఆర్థిక విజయాల కోసం మాత్రమే కాకుండా సహనం, బలమైన కుటుంబ వ్యవస్థలు, యోగా వంటి సామాజిక విలువల కోసం కూడా ప్రపంచ గౌరవాన్ని పొందుతోందని ఆయన వ్యాఖ్యానించారు. ప్రతి పౌరుడినీ సమానంగా చూడాలనీ, సోదర భావంతో పనిచేయాలని జస్టిస్ రెడ్డి విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులతో మాటామంతీలో వారు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు.

ఈ కార్యక్రమంలో కేఎంఈఎస్ కార్యదర్శి శ్రీ ఎ.వి. సుబ్రహ్మణ్యం, సంయుక్త కార్యదర్శి శ్రీ బి. శ్రీధర్ రెడ్డి, కేఎంసీఎల్ ప్రిన్సిపాల్ డాక్టర్ వాణి అక్కపెద్ది, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## రేగొండ మండలంలో ఎన్నికల సాధారణ పరిశీలకులు ఫణీంద్ర రెడ్డి పర్యటన నామినేషన్ కేంద్రాల పరిశీలన.

**రేగొండ నవంబర్29( సమయం న్యూస్) :** జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామ పంచాయతీ సాధారణ పరిశీలకులు ఫణీంద్ర రెడ్డి తెలిపారు. శనివారం రేగొండ మండలంలోని పలు గ్రామ పంచాయతిలను సందర్శించి ఏర్పాట్లను సమీక్షించారు.

ఈ సందర్భంగా రేగొండ, రంగయ్యపల్లి, దమ్మున్నపేట, మొగుళ్లపల్లి, రంగాపూర్, రూపిరెడ్డిపల్లి చెక్‌పోస్ట్‌లను తనిఖీ చేశారు. ప్రతి వాహనాన్ని నిశిత పరిశీలన చేయాలని సూచించారు. నామినేషన్ కేంద్రాలను పరిశీలించి సౌకర్యాలను, నామినేషన్‌ల స్వీకరణ విధానాన్ని



సమీక్షించారు. ఆర్.ఓ., ఏఆర్.ఓ.లతో మాట్లాడి నామినేషన్ పత్రాల పరిశీలన, రికార్డుల నిర్వహణ, అభ్యర్థులకు అందించే మార్గదర్శకాలపై సూచనలు ఇచ్చారు. తదుపరి పోలింగ్ కేంద్రాలను సందర్శించి అవసరమైన ఏర్పాట్లను పరిశీలించారు. ఎంపీడీఓలు, తహసీల్దార్లు పోలింగ్ కేంద్రాల్లో కనీస మౌలిక సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా ఎఫ్ ఎస్ టి బృందాలతో మాట్లాడి ఇప్పటివరకు టీము చేసిన తనిఖీలు, స్వాధీనం చేసుకున్న వస్తువులు, చేపట్టిన చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల నియమావళి అమలులో పటిష్ఠ పర్యవేక్షణ జరగాలని ఆదేశించారు. ఎన్నికలను శాంతియుతంగా, నిబంధనలకు లోబడి నిర్వహించేందుకు అన్ని శాఖలతో సమన్వయం చేసుకుని పనిచేయాలని అధికారులకు సూచించారు.

# రైతులను రక్షించడానికే నూతన విత్తన ముసాయిదా చట్టం

● జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**భూపాల పల్లి నవంబర్29(బీసమయం న్యూస్)** ప్రస్తుత వ్యవసాయ పరిస్థితులకు అనుగుణంగా రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడానికి, నకిలీ విత్తనాలపై నిషేధం విధించడానికి, విత్తనాల దిగుమతిని సరళీకరించడానికి మరియు రైతు హక్కులను రక్షించడానికి నూతన విత్తన చట్టం ముసాయిదా ప్రతిపాదించడం జరిగిందని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శనివారం ఐడిఓసి కార్యాలయ సమావేశపు హాలులో నూతన విత్తన చట్టం 2025 ముసాయిదాపై వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పోలీస్, ఉద్యాన, విత్తన కంపెనీలు, ఇన్పుట్ డీలర్లు, రైతుల ఉత్పత్తి సంఘాలు అనుబంధ సంస్థలు, రైతులతో అభిప్రాయ సేకరణ చర్చా సదస్సుకు ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరయ్యారు. నూతన విత్తన చట్టం%-%2025 రైతులు సలహాలు, సూచనలు అందించాలని ఆయన సూచించారు. భారత ప్రభుత్వం ప్రతిపాదించిన నూతన విత్తన చట్టం 2025 ముసాయిదా పై చేయవలసిన మార్పులు, చేర్పులపై రైతులు, విత్తన డీలర్లు, ఇన్పుట్




డీలర్లు, రైతు సంఘాలు తమ అమూల్యమైన సూచనలు, సలహాలు అందించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాణిజ్య ప్రక్రియల సరళీకరణ, నిబంధనల ఉల్లంఘన జరిగినపుడు కఠినమైన శిక్షలు ఉంటాయని తెలిపారు. నాణ్యత నియంత్రణ చర్యలు వంటి అంశాలను ఈ చట్టంలో స్పష్టంగా ఆయన పొందుపరిచినట్లు వివరించారు. పార్లమెంటులో ఈ చట్టాన్ని ఆమోదించడానికి ముందు, రైతులు, ఎన్‌జీఓలు, రైతు సంఘాలు, లబ్ధిదారుల అభిప్రాయాలను సమగ్రంగా సేకరించి, వాటిని ముసాయిదాలో పొందుపరిచి ఆమోదం తర్వాతే ముందుకు తీసుకువెళ్తామని తెలిపారు. ఈ ప్రతిపాదిత చట్టంలో మొత్తం 10 అధ్యాయాలు, 48 విభాగాలు ఉన్నాయి అని కలెక్టర్ వివరించారు. 1966 విత్తన చట్టంలోని లోపాలను సవరించి, ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా నూతన చట్టం రూపొందించబడినట్లు చెప్పారు. ఇలాంటి కీలక చట్టంపై ప్రతి రైతు తమ అభిప్రాయాలు, సూచనలు తప్పక తెలియజేయాలని కోరుతూ, అందుకున్న సూచనలను ప్రభుత్వంకు సమగ్ర నివేదికగా పంపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎస్పీ నరేష్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి బాబూరావు, ఉద్యాన వన అధికారి సునీల్ కుమార్, మహదేవపూర్ వ్యవసాయ శాఖ ఏడీఏ శ్రీపాల్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నేడు భారత్, దక్షిణాఫ్రికా తొలి వన్డే

## 9 ప్రపంచ రికార్డుల ముంగిట కోహ్లి



క్రికెట్ ప్రపంచంలో కింగ్ కోహ్లీగా ప్రఖ్యాతి గాంచిన విరాట్ కోహ్లీకి నవంబర్ 30 నుంచి ప్రారంభం కానున్న మూడు వన్డే మ్యాచ్‌ల సౌతాఫ్రికా సిరీస్ చాలా కీలకం కానుంది. ఇది కోహ్లీకి కేవలం ఒక సాధారణ సిరీస్ కాదు, ఏకంగా తొమ్మిదికి పైగా అరుదైన ప్రపంచ రికార్డులను తన ఖాతాలో వేసుకునే అద్భుతమైన అవకాశం. అత్యంత వేగంగా 28,000 అంతర్జాతీయ పరుగులు పూర్తి చేయడం నుంచి, ఒకే ఫార్మాట్‌లో అత్యధిక సెంచరీలు సాధించడం వరకు... ఈ సిరీస్‌లో విరాట్ కొట్టే ప్రతి పరుగు చరిత్ర సృష్టించనుంది. విరాట్ కోహ్లీ ప్రస్తుతం వన్డే క్రికెట్‌లో 51 సెంచరీలతో, టెస్టుల్లో 51 సెంచరీలు సాధించిన సచిన్ టెండూల్కర్ రికార్డుతో సమంగా ఉన్నాడు. ఈ సిరీస్‌లో విరాట్ కేవలం ఒక్క సెంచరీ సాధిస్తే, వన్డేల్లో 52 సెంచరీలు పూర్తి చేసుకుంటాడు. తద్వారా అతను ఏ ఒక్క ఫార్మాట్‌లో అయినా అత్యధిక సెంచరీలు సాధించిన ఏకైక బ్యాట్స్‌మెన్‌గా నిలిచి, సచిన్ టెండూల్కర్ రికార్డును అధిగమిస్తాడు. ఈ అరుదైన రికార్డు కోసం యావత్ క్రికెట్ ప్రపంచం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యంత వేగంగా పరుగులు సాధించిన ఆటగాళ్ల జాబితాలో కూడా కోహ్లీ ముందున్నాడు. విరాట్ 28,000 అంతర్జాతీయ పరుగులు పూర్తి చేయడానికి 327 పరుగులు మాత్రమే అవసరం. రాబోయే 23 ఇన్నింగ్స్‌లలో విరాట్ ఈ పరుగులు చేస్తే, అత్యంత వేగంగా 28,000 పరుగులు సాధించిన బ్యాట్స్‌మెన్‌గా సచిన్ టెండూల్కర్ రికార్డును కూడా బద్దలు కొట్టే అవకాశం ఉంది. అలాగే, ప్రస్తుతం విరాట్ ఖాతాలో 27,673 అంతర్జాతీయ పరుగులు ఉన్నాయి. అతను కేవలం 344 పరుగులు చేస్తే, శ్రీలంక దిగ్గజం కుమార సంగాక్కర (28,016 పరుగులు)ను అధిగమించి, సచిన్ టెండూల్కర్ తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక పరుగులు సాధించిన రెండవ బ్యాట్స్‌మెన్‌గా నిలుస్తాడు. ఈ సిరీస్‌లో విరాట్ సౌతాఫ్రికాపై, భారత గడ్డపై కూడా అనేక ప్రత్యేక రికార్డులు సాధించే అవకాశం ఉంది. కేవలం ఒక సెంచరీ సాధిస్తే, సౌతాఫ్రికాపై 6 వన్డే సెంచరీలు చేసిన ప్రపంచంలోనే ఏకైక బ్యాట్స్‌మెన్‌గా నిలుస్తాడు. అలాగే, గెలిచిన మ్యాచ్‌లలో మరో 14 పరుగులు చేస్తే, సౌతాఫ్రికాపై భారత్ విజయాలలో 1000 వన్డే పరుగులు చేసిన తొలి భారతీయుడిగా రికార్డు సృష్టిస్తాడు. SENA (సౌతాఫ్రికా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా) దేశాలపై గెలిచిన వన్డే మ్యాచ్‌లలో అత్యధిక పరుగులు చేసిన ప్రపంచ రికార్డుకు కేవలం 16 పరుగులు దూరంలో మాత్రమే ఉన్నాడు. స్వదేశంలో ఒక 50ం స్కోరు సాధిస్తే, భారత గడ్డపై వన్డేల్లో అత్యధిక 50ం స్కోర్లు చేసిన రికార్డును సొంతం చేసుకుంటాడు. అంతేకాకుండా, ఒక హాఫ్ శతకం సాధిస్తే, దేశీయ మైదానాల్లో 100 హాఫ్ సెంచరీలు పూర్తి చేసుకున్న ఏకైక ఆటగాడిగా అరుదైన మైలురాయిని చేరుకుంటాడు.

## ఆయుష్ మాత్రే సిక్సర్ల వర్షం



2025-26 సయ్యద్ ముష్తాక్ అలీ ట్రోఫీ 2025-26) లో భాగంగా జరిగిన ఎలైట్ గ్రూప్ %ూ% మ్యాచ్‌లో విదర్భ, ముంబై జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో ముంబై 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. భారతరత్న శ్రీ అటల్ బిహారీ వాజ్‌పేయి ఎకానా క్రికెట్ స్టేడియంలో జరిగిన ఈ టీ20 మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన విదర్భ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 192 పరుగులు చేసింది. ఈ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ముంబై కేవలం 17.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి విజయం సాధించింది. ముంబై తరపున అద్వితీయ సెంచరీ చేసిన ఆయుష్ మాత్రే ఈ విజయానికి ప్రధాన రూపశిల్పి అయ్యాడు. మ్యాచ్ ప్రారంభంలో, టాస్ గెలిచిన ముంబై కెప్టెన్ ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. ముందుగా బ్యాటింగ్ చేసిన విదర్భ తొలి వికెట్‌కు 115 పరుగులు జోడించడం ద్వారా మంచి ఆరంభాన్ని ఇచ్చింది. అథర్వ టైడే 64 పరుగులు, అమన్ మొఖడే 61 పరుగులు సాధించారు. అయితే, ఈ ఇద్దరు ఆటగాళ్లు అవుట్ అయిన తర్వాత ఆరుగురు బ్యాట్స్‌మెన్ రెండంకెల స్కోరును చేరుకోకపోవడంతో విదర్భ ఇన్నింగ్స్ కుప్పకూలింది. ఒకప్పుడు 200 కంటే ఎక్కువ స్కోరు చేసిన విదర్భ చివరికి 192 పరుగులకే ఆలౌట్ అయింది. ఈ భారీ స్కోరును ఛేదించే క్రమంలో, 18 ఏళ్ల ఆయుష్ మాత్రే ముంబై తరపున చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడాడు. ఆయుష్ మాత్రే కేవలం 53 బంతుల్లోనే అజేయంగా 110 పరుగులు చేశాడు. ఈ ఇన్నింగ్స్‌లో, ఆయుష్ మాత్రే 8 ఫోర్లు, 8 సిక్సర్లు బాదాడు. అతను కేవలం ఫోర్ల ద్వారా 80 పరుగులు చేశాడు. ఆయుష్ మాత్రేతో పాటు సూర్యకుమార్ యాదవ్ కూడా 30 బంతుల్లో 35 పరుగులు చేశాడు. అదే సమయంలో, శివమ్ దూబే 19 బంతుల్లో 205.26 స్ట్రైక్ రేట్‌తో అజేయంగా 39 పరుగులు చేసి జట్టును విజయపథంలో నడిపించాడు. శివమ్ దూబే కూడా 3 ఫోర్లు, 3 సిక్సర్లు బాదాడు. ఫలితంగా, ముంబై కేవలం 3 వికెట్లు మాత్రమే కోల్పోయి ఈ భారీ లక్ష్యాన్ని ఛేదించింది.

### రాంచీ వేదికగా జరగనున్న మొదటి మ్యాచ్
### వన్డే సిరీస్‌లో సత్తా చాటాలని భావిస్తోన్న భారత్





రాంచీ: టెస్ట్ సిరీస్‌లో ఘోరంగా ఓడిపోయి దాదాపు అయిదారు దశాబ్దాల చెత్త రికార్డులను ఖాతాలో వేసుకున్న టీమిండియా వన్డే సిరీస్‌లో సత్తా చాటాలని భావిస్తోంది. ముఖ్యంగా హెడ్ కోచ్ గౌతం గంభీర్ తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో భారత్, దక్షిణాఫ్రికా మధ్య వన్డే సిరీస్ కోసం రెండు జట్లు సిద్ధంగా ఉన్నాయి. వన్డే సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్ నవంబర్ 30, 2025న రాంచీ వేదికలో భారత్, దక్షిణాఫ్రికా జట్లు తలపడనున్నాయి. టెస్ట్ సిరీస్ ఓటమికి భారత్ ప్రతీకారం తీర్చుకుంటుందని క్రికెట్ ప్రేమికులు ఆశగా ఎదురుచూస్తున్నారు. అందుకు కారణంగా దిగ్గజ ఆటగాళ్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వంటి పెద్ద ఆటగాళ్ళు జట్టులో ఉన్నారు. కనుక వన్డే సిరీస్ కోసం అభిమానులు చూస్తున్నారు. పటిష్ట టీమిండియా వన్డే సిరీస్ లో సఫారీలపై నెగ్గుతారని సంకేతాలు కనిపిస్తున్నాయి. భారత్, దక్షిణాఫ్రికా మధ్య మొదటి వన్డే రాంచీలో స్టేడియం కాంప్లెక్స్‌లో ఆదివారం నాడు జరగనుంది. అయితే స్టేడియానికి వెళ్లి చూడలేని వారు హాయిగా ఇంట్లో కూర్చుని లైవ్ స్ట్రీమింగ్, టీవీ ప్రసార ఆప్షన్లు ఉన్నాయి. వాటి గురించి క్రికెట్ అభిమానులు తెలుసుకోవాలి. ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌లో రాణించిన సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ మళ్లీ మైదానంలోకి అడుగుపెట్టనున్నారు. దీంతో అభిమానుల చూపులన్నీ వాళ్లపైనే ఉండనున్నాయి. ఈ ఇద్దరూ బ్యాటింగ్‌లో రాణిస్తే, జట్టుకు భారీ స్కోర్ ఖాయం. సౌతాఫ్రికాపై విరాట్ గత రికార్డులు బాగుండడం, రోహిత్ శర్మ భీకర ఫామ్‌లో ఉండడం భారత్‌కు కలిసొచ్చే అంశాలు. ఇక రెగ్యులర్ కెప్టెన్ శుభమన్ గిల్, శ్రేయస్ అయ్యర్ గాయం కారణంగా దూరమయ్యారు. మహమ్మద్ షమి, బుమ్రా, సిరాజ్ లాంటి సీనియర్ పేసర్లలో ఒక్కరూ లేకుండా ఒక పెద్ద జట్టుతో భారత్ వన్డే సిరీస్ ఆడుతుండడం చాలా ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి. బలమైన బ్యాటింగ్ లైనప్ ఉన్న సౌతాఫ్రికాను భారత యువ పేసర్లు ఏ మేరకు కట్టడి చేస్తారనేది ఆసక్తికరంగా మారింది. కెప్టెన్ గిల్ గైర్హాజరులో సీనియర్ ఆటగాడు KL రాహుల్ జట్టును నడిపించనున్నాడు. రోహిత్‌కుతో యశస్వీ జైస్వాల్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించనున్నాడు. తర్వాత విరాట్ రానున్నాడు. తిలక్ వర్మ, రిషభ్ పంత్, KL రాహుల్‌తో పటిష్ఠ బ్యాటింగ్ లైనప్ ఉంది. మరో సీనియర్ రవీంద్ర జడేజాకు తుది జట్టులో చోటు ఖాయం కాగా, అతడికి తోడు మరో ఆల్‌రౌండర్‌గా వాషింగ్టన్ సుందర్ లేదా నితీశ్ కుమార్ రెడ్డిని ఎంచుకునే అవకాశం ఉంది. వన్డేలేలో కెప్టెన్‌గా కేఎల్ రాహుల్ రికార్డ్ మెరుగ్గానే ఉంది. ఇప్పటిదాకా 12 మ్యాచ్‌ల్లో టీమ్‌ఇండియాకు రాహుల్ నాయకత్వం వహించాడు. అందులో 8 వన్డేల్లో భారత్ గెలిచింది. మరో నాలుగింట్లో ఓడింది. ఓవరాల్‌గా విన్నింగ్ పర్సెంటేజీ 67 శాతంగా ఉంది.

సీనియర్లకు లేకపోవడంతో అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా, ప్రసిద్ధ్ కృష్ణకు తొలి వన్డేలో ఛాన్స్ దక్కే ఛాన్స్ ఉంది. మరి ఈ యువ ఆటగాళ్లు అనుభవజ్ఞులైన సఫారీ బ్యాటర్లకు ఎలా కల్లెం వేస్తారో చూడాలి. ఒకరకంగా చెప్పాలంటే ఈ పేస్ త్రయానికి మాత్రం సౌతాఫ్రికా సిరీస్ కఠిన పరీక్ష కానుంది. టెస్టు సిరీస్ గెలిచిన ఉత్సాహంలో ఉన్న సఫారీలు వన్డే సిరీస్‌లోనూ సత్తాచాటాలని పట్టుదలతో ఉన్నారు. కెప్టెన్ బవుమా, మార్‌క్రమ్, రికిల్‌టన్, డికాక్, డేవిడ్ బ్రెవిస్, బ్రీట్జ్‌కేలతో బ్యాటింగ్ విభాగం దుర్భేద్యంగా కనిపిస్తోంది. కార్బిన్ బాష్, మార్కో యాన్సెన్ వంటి నాణ్యమైన ఆల్‌రౌండర్లు ఉండగా స్పిన్ భారం కేశవ్ మహారాజ్ మోయనున్నాడు. స్టార్ పేసర్లు రబాడా, నోకియా దూరమైన నేపథ్యంలో ఎంగిడి నేతృత్వంలోని బౌలింగ్ దళం ఎంతమేర రాణిస్తోందో చూడాలి. నెమ్మదిగా ఉండే రాంచీ పిచ్‌పై భారీ స్కోర్లు నమోదయ్యే అవకాశం లేదు. టాస్ గెలిచిన జట్టు తొలుత బౌలింగ్ తీసుకునే అవకాశం ఉంది. కాగా టీమిండియా, దక్షిణాఫ్రికా మధ్య రాంచీ వేదికగా జరగనున్న మొదటి వన్డే మ్యాచ్ జియోహాట్‌స్టార్ యాప్, జియో హాట్‌స్టార్ వెబ్‌సైట్‌లో ప్రత్యక్షంగా ప్రసారం చేయనున్నారు. భారత కాలమానం ప్రకారం ఆదివారం మధ్యాహ్నం 1:30 గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. ఎప్పటిలాగే, మ్యాచ్‌ని చూడటానికి అభిమానులు జియో హాట్‌స్టార్ సబ్‌స్క్రిప్షన్ కలిగి ఉండాలి. టీవీలో భారత్, దక్షిణాఫ్రికా మధ్య వన్డే ఇంటర్నేషనల్ మ్యాచ్ చూడాలనుకునే వారు స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్ ఛానెల్‌లలో మ్యాచ్ లైవ్ చూడవచ్చు. టాస్ ఆట ప్రారంభానికి 30 నిమిషాల ముందు, అంటే మధ్యాహ్నం 1:00 గంటలకు వేస్తారు. టాస్ తర్వాత భారత్, దక్షిణాఫ్రికా జట్ల ప్లేయింగ్ %శ×% ప్రకటిస్తారు. మధ్యాహ్నం 1.30 గంటలకు డే అండ్ నైట్ వన్డే ప్రారంభం కానుంది. వాస్తవానికి భారత్‌లో సిరీస్ కనుక ఉదయం వేళ నుంచి సాయంత్రం వరకు మ్యాచ్ ఉంటుందని ఆశించిన ఫ్యాన్సుకు నిరాశే ఎదురవుతోంది.

**భారత్, దక్షిణాఫ్రికా వన్డే సిరీస్: పూర్తి స్క్వాడ్‌లు**

భారత్ పూర్తి ఆటగాళ్లు- రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్, విరాట్ కోహ్లీ, కెఎల్ రాహుల్ (కెప్టెన్), తిలక్ వర్మ, రిషబ్ పంత్, వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, నితీష్ కుమార్ రెడ్డి, రుతురాజ్ గైక్వాడ్, హర్షిత్ రాణా, ప్రసిద్ధ్ కృష్ణ, అర్ష్‌దీప్ సింగ్, ధ్రువ్ జురెల్

దక్షిణాఫ్రికా పూర్తి ఆటగాళ్లు - టెంబా బావుమా (కెప్టెన్), ఓట్నీల్ బార్ట్‌మన్, మాథ్యూ బ్రీట్జ్‌కే, ర్యాన్ రికెల్టన్, ఐడెన్ మార్క్రమ్, కార్బిన్ బోష్, డెవాల్డ్ బ్రెవిస్, నాంద్రే బర్గర్, క్వింటన్ డి కాక్, రూబిన్ హెర్మన్, కేశవ్ మహారాజ్, టోనీ డి జోర్జీ, మార్కో జాన్సెన్, లుంగి ఎంగిడి, ప్రెనెలాన్ సుబ్రాయెన్

## టీమిండియాలో ద్రవిడ్, లక్ష్మణ్‌లాంటి బ్యాటర్లు లేరు

**క్రీజులో పాతుకుపోయి ఓపికగా ఆడే నైపుణ్యం లేదు**
**క్రికెట్ దిగ్గజం కపిల్ దేవ్ కీలక వ్యాఖ్యలు**



ప్రస్తుత భారత జట్టులో రాహుల్ ద్రవిడ్, వీవీఎస్ లక్ష్మణ్‌లాంటి స్పెషలిస్ట్ టెస్ట్ బ్యాటర్లు లేరని క్రికెట్ దిగ్గజం కపిల్ దేవ్ అన్నాడు. టీ20, వన్డేలు ఎక్కువగా ఆడటంతో క్రీజులో పాతుకుపోయి ఓపికగా ఆడే నైపుణ్యం భారత బ్యాటర్లకు లేకుండా పోయిందని అభిప్రాయపడ్డాడు. సౌతాఫ్రికాతో రెండు టెస్టల సిరీస్‌లో టీమిండియా క్లీన్ స్వీప్ అయిన సంగతి తెలిసిందే. ఈ ఘోర పరాజయంతో టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌పై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, అశ్విన్ టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలకడంతో భారత్ జట్టు సంధి దశలో ఉంది. తాజాగా భారత జట్టు ప్రదర్శనపై స్పందించిన కపిల్ దేవ్.. ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'ప్రస్తుతం భారత ఆటగాళ్లు ఎక్కువగా టీ20లు, వన్డే మ్యాచ్‌లు ఆడుతున్నారు. దాంతో బ్యాటర్లకు బౌలింగ్‌కు అనుకూలించే పిచ్‌లపై ఆడే అవకాశం రావడం లేదు. స్పిన్, పేస్‌కు అనుకూలించే పిచ్‌లపై బ్యాటర్లు చాలా ఓపికగా ఆడాలి. అలాగే ప్రత్యేకమైన నైపుణ్యం కలిగి ఉండాలి. ప్రస్తుతం మన దగ్గర క్రీజులో పాతుకుపోయే రాహుల్ ద్రవిడ్, వీవీఎస్ లక్ష్మణ్ వంటి స్పెషలిస్ట్ బ్యాటర్లు లేరు. టెస్టుల్లో బ్యాటింగ్ అంటే క్రీజులో పాతుకుపోవడమే. స్పిన్, పేస్‌ను సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే ప్రత్యేకమైన నైపుణ్యం ఉండాలి. కానీ టర్న్, బౌన్స్ ఎక్కువగా ఉండే పిచ్‌లపై బ్యాటింగ్ చేయడం అంత సులువు కాదు. ఈ తరహా పిచ్‌లపై ఫుట్‌వర్క్ చాలా కీలకం. కానీ రిషభ్ పంత్ శైలి వేరు. ఎందుకంటే దూకుడుగా ఆడటమే అతని స్టైల్. రిషభ్ పంత్‌ను డిఫెన్స్ ఆడమని మనం చెప్పలేం. ఎందుకంటే పంత్ సిక్స్‌లు, ఫోర్లతో ఎదురువిరుచుకుపడి, ప్రత్యర్థి జట్టును కకావికలం చేయగల సమర్థుడు. అలాంటి నైపుణ్యమున్న అతనికి మనం నెమ్మదిగా ఆడి 100 బంతుల్లో 20 పరుగులు చేయమని చెప్పలేం. అతను అలా చేయలేడు కూడా'అని కపిల్ దేవ్ అభిప్రాయపడ్డాడు.

## స్ట్రాంగ్ స్క్వాడ్‌ను సిద్ధం చేసిన ముంబై ఇండియన్స్

### మహిళా ప్రీమియర్ లీగ్ కోసం భారీ కసరత్తు

రెండుసార్లు మహిళా ప్రీమియర్ లీగ్ ఛాంపియన్ అయిన ముంబై ఇండియన్స్, మహిళా ప్రీమియర్ లీగ్ 2026 సీజన్ కోసం ఒక స్ట్రాంగ్ స్క్వాడ్‌ను సిద్ధం చేసింది. వేలానికి ముందు ఐదుగురు కీలక ఆటగాళ్లను రిటైన్ చేసుకున్న ముంబై ఇండియన్స్, వేలంలో న్యూజిలాండ్ స్టార్ ప్లేయర్ అమెలియా కెర్ కోసం ఏకంగా రూ.3 కోట్ల భారీ మొత్తాన్ని వెచ్చించింది. పాత ఆటగాళ్లైన షబ్నిమ్ ఇస్మాయిల్, సంస్కృతి గుప్తా, సజన సజీవన్ మళ్లీ జట్టులోకి రావడంతో ముంబై జట్టు మరింత పటిష్టంగా కనిపిస్తోంది. ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీ యజమాని నీతా అంబానీ, తాము గతేడాది జట్టులోని ఎక్కువ మంది ఆటగాళ్లను తిరిగి కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. నవంబర్ 27) జరిగిన మహిళా ప్రీమియర్ లీగ్ వేలం గురించి మాట్లాడిన ముంబై ఇండియన్స్ సహ-యజమాని నీతా అంబానీ, వేలం రోజు చాలా ఉత్సాహంగా, కొన్నిసార్లు టెన్షన్‌గా కూడా గడిచిందని అన్నారు. 2025లో ఛాంపియన్‌గా నిలిచిన జట్టులోని ఎక్కువ మంది ఆటగాళ్లను తిరిగి కొనుగోలు చేయడమే తమ ప్రధాన వ్యూహమని ఆమె వెల్లడించారు. కీలకమైన ఆటగాళ్లు తిరిగి జట్టులోకి రావడం పట్ల ఆమె సంతోషం వ్యక్తం చేశారు. వేలంలో అమెలియా కెర్ తిరిగి జట్టులోకి రావడం అలాగే షబ్నిమ్ ఇస్మాయిల్, సైకా ఇషాక్, సజన సజీవన్, సంస్కృతి గుప్తా వంటి నలుగురు భారతీయ ప్లేయర్లు మళ్లీ రావడం ముంబై ఇండియన్స్‌కు పెద్ద బలం అని ఆమె అన్నారు. అంతేకాకుండా రాహిలా ఫిర్దౌస్, నల్లా క్రాంతి రెడ్డి, త్రివేణి వశిష్ఠ వంటి యువ ప్రతిభావంతులతో పాటు, పూనమ్ ఖేమ్నార్, మిల్లీ ఇల్లింగ్‌వర్త్, నికోలా కేరీలను కూడా ముంబై ఇండియన్స్ ఫ్యామిలీలోకి స్వాగతించారు. ముంబై ఇండియన్స్ జట్టు ఇప్పటికే కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌తో పాటు, నాట్ సైవర్-బ్రంట్, హేలీ మాథ్యూస్, అమన్‌జోత్ కౌర్, జి కమలిని వంటి ఐదుగురు కీలక ఆటగాళ్లను రిటైన్ చేసుకుంది. వేలంలో ఇటీవల టీ20 ప్రపంచ కప్ ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్?గా నిలిచిన అమెలియా కెర్, ఫాస్ట్ బౌలర్ షబ్నిమ్ ఇస్మాయిల్ తిరిగి రావడం కోర్ టీమ్‌ను మరింత పటిష్టం చేసింది. ప్రపంచ కప్ విజేత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ కూడా న్యూఢిల్లీలో జరిగిన వేలానికి హాజరై, వేలం టేబుల్‌పై వ్యూహాలను రచించడంలో కీలక పాత్ర పోషించారు. వేలంలో తన అనుభవం గురించి కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ మాట్లాడుతూ.. "నేను మొదట్లో కొంచెం కంగారు పడ్డాను, కానీ మేము ప్రణాళిక చేసిన విధానం, అందరి భాగస్వామ్యం నాకు చాలా బాగా నచ్చింది. నీతా అంబానీ ఎప్పుడూ జట్టుకు సపోర్టుగా ఉండి మాకు అండగా నిలుస్తారు. మా పాత సహచరులలో ఎక్కువ మందిని మేము తిరిగి పొందాము. ఇది ఆ ఆటగాళ్లపై జట్టుకు ఉన్న నమ్మకాన్ని చూపుతుంది" అని అన్నారు. ముంబై ఇండియన్స్ విజయాలలో సైకా, సజన, సంస్కృతి వంటి ఇండియన్ ప్లేయర్లు కీలక పాత్ర పోషించారు. వారు టోర్నమెంట్‌లో ఎదుగుతున్న స్టార్ ప్లేయర్‌లుగా నిలిచారు. ముంబై ఇండియన్స్ జట్టు.. అనేక ప్రపంచ కప్‌ల విజేత అయిన నికోలా కేరీ, యువ ఫాస్ట్ బౌలర్ మిల్లీ ఇల్లింగ్‌వర్త్ అనే ఆస్ట్రేలియన్ జోడీని కూడా తమ జట్టులో చేర్చుకుంది. అలాగే యంగ్ ఇండియన్ టాలెంటుకు సపోర్ట్ ఇచ్చే తమ విధానానికి అనుగుణంగా, భారతీయ ఆల్‌రౌండర్‌లు నల్లా క్రాంతి రెడ్డి, త్రివేణి వశిష్ఠ్‌లను కూడా కొనుగోలు చేసింది. వీరిద్దరూ తొలిసారి డబ్ల్యూపీఎల్ లో ఆడనున్నారు.




# ఓటిటి వేదికగా శివ విడుదల చేస్తాం: నాగ్

ఒకప్పటి కల్ట్ క్లాసిక్ 'శివ' ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి మరోసారి సందడి చేసిన క్రమంలో.. ఇప్పుడీ చిత్రాన్ని ఓటీటీలోకి అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని నాగార్జున చెప్పారు. తాజాగా గోవా వేదికగా జరిగిన ఇఫి వేడుకలో ఆయన పాల్గొన్నారు. 'శివ' గురించి, ఏయన్నార్ చిత్రాల గురించి మాట్లాడారు. శివ' రీరిలీజ్ వెర్షన్ ఓటీటీలో విడుదల చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి . ఇప్పటికే పలు సంస్థలతో చర్చలు జరిపాం. ఎంతో కష్టపడి దీన్ని 4కే వెర్షన్‌లోకి మార్చాం. అందరూ చూసి ఎంజాయ్ చేయాలనే తపనతోనే ఓటీటీలో విడుదల చేయాలని అనుకుంటున్నాం. ఇప్పుడు గొప్ప టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది. సినిమాలను 4కే లోకి ఎలా మార్చాలో అర్థమైంది. ఏఐ వచ్చిన తర్వాత ప్రతి పని సులభమైంది. అన్నపూర్ణ స్టూడియోస్‌లో మంచి సాంకేతికత అందుబాటులో ఉందని చెప్పారు. ఏయన్నార్ అలనాటి అనేక అపూర్వ సినిమాలను 4కే వెర్షన్‌లోకి మార్చాలంటే నెగెటివ్స్ లేవని చెప్పారు. అధునాతన సాంకేతిక హంగులతో ఏయన్నార్ పాత చిత్రాలను మళ్లీ ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని ఉన్నా.. రైట్స్, నెగెటివ్స్ లేకపోవడంతో సాధ్యం కావట్లేదని నాగార్జున తెలిపారు. తన 100వ చిత్రం నుంచి కూడా త్వరలోనే అప్‌డేట్స్ వస్తాయని తెలిపారు. అలాగే అఖిల్ తదుపరి చిత్రం 'లెనిన్' పనులు శరవేగంగా జరుగుతున్నాయని వెల్లడించారు.



## ప్రభాస్ లుక్ కనిపించకుండా వంగా జాగ్రత్తలు

### ఆరు నెలలపాటు పబ్లిక్ ఈవెంట్‌లకు దూరంగా రెబల్



ప్రభాస్, సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో రానున్న మోస్ట్-అవైటెడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రం 'స్పిరిట్' గురించి ఒక ఆసక్తికరమైన వార్త ప్రస్తుతం టాలీవుడ్‌లో చర్చనీయాంశమైంది. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఇటీవల మొదలవ్వగా, దర్శకుడు సందీప్ వంగా ప్రభాస్ లుక్ విషయంలో అత్యంత గోప్యత పాటిస్తున్నట్లు తెలుస్తోంది. తాజా సమాచారం ప్రకారం 'స్పిరిట్' సినిమాలోని ప్రభాస్ పాత్ర లుక్‌ను అభిమానులకు సర్‌ప్రైజ్‌గా ఉంచాలని సందీప్ వంగా గట్టిగా నిర్ణయించుకున్నారు. అందుకే, ఈ లుక్ లీక్ అవ్వకుండా ఉండేందుకు, రాబోయే ఆరు నెలల పాటు ప్రభాస్‌ని పబ్లిక్ ఈవెంట్స్‌కు దూరంగా ఉండాలని కోరినట్లు సమాచారం. పబ్లిక్ ఈవెంట్లు, ఎయిర్‌పోర్ట్‌లలో ప్రభాస్ కనిపిస్తే, ఆయన లుక్‌ను అభిమానులు లేదా మీడియా ఫొటోలు తీసే అవకాశం ఉంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని, కొన్ని నెలల పాటు ఎలాంటి ప్రచార కార్యకలాపాలు లేదా బహిరంగ కార్యక్రమాలకు హాజరు కాకూడదని ప్రభాస్, సందీప్ వంగా నిర్ణయించుకున్నట్లుగా వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నిర్ణయం ప్రభాస్ అభిమానులను కొంత నిరాశపరిచినా సందీప్ వంగా ప్రభాస్‌ను ఏ విధంగా ప్రెజెంట్ చేయబోతున్నారో చూడాలనే ఉత్సాహం మాత్రం వారిలో ఎక్కువగా ఉంది. 'స్పిరిట్' చిత్రంలో త్రిప్తి దిమ్రి కథానాయికగా నటిస్తుండగా, వివేక్ ఒబెరాయ్, ప్రకాశ్ రాజ్, కాంచన ఇతర ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. ఈ భారీ చిత్రం 2027లో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది.




## వారణాసి టైటిల్ సమస్య ఎదుర్కొంటోందా?

ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి, సూపర్‌స్టార్ మహేశ్ బాబు కాంబినేషన్‌లో రానున్న క్రేజీ ప్రాజెక్ట్ 'వారణాసి' పై ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రియుల్లో భారీ అంచనాలు నెలకొన్న విషయం తెలిసిందే. 2027లో రాబోతున్న ఈ సినిమా కోసం అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే, ఈ సినిమా టైటిల్‌ను ప్రకటించినప్పటి నుంచి సోషల్ మీడియాలో పలు రకాల వార్తలు చక్కర్లు కొడుతున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా 'వారణాసి' అనే టైటిల్‌ను తెలుగులో గతంలోనే వేరే నిర్మాణ సంస్థ రిజిస్టర్ చేసుకున్నట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. తాజాగా ఈ టైటిల్ వివాదం పరిష్కారమైనట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. వేరే నిర్మాణ సంస్థ కేవలం తెలుగులో మాత్రమే ఈ టైటిల్‌ను రిజిస్టర్ చేసుకోవడంతో, చిత్ర బృందం తెలుగు వెర్షన్ టైటిల్‌లో స్వల్ప మార్పు చేయాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఈ సినిమా పలు భాషల్లో విడుదల కానున్నందున, తెలుగులో మాత్రం 'రాజమౌళి వారణాసి' అనే పేరుతో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు తెలుస్తోంది. ఇతర అన్ని భాషల్లో మాత్రం 'వారణాసి' అనే ఒరిజినల్ టైటిల్‌నే కొనసాగించనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. దీనిపై చిత్ర యూనిట్ త్వరలో అధికారిక ప్రకటన విడుదల చేసే అవకాశం ఉంది. ఖలేజా సినిమా టైంలో కూడా ఇలా టైటిల్ వివాదం ఎదుర్కోగా.. మేకర్స్ ఆలోచించి మహేశ్ ఖలేజా అనే పేరుతో విడుదల చేయగా.. వివాదం సద్దుమణిగింది.

## స్పిరిట్‌లో హిందీనటి కాజోల్ నటిస్తుందా?


ప్రభాస్ హీరోగా, దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న హై-వోల్టేజ్ యాక్షన్ డ్రామా 'స్పిరిట్'. ఈ చిత్రం మెగాస్టార్ చిరంజీవి చేతుల మీదుగా ఇటీవల పూజా కార్యక్రమాలు పూర్తి చేసుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ జరుపుకుటుండగా.. ఈ ప్రాజెక్ట్ గురించి ఇండస్ట్రీలో ఒక ఆసక్తికరమైన వార్త ప్రస్తుతం జోరుగా వినిపిస్తోంది. ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో బాలీవుడ్ సీనియర్ స్టార్ హీరోయిన్ కాజోల్ దేవగన్ కీలక పాత్ర పోషించనున్నట్లు తెలుస్తుంది. 'స్పిరిట్' చిత్రంలో మొదట హీరోయిన్ పాత్ర కోసం బాలీవుడ్ నటి కరీనా కపూర్ పేరు వినిపించినప్పటికీ, ఆమె ఆ రూమర్‌లను ఖండించారు. ఇప్పటికే ఈ చిత్రంలో హీరోయిన్‌గా త్రిప్తి దిమ్రి ఎంపికయ్యారు. తాజాగా అందిన సమాచారం ప్రకారం, 'స్పిరిట్'లో ఒక శక్తివంతమైన పాత్ర కోసం దర్శకుడు సందీప్ రెడ్డి వంగా బాలీవుడ్ నటి కాజోల్‌ను సంప్రదించినట్లు తెలుస్తోంది. కాజోల్‌కి కూడా స్క్రిప్ట్ బాగా నచ్చిందని ఆమె ఈ ప్రాజెక్ట్‌లో భాగమవడానికి పాజిటివ్‌గా స్పందించినట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ఈ వార్త నిజమైతే, 'స్పిరిట్' కాజోల్‌కు మొదటి తెలుగు సినిమా కానుంది. ఆమె ఇంతకుముందు కొన్ని తమిళ చిత్రాలలో నటించినప్పటికీ, తెలుగులో ఇప్పటివరకు నటించలేదు. కాజోల్ లాంటి నటి 'స్పిరిట్' టీంలో చేరితే, ఈ పాన్-ఇండియా ప్రాజెక్ట్‌కు మరింత బలం, క్రేజ్ వస్తుందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఈ వార్తపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

## అప్పులు తీర్చిన ఆపద్బాంధవుడు శ్రీవిష్ణు

### దర్శకుడు వేణు వుడుగుల ఎమోషన్



తెలంగాణ నేపథ్యంలో వాస్తవిక అంశాలతో కూడిన సినిమాలు తీసే దర్శకుడిగా పేరు తెచ్చుకున్న వారిలలో వేణు వుడుగుల ఒకరు. నీది నాది ఒకే కథ(2018), విరాట పర్వం ఇలా తీసింది రెండు చిత్రాలే అయిన మంచి దర్శకుడిగా స్థానాన్ని నిలుపుకున్నాడు. తాజాగా అతడి నిర్మాణంలో వచ్చిన చిత్రం రాజు వెడ్స్ రాంబాయి. రూరల్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చిన ఈ చిత్రం సూపర్‌హిట్‌ను అందుకుంది. అయితే ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా వేణు ఉడుగుల మాట్లాడుతూ.. తన మొదటి సినిమా హీరో శ్రీవిష్ణు చేసిన సహాయాన్ని గుర్తు చేసుకుని ఇటీవల భావోద్వేగానికి లోనయ్యారు. శ్రీవిష్ణు కథానాయకుడిగా వేణు దర్శకత్వంలో వచ్చిన చిత్రం 'నీది నాది ఒకే కథ' (2018). ఈ సినిమా సమయంలో తన ఆర్థిక ఇబ్బందుల గురించి వేణు తాజాగా మాట్లాడుతూ.. నా మొదటి సినిమా ప్రయాణాన్ని ప్రారంభించినప్పుడు, నేను కొన్ని తీవ్రమైన ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నాను. అప్పులు చాలా ఉండేవి. ఒకరోజు నన్ను శ్రీవిష్ణు చూసి ఎందుకు మీరు ఇలా ఉంటారు ఎప్పుడు ఏదో బాధతో అని అడిగాడు. ఏమైన అప్పులు ఉన్నాయా అంటూ తెలుసుకున్నాడు. నేను కూడా చిన్న చిన్నవే అంటూ చెప్పాను. దీంతో నా పరిస్థితి తెలుసుకున్న శ్రీ విష్ణు ఆ మరుసటిరోజే నాకున్న అప్పులన్నీ తీర్చేశాడు. ఆయనకు ఏం అవసరం ఇది చేయడానికి.. అయిన కూడా చేశాడు. ఆరోజు శ్రీవిష్ణు చేసిన సహాయాన్ని నేను ఎప్పటికీ మర్చిపోలేను. ఆయన నా సినిమాకు కేవలం హీరో మాత్రమే కాదు, నా కష్టకాలంలో నాకు అండగా నిలబడిన ఒక దైవంగా భావిస్తాను అంటూ వేణు చెప్పుకోచ్చాడు.



## దుమ్మురేపుతున్న .. పేరుగల్ల పెద్దిరెడ్డి ఫోక్ సాంగ్

తెలంగాణ జానపద గాయని, నృత్యకారిణి నాగదుర్గ నుంచి తాజాగా విడుదలైన పాట 'పేరుగల్ల పెద్దిరెడ్డి' ప్రస్తుతం యూట్యూబ్‌లో మరియు సోషల్ మీడియాలో దుమ్మురేపుతోంది. తెలంగాణ ఫోక్ సాంగ్స్‌తో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నాగదుర్గ, ఈ కొత్త పాటతో మరోసారి ప్రేక్షకులను ఆకర్షిస్తున్నారు. పేరుగల్ల పెద్దిరెడ్డి అంటూ వచ్చిన ఈ పాట తండ్రి మీద ప్రేమతో కూతురు చెబుతున్న నేపథ్యంలో ఉంది. పల్లెటూరి వాతావరణాన్ని, జానపద లయను ప్రతిబింబిస్తూ ఈ పాట ఆకట్టుకుంటుంది. ఎప్పటిలాగే, నాగదుర్గ ఈ పాటలో తనదైన శైలిలో చేసిన ఎనర్జిటిక్ డ్యాన్స్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. శుక్రవారం విడుదలైన ఈ పాట కొద్ది గంటల్లోనే యూట్యూబ్‌లో మిలియన్ల వ్యూస్‌ను సాధిస్తూ ట్రెండింగ్‌లో నిలిచింది. ప్లలె జానపద పాటల అభిమానుల మధ్య ఈ పాట క్రేజీ హిట్‌గా మారడంతో నాగదుర్గ ఖాతాలో మరో విజయవంతమైన జానపద పాట చేరింది. ఈ పాటకు బుల్లెట్ బండి లక్ష్మణ్ సాహిత్యం అందించగా.. మమత రమేష్ పాడింది. మదన్ కే సంగీతం అందించాడు.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **98660 19778, 89789 60131**